
శతారుణ గీతాంజలి
రూ॥180/-
పేజీలు:180



నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

శుభాకాంక్షలు



పాఠకులు, ప్రకటనకర్తలు, ఏజెంట్లు, శ్రేయోభిలాషులకు 'ప్రజాపక్షం' శ్రీరామనవమి శుభాకాంక్షలు.
- మేనేజ్‌మెంట్

సంపుటి 28, సంచిక: 272 | శుక్రవారం | 27-03-2026 | హైదరాబాద్ Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar పేజీలు: 12 | వెల రూ. 5.00

## రూ.2.19 లక్షల కోట్ల పెట్టుబడులు

దావోస్‌లో ఒప్పందాలు కుదిరినట్లు శాసనసభలో మంత్రి శ్రీధర్ బాబు ప్రకటన



ప్రజాపక్షం/హైదరాబాద్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని బృందం జరిపిన దావోస్ పర్యటనలు రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధిలో సరికొత్త అధ్యాయాన్ని సృష్టించాయని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. శాసనసభలో గురువారం ప్రశ్నోత్తరాల సమయంలో బిజెపి సభ్యులు కాటిపల్లి వెంకటరమణా రెడ్డి, పాయల్ శంకర్, ధన్‌పాల్ సూర్యనారాయణ అడిగిన ప్రశ్నలకు మంత్రి సుదీర్ఘ సమాధానం ఇచ్చారు. 2024, 2025 సంవత్సరాల్లో జరిపిన దావోస్ పర్యటనల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం మొత్తం రూ.2,19,182 కోట్ల పెట్టుబడులకు సంబంధించి 44 అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నదన్నారు. ఈ పెట్టుబడుల ద్వారా రాష్ట్రంలో తరువాయి 2లో

# వైద్యం, విద్యే ప్రధానం

● ఆరోగ్యశ్రీకి గత ప్రభుత్వం రూ.600 కోట్లు బకాయిపడింది ● ఆ భారాన్ని మోస్తూనే గడిచిన 27 నెలల్లో ఆరోగ్య శ్రీ, సిఎంఆర్‌ఎఫ్‌కు రూ.4,500 కోట్లు ఖర్చుచేశాం
● ఇప్పటివరకూ రూ.2,408.51 కోట్లు ఆరోగ్యశ్రీ నిధులు విడుదల చేశాం
● కిమ్స్, నిమ్స్‌తో పాటు కొత్తగా నిర్మిస్తున్న ఉస్మానియా ఆసుపత్రి ద్వారా 10వేల పడకలను అందుబాటులోకి తీసుకువస్తున్నాం
● శాసనసభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడి



ప్రజాపక్షం/హైదరాబాద్

ఎన్ని అడ్డంకులు ఎదురైనప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. శాసనసభలో గురువారం ప్రశ్నోత్తరాల సమయంలో సిఎం మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన 27 నెలల కాలంలో పేదల వైద్యం కోసం చేసిన ఖర్చు, ప్రవేశపెట్టనున్న తరువాయి 2లో

# అగ్నికీలల్లో బస్సు

## 14 మంది సజీవ దహనం

● పలువురికి తీవ్ర గాయాలు
● కాలి బూడిదైన వాహనాలు
● మార్కాపురం-ఒంగోలు హైవేపై ఘోర ప్రమాదం
● ప్రధాని మోదీ సంతాపం, సిఎం రేవంత్‌రెడ్డి దిగ్భ్రాంతి





**మార్కాపురం/అమరావతి:** ఎపిలోని మార్కాపురం జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో ప్రైవేటు ట్రావెల్స్ బస్సు దగ్ధం కాగా, 14 మంది మంటల్లో సజీవదహనమయ్యారు. 28 మందికి గాయాలయ్యాయి. వీరందరినీ మార్కాపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రాయవరం సమీపంలో గురువారం ఉదయం ఈ ప్రమాదం జరిగింది. పలకల క్వారీల వద్ద టిప్పర్‌ను ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొనగా... బస్సు నుంచి మంటలు ఎగిసిపడి పూర్తిగా దగ్ధమైంది. దురదష్టవశాత్తు అక్కడికక్కడే 13 మంది మృత్యువాతపడ్డారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మరొకరు మృతి చెందినట్లు అధికారులు వెల్లడించారు. హరికష్ణ ట్రావెల్స్‌కు చెందిన ఏసీ స్లీపర్ బస్సు మంగళవారం సాయంత్రం 5.30 గం.కు జగిత్యాల నుంచి కలిగిరికి బయల్దేరగా... మార్కాపురంఒంగోలు జాతీయ రహదారిపై రాయవరం సమీపంలో ఉదయం 6 గంటల సమయంలో ఘటన జరిగింది. మార్కాపురం దాటిన కొద్ది నిమిషాలకే ఎదురుగా వస్తున్న టిప్పర్‌ను బస్సు ఢీకొనడంతో 14 మంది ప్రాణాలు కోల్పోయారు. ప్రమాదం జరిగిన వెంటనే బస్సు, టిప్పర్ మంటల్లో చిక్కుకుని పూర్తిగా దగ్ధమయ్యాయి. ఎగిసిపడిన అగ్నిజ్వాలలు స్థానికులను భయాందోళనలకు గురిచేశాయి. ఈ ఘటనలో 13 మందికి తీవ్ర గాయాలు, మరో 15 మందికి స్వల్ప గాయాలు అయ్యాయి. తీవ్రంగా గాయపడిన వారిని ఒంగోలు ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. స్వల్ప గాయాలైన వారికి మార్కాపురం ప్రభుత్వాస్పత్రిలో వైద్యం అందిస్తున్నారు. బస్సులో ప్రయాణిస్తున్నవారిని కనిగిరి, పామూరు, కలిగిరి, వింజమూరు వాసులుగా గుర్తించారు.

**మృతుల కుటుంబాలకు రూ.7 లక్షలు ఎక్స్‌గ్రేషియా**

**ప్రధాని మోదీ సంతాపం**

బస్సు ప్రమాద మృతుల కుటుంబాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మొత్తంగా రూ.7లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాయి. ప్రధాని నరేంద్రమోదీ స్పందిస్తూ... ఆంధ్రప్రదేశ్ మార్కాపురం జిల్లాలో జరిగిన ప్రమాదం అత్యంత విషాదకరమన్నారు. బాధిత ప్రజలు, వారి కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షల ఎక్స్‌గ్రేషియా, గాయపడిన వారికి రూ. 50,000 పరిహారం ఇవ్వనున్నట్లు తెలిపారు. కాగా, మృతుల తరువాయి 2లో

## క్యూర్‌లో ఎంఎంటిఎస్ సేవలు

ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా సర్వీసులు నడపాలని అధికారులకు సిఎం ఆదేశం

ప్రజాపక్షం/హైదరాబాద్

హైదరాబాద్ కోర్ అర్బన్ (క్యూర్) ఏరియాలో ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా ఎంఎంటిఎస్ సర్వీసులు ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. కార్యాలయాల సమయాల్లో ఎంఎంటిఎస్‌ల సంఖ్య పెంచడంతో పాటు క్రమం తప్పకుండా సమయపాలన పాటిస్తూ సర్వీసులు నడపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎంఎంటిఎస్ సర్వీసులపై శాసనసమండలి హాల్‌లో గురువారం ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఎంఎంటిఎస్‌లో ప్రయాణి కుల తగ్గుముఖంపై ముఖ్యమంత్రి ఆరా తీశారు. ప్రధానంగా ఎంఎంటిఎస్ స్టేషన్ల వద్దకు ఆర్‌టిసి బస్సులు వెళ్లేందుకు అవకాశం లేకపోవడం, తరువాయి 2లో



## జర్నలిస్టులకు కనీస వేతనం, పెన్షన్

అసెంబ్లీలో కూనంనేని సాంబశివరావు డిమాండ్

సమస్యల పరిష్కారానికి మంత్రి సీతక్క హామీ

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలోని జర్నలిస్టుల సంక్షేమం కోసం ప్రభుత్వం తక్షణమే ప్రత్యేక చర్యలు చేపట్టాలని సిపిఐ శాసనసభా పక్ష నేత కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. శాసనసభలో గురువారం జీరో అవర్‌లో ఈ అంశాన్ని ఆయన ప్రస్తావించారు. జర్నలిస్టుల సమస్యలను తరువాయి 2లో

## నేడు సిఎంలతో ప్రధాని వీడియో కాన్ఫరెన్స్

**న్యూఢిల్లీ :** పశ్చిమ ఆసియా సంఘర్షణ నేపథ్యంలో, ఎన్నికలు జరగనున్న రాష్ట్రాలు మినహా, మిగిలిన అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం సమావేశం కానున్నారు. వారి సన్నద్ధత, ప్రణాళికలను సమీక్షించనున్నారని వర్గాలు తెలిపాయి. ఫిబ్రవరి 28న అమెరికా–ఇజ్రాయెల్ కూటమి ఇరాన్‌పై జరిపిన దాడితో ప్రారంభమైన పశ్చిమ ఆసియా సంఘర్షణపై ప్రధానమంత్రి ముఖ్యమంత్రులతో సమావేశం కావడం ఇదే మొదటిసారి. ఈ సంఘర్షణకు ప్రతిగా ఇరాన్ తన గల్ఫ్ పొరుగు దేశాలు, ఇజ్రాయెల్‌పై కూడా కాల్పులు జరిపింది. 'పశ్చిమ ఆసియా సంఘర్షణపై రాష్ట్రాల సన్నద్ధత, ప్రణాళికలను సమీక్షించేందుకు ప్రధానమంత్రి శుక్రవారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా ముఖ్యమంత్రులతో సమావేశమవుతారు. 'టీమ్ ఇండియా' తరువాయి 12లో

## శ్రీరామనవమి వేడుకలకు భద్రాచలం ముస్తాబు

● విద్యుత్ దీప కాంతులతో దేదీప్యమానంగా వెలుగొందుతున్న రామాలయం
● కల్యాణానికి హాజరు కానున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ● రూ.350 కోట్లతో ఆలయ అభివృద్ధి పనులకు శంకుస్థాపన



ప్రజాపక్షం/భద్రాచలం

దక్షిణ అయోధ్యగా భాసిల్లుతున్న భద్రాచలంలో లోక కల్యాణార్థం శ్రీ సీతారాముల కల్యాణ వేడుకను శుక్రవారం ఘనంగా నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి దేవస్థానం ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. దీంతో పట్టణం పండుగ శోభను సంతరించుకుంది. భూలోక వైకుంఠాన్ని తలపించే విధంగా ఆలయ ప్రాంగణంలో విద్యుత్ దీప కాంతులతో దేదీప్యమానంగా వెలుగొందుతోంది. సీతారాముల పరిణయ వేదికైన మిథిలా స్టేడియంలోని శిల్పి కళాశోభితమైన కల్యాణ మండపాన్ని సర్వంగా సుంధరంగా తయారు చేశారు. లక్షలాది మంది భక్తులు సీతారాముల కల్యాణానికి హాజరయ్యే అవకాశం ఉండటంతో అందుకు తగ్గ ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే రాష్ట్ర నలుమూలల నుండి తరువాయి 2లో



## విజయవాడలో నేటి నుంచి ఐజెయు ప్లీనరీ

**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో మూడురోజుల పాటు జరిగే ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజెయు) జాతీయ ప్లీనరీ శుక్రవారం ప్రారంభం కానుంది. ఈ ప్లీనరీకి 25 రాష్ట్రాల నుండి దాదాపు 400మంది ప్రతినిధులు హాజరుకానున్నారు. ఎపి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, పలువురు కేంద్ర, రాష్ట్ర మంత్రులు ప్లీనరీలో సందేశాలివ్వనున్నారు. ఐజెయు జాతీయ అధ్యక్షుడు, తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి, ఆహ్వాన సంఘం చైర్మన్, ఎపి ప్రెస్ అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేశ్ గురువారం ప్లీనరీ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి, ఎపియుడబ్ల్యుజె అధ్యక్షుడు ఐ.వి.సుబ్బారావు, ఐజెయు కార్యదర్శులు డి. సోమసుందర్, వై. నరేందర్ రెడ్డి, ఆహ్వాన సంఘం ఉపాధ్యక్షుడు, టియుడబ్ల్యుజె రాష్ట్ర అధ్యక్షుడు కె.విరాహత్ అలీ తదితరులు పాల్గొన్నారు.

## మోత్కూర్‌లో ధర్మభిక్షం విగ్రహావిష్కరణ

అజాతశత్రువుగా పేరొందిన గొప్ప నాయకుడు బొమ్మగాని అని కొనియాడిన సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి



ప్రజాపక్షం/మోత్కూర్

యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరులోని వ్యవసాయం మార్కెట్ కమిటీ సమీపంలో మాజీ పార్లమెంట్ సభ్యులు, స్వాతంత్ర్య సమరయోధుడు బొమ్మగాని ధర్మభిక్షం విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి, సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, గీత పనివారల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మగాని ప్రభాకర్ ముఖ్య అతిథులుగా హాజరై విగ్రహావిష్కరణ చేశారు. అనంతరం గీత పనివారల సంఘం, సిపిఐ ఆధ్వర్యంలో ధర్మభిక్షం 15వ వర్ధంతి, విగ్రహావిష్కరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పల్లా వెంకట్ రెడి మాట్లాడుతూ, అజాతశత్రువుగా పేరుపొందిన గొప్ప నాయకుడు బొమ్మగాని ధర్మభిక్షం అని కొనియాడారు. స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు ధర్మభిక్షం తన జీవితాంతం పేద ప్రజల సేవే లక్ష్యంతో పనిచేశారన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో చురుకైన పాత్ర పోషించారని, ధర్మ భిక్షం తన విద్యార్థి దశ నుంచి విద్యార్థులకు చదువుకోవడానికి వసతులు లేక ఇబ్బందులు పడుతున్న సమయంలో విద్యార్థులను చదువుతోపాటు చైతన్యపర్చాలని భావించి రాష్ట్రంలో మొదటిసారిగా విద్యార్థుల కోసం హాస్టల్ ఏర్పాటు చేసిన గొప్ప నాయకుడు ధర్మభిక్షం అన్నారు. ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ, తరువాయి 12లో

## ఇద్దరు ఫిరాయింపు ఎమ్మెల్యేలకు నోటీసులు

ప్రజాపక్షం/హైదరాబాద్

బిఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి పిరాయించిన ఇద్దరు ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, ఎం. సంజయ్‌కుమార్‌లకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. అసెంబ్లీ స్పీకర్ కమ్ ట్రైబ్యునల్‌కు కూడా నోటీసులు ఇచ్చింది. సమగ్ర వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశించింది. వాళ్లకు వ్యక్తిగతంగా నోటీసులు అందజేయడానికి పిటిషనర్లకు అనుమతి ఇచ్చింది. వీరిపై అనర్హత వేటు వేయాలన్న పిటిషన్లను స్పీకర్ కొట్టేస్తూ ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ బిఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు కె.పి. వివేకానంద, జి. జగదీశ్‌రెడ్డి వేర్వేరు పిటిషన్లు దాఖలు చేశారు. వీటిని చీఫ్ జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం. మొహియుద్దీన్‌లతో కూడిన తరువాయి 12లో

## మే 14,15 తేదీలలో ట్రంప్ చైనా పర్యటన



**వాషింగ్టన్:** అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మే 14,15 తేదీలలో చైనాలో పర్యటిస్తారు. ఈ తేదీలను బీజింగ్‌లోని ఉన్నత స్థాయి వర్గాలు తమకు అనుకూలంగా ఖరారుచేయాల్సి ఉంది. నిర్ణీత ప్రకారం మార్చి 31,ఏప్రిల్ ఒకటో తేదీన ట్రంప్ పర్యటించాల్సి ఉంది. కానీ పశ్చిమాసియాలో యుద్ధ పరిణామాల కారణంగా ఆయన పర్యటన వాయిదా పడింది. ఇప్పుడు వైట్‌హౌస్ వర్గాలు ఆయన పర్యటనను దాదాపు ఖరారు చేయగా, చైనా ప్రభుత్వ వర్గాలు లాంఛనంగా ఆమోదం తెలియజేయాల్సి ఉంది. గడచిన పది సంవత్సరాల కాలంలో ఒక అమెరికా అధ్యక్షుడు చైనాలో పర్యటించడం ఇదే మొదటిసారి.తన చారిత్రక పర్యటన ఖరారైందని, ఇందుకు అన్ని ఏర్పాట్లూ జరుగుతున్నాయని సోషల్ మీడియా వేదికగా గురువారం ట్రంప్ తెలియజేశారు. బీజింగ్‌లో చైనా విదేశీమంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి లిన్ జియాన్ గురువారం తరువాయి 12లో

## అరేబియా ద్వీపకల్పంలో 'ట్రిపోలీ'యుద్ధనౌక



● 2,500 మంది అమెరికా మెరైన్స్ సిద్ధం
● హోర్ముజ్ విముక్తి, ఖర్గ్ ద్వీప ఆక్రమణకు అమెరికా సంకేతాలు!
● ఇరాన్, హెజ్బొల్లా దాడులతో ఇజ్రాయెల్ ఉక్కిరిబిక్కిరి
● హదేరా విద్యుత్ ప్లాంట్‌పై క్షిపణి దాడి
● పరిస్థితి చేయి దాటిపోయింది : ఐక్యరాజ్యసమితి

**దుబాయ్:** పశ్చిమాసియాలో శత్రుదేశాల మధ్య దాడుల హింస పెరిగింది. ఇజ్రాయెల్‌పై ఇరాన్,హెజ్బొల్లా దళాలు వేరేవేరు చోట్ల నుండి రాకెట్లు క్షిపణి దాడులు చేస్తుండగా, ఇరాన్, లెబనాన్‌లపై ఇజ్రాయెల్ దాడులు కొనసాగిస్తోంది. మరోవైపు అరేబియా ద్వీపకల్ప జలాల్లో 2,500 మంది ఉభయచర బలగాలతో కూడిన యుద్ధ నౌక ట్రిపోలీని అమెరికా మోహరించింది. మరో వెయ్యిమంది (82వ గగనతల దళం) అమెరికా సైనికులు యుద్ధంలో వచ్చి చేరడానికి సిద్ధంగా ఉన్నారు. దీంతో హోర్ముజ్ విముక్తికి, ఖర్గ్ ద్వీప ఆక్రమణకు అమెరికా సిద్ధపడుతోందని రెండు రోజులుగా వినిపిస్తున్న వందతులకు బలం చేకూరుతుండగా, మరోవైపు చర్చల సవాళ్ళు, ప్రతిసవాళ్ళు కొనసాగుతున్నాయి. ఇజ్రాయెల్‌లోని ప్రధానమైన హదేరా విద్యుత్ ప్లాంట్‌పై ఇరాన్ క్షిపణి దాడులు చేసింది. ఇరాన్,హెజ్బొల్లాల నుండి తీవ్రస్థాయిలో ఇజ్రాయెల్ దాడులు ఎదుర్కొంటూ ఉక్కిరిబిక్కిరి అవుతోంది. టెల్అవీవ్,ఉత్తర ఇజ్రాయెల్ ప్రాంతాలపై ఇరాన్ క్షిపణి దాడులు చేస్తోంది. హెజ్బొల్లా ఉగ్రవాదులు కూడా లెబనాన్‌లోని టైర్ నగరం నుండి ఇజ్రాయెల్‌పై 200 రాకెట్లు ప్రయోగించారు. ఇజ్రాయెల్ కూడా వెనక్కు తగ్గకుండా ఇరాన్‌లో దాడులు పెంచింది. దీంతో ఇరాన్‌లోని అణు కర్మాగారం తరువాయి 2లో

మహిళా రిజర్వేషన్ చట్టసవరణకు

## అంత తొందరెందుకు?

అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన తరువాత అఖిలపక్ష భేటీని ఏర్పాటు చేయాలి

కేంద్రమంత్రి కిరణ్ రిజిజుకు ఖర్గే లేఖ

**న్యూఢిల్లీ :** మహిళా రిజర్వేషన్ల చట్టాన్ని సవరించడానికి ప్రభుత్వం ఎందుకు అంత తొందర పడుతోందని కాంగ్రెస్ ప్రశ్నించింది. ఈ మేరకు కాంగ్రెస్ అధినేత మల్లికార్జున ఖర్గే గురువారం పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజుకు లేఖ రాశారు. ఏప్రిల్‌లో ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల పర్వం ముగిసిన తర్వాతే ఈ విషయంపై అఖిలపక్ష సమావేశం తరువాయి 12లో

## ఇజ్రాయెల్ ఐడిఎఫ్ దాడుల్లో హోర్ముజ్ మూసివేత సూత్రధారి హతం



**టెల్‌అవీవ్:** ఇరాన్‌కు చెందిన ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ (ఐఆర్‌జిసి)కు చెందిన హోర్ముజ్ వ్యవహారాల నావికాదళ ప్రధానాధిపతి అడ్మిరల్ అలిరెజా టాంగ్‌సిరి తమ సైన్యం దాడుల్లో హతుడైనట్లు ఇజ్రాయెల్ రక్షణమంత్రి ఇజ్రాయెల్ కట్జ్ ప్రకటించారు. హోర్ముజ్ జలసంధిని మూసివేయడంలో కీలకసూత్రధారులుగా వ్యవహరించిన ఐఆర్‌జిసి కమాండర్లలో టాంగ్‌సిరి ఒకరు అంతేకాకుండా వందల నౌకల రాకపోకలకు ప్రధానకేంద్రమైన హోర్ముజ్ జలసంధివద్ద రాకపోకల నిషేధాన్ని ఆయనే పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. హోర్ముజ్ జలసంధిని మూసివేయడంలో ఆయనే ప్రత్యక్ష సూత్రధారి అని చెప్పారు. ఐఆర్‌జిసి నేవీ కమాండర్ కంటే ఆయన చాలా ఎక్కువ బాధ్యతలు నిర్వహిస్తున్నారన్నారు. బాందర్ అబ్బాస్ వద్ద ఐ.డి.ఎఫ్ చేసిన దాడుల్లో టాంగ్‌సిరి మరణించారు. చెంది న సెఫా న్యూస్ ఈ మేరకు విడుదల చేసిన ఆయన అధికారిక చిత్రాన్ని ఇజ్రాయెల్ పత్రిక ప్రచురించింది. ఐతే ఇరాన్ ప్రభుత్వంగానీ, ఐఆర్‌జిసిగానీ అధికారికంగా ఆయన మరణంపై వెంటనే స్పందించలేదు. సవాళ్ళు, ప్రతిసవాళ్ళ మ ధ్య యుద్ధం పరాకాష్ఠకు చేరి ఇరాన్–ఇజ్రాయెల్ కసిదీరా పరస్పర దాడులు చేసుకుంటున్న తరుణంలో అడ్మిరల్ అలిరెజా మరణించారు. ఇటీవల ఇజ్రాయె ల్ రక్షణ దళ దాడుల్లో ఇరాన్ జాతీయ భద్రతా మండలి కార్యదర్శి లారీజానీ మ రణించడంతో ఆ దేశానికి మరోసారి అతిపెద్ద నష్టం వాటిల్లింది. హోర్ముజ్ జలసంధిని, ఇరాన్‌లో కీలకమైన ఖర్గ్ ద్వీపాన్ని స్వాధీనం చేసుకునే లక్ష్యంతో వేలాదిమంది అమెరికా సైనికులు ఒకవైపు పశ్చిమాసియాకు తరలివస్తున్న తరుణం లో జరిగిన దాడుల్లో టాంగ్‌సిరి మరణించారు.కాగా సెంట్రల్ ఇజ్రాయెల్‌లో ఇరాన్, హెజ్బొల్లా దళాలు తీవ్రస్థాయిలో క్షిపణులు,రాకెట్లతో దాడులు చేస్తున్నాయి.

## హోర్ముజ్ దాటి వెళ్లేందుకు భారత్‌సహా ఐదు దేశాల నౌకలకు ఇరాన్ అనుమతి

**టెహ్రాన్/న్యూఢిల్లీ:** హోర్ముజ్ జలసంధిని దాటి సువిశాల మహాసముద్రంలో ప్రవేశించి గమ్యాలకు చేరుకునేందుకు వీలుగా భారత్ సహా ఐదు దేశాలకు ఇరాన్ అనుమతి మంజూరు చేసింది. ఇరాన్ విదేశీ వ్యవహారాల మంత్రి అబ్బాస్ అరాఘ్చి గురువారం ఈ విషయం ప్రకటించారు. భారతదేశ ఇంధన వనరుల సేకరణకు పశ్చిమాసియా ప్రాంతమే కీలక వనరుగా ఉంది. భారత్‌తోపాటు చైనా, రష్యా, ఇరాక్, పాకిస్థాన్ దేశాల చమురు నౌకలకు ఇరాన్ అనుమతి ఇచ్చిందని అరాఘ్చి చెప్పారు. హోర్ముజ్ జలసంధి ద్వారా నౌకల రాకపోకలు సాగించకుండా ఇరాన్ స్తంభింపజేయడంతో గడచిన 26 రోజులుగా ప్రపంచవ్యాప్తంగా చమురు సంక్షోభం తలెత్తింది. అనేక దేశాలలో చమురు ధరలు ఆకాశాన్ని అంటాయి. బంగ్లాదేశ్,జపాన్,దక్షిణ కొరియా,భారత్, శ్రీలంక,అర్జెంటీనా సహా అనేక ఆసియా,ఆఫ్రికా దేశాలు చమురు సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నాయి. ప్రపంచదేశాలకు అవసరమైన 20 శాతం సహజవాయువు ఈ ప్రాంతం నుండే సరఫరా అవుతుంది. ''ఇప్పుడు మా దేశం యుద్ధంలో ఉంది, ఈ ప్రాంతమంతా యుద్ధ మండలంగా ప్రకటితమైంది, అందువల్ల ఈ ప్రాంతంలో నౌకలను అనుమతించకపోవడానికి ఇదే కారణం. మా శత్రువులు,మిత్రుల నౌకలన్నీ ఈ ప్రాంతం గుండా వెళతాయి, కానీ ఇప్పుడు శత్రు దేశాల నౌకలకు మినహా మిత్రుదేశాలకు మాత్రమే అనుమతి ఇస్తున్నాం'' అని అబ్బాస్ అరాఘ్చి చెప్పారు. పశ్చిమాసియాలో యుద్ధం ముగించేవిషయంపై గడచిన రెండు వారాలుగా భారతదేశం దృష్టి కేంద్రీకరించింది. ఇంధనం, ఎరువులు విషయంలో అన్ని దేశాలకూ చాలా తీవ్ర సమస్యలు వస్తాయని భారత్ అంచనావేసింది.

# ట్రంప్ పరస్పర విరుద్ధ ప్రకటనలు

- ఒప్పందం కుదురుతుందో లేదో అని సందేహాలు
- ఓటమిని అంగీకరించకపోతే నరకం చూస్తారు
- చర్చల్ని రహస్యంగా దాచి మేకపోతు గాంభీర్యం
- ఇరాన్‌పై ట్రంప్ విమర్శలు,హెచ్చరికలు

**వాషింగ్టన్:** ఇరాన్ యుద్ధం ముగిసిపోవడానికి ఒక ఒప్పందం అతి దగ్గరలోనే ఉందని మూడురోజులుగా చెబుతూ వస్తున్న ట్రంప్ గురువారం సాయంత్రం జరిగిన మంత్రి వర్గ సమావేశంలో సందేహాలు వ్యక్తం చేశారు. దాంతో ఒప్పందం కుదురుతుందో లేదో ? అన్నారు. వారు యుద్ధంలో బలహీనులు సంప్రదింపుల్లో బలవంతులు అన్నారు. ఈ సమావేశానికి ముందు పాకిస్థాన్ ద్వారా పంపించిన 15 అంశాల ప్రణాళికను ఇరాన్ తిరస్కరించిన తర్వాత ట్రంప్ మాట్లాడుతూ, వాస్తవానికి ఇరాన్ ఒప్పందం చేసుకోవడానికి చాలా తొందర పడుతోందన్నారు. ఓటమిని అంగీకరించకపోతే నరకం చూస్తారని కూడా ఇరాన్‌కు ట్రంప్ హెచ్చరించారు. ఇక ట్రంప్ సోషల్ మీడియా వేదికగా పోస్టింగ్ పెడుతూ, ఇరాన్ చర్చల విషయాన్ని రహస్యంగా దాచిపెడుతూ గుంభనంగా వ్యవహరిస్తోందని, పైకిమాత్రం గాంభీర్య ప్రకటనలు చేస్తోందని అన్నారు. సొంత దేశంలోని ప్రజ లే తమను హత్య చేస్తారని ఇరాన్ తరపు సంప్రదింపుకర్తలు భయపడుతున్నారని ట్రంప్ విమర్శించారు. వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలినా లీవిట్ కూడా పాత్రికేయులతో గురువారం అనేక అంశాల గురించి మాట్లాడుతూ, ఇదే విషయాన్ని ఉద్ఘాటించారు. ఇరాన్ యుద్ధానికి టైమ్‌లైన్



ముగిసిపోయిందని అన్నారు. పశ్చిమాసియాకు 2000 మంది ఉభయచర సైనికులు (భూ–జలమార్గాల్లో పోరాడేవారు) వస్తున్నారని, ఇప్పటికే అక్కడ ఉన్న 5000 మంది మెరైన్‌లకు జత కలుస్తారని అన్నారు. కాగా పశ్చిమాసియా వ్యాప్తంగా గల్ఫ్ దేశాల్లోని స్థావరాల్లో ఇప్పటికే 50,000 మంది సైనికులు మోహరించి ఉన్నారు. ఓటమిని అంగీకరించకపోతే ట్రంప్ మరింత బలంగా సైనిక దాడి చేస్తారని లీవిట్ అన్నారు. ''ఇజ్రాయెల్ చర్చలు కోరుకుంటోంది, ట్రంప్ వినడానికి సిద్ధంగా ఉన్నారు'' అని చెప్పారు. ఈ విధంగా హోర్ముజ్ జలసంధిని విముక్తి చేసి, ఖర్గ్ ద్వీప ఆక్రమిస్తామని అమెరికా సంకేతాలు ఇచ్చింది. హోర్ముజ్ సమీపంలో చమురు ఎగుమతుకుల వీలుగా ఇరాన్ నిర్మించుకున్న కీలకమైన చమురు కేంద్రం ఖర్గ్ ద్వీపంలో ఉంది. ఈ నేపథ్యంలో హోర్ముజ్‌పై పెత్తనం చేసేందుకు మరో ఖమేనీగా మారేందుకు ట్రంప్ ప్రయత్నం చేస్తున్నారని జాతీయ మీడియాలో వ్యాఖ్యలు వెలువడ్డాయి. ఇరాన్‌తో చర్చల గురించి ప్రకటనలు హోరెత్తిస్తున్న ట్రంప్ మంత్రివర్గ సమావేశం నిర్వహించారు. అదేసమయంలో నాటో దళాల అధిపతి మార్క్ రట్టే బ్రస్సెల్స్‌లో 2025 వార్షిక నివేదిక సమర్పి స్తూ ఇరాన్ చాలా ప్రమాదకరస్థాయిలో తన యుద్ధ శక్తిసామర్థ్యాలను పెంపొందించుకుందని, ఈ బలంవల్ల నాటో దేశాలకు ప్రమాదం వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. హోర్ముజ్ జలసంధిని అడ్డుకుని కాపలా కాస్తున్న ఇరాన్ నావికా దళాధిపతిని హతమార్చడంద్వారా అమెరికాతో మాకున్న సహకారం, సమన్వయం యుద్ధ బలం మరోసారి బహిర్గతమైందని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి నెతన్యాహూ వ్యాఖ్యానించారు. యుద్ధంలో ఇప్పటివరకూ ఇరాన్‌లో ఉన్న 10,000 లక్ష్యాలను దెబ్బతీశామని అమెరికా నావికాదళం అడ్మిరల్ బ్రాడ్ కూపర్ చెప్పారు.

### యుద్ధం మేం చెప్పినట్లు ముగుస్తుంది:అరాఘ్చి

**టెహ్రాన్:** అమెరికాతో చర్చలకు అస్కారమే లేదని, తమ ప్రయోజనాలు, అవసరాలకు అనుగుణంగా, తాము నిర్దేశించిన నిబంధనల ప్రకారం యుద్ధం ముగుస్తుందని ఇరాన్ విదేశీ వ్యవహారాలమంత్రి సయ్యద్ అబ్బాస్ అరాఘ్చి ప్రభుత్వ టీవీ ఇంటర్వ్యూలో స్పష్టం చేశారు. చర్చలంటే బెదిరింపులు కాదని ఆయన అన్నారు. ట్రంప్ శాంతి ప్రణాళికను ఆయన తిరస్కరించారు. ఇప్పటివరకూ అమెరికాతో ఎలాంటి చర్చలూ జరగలేదన్నారు. ముఖాముఖీ చర్చలకు సిద్ధంగా లేమన్నారు. దానిని అసమంజసమైనదిగా పేర్కొన్నారు. తమ ప్రతిఘటన కొనసాగుతుందని అన్నారు.ట్రంప్ ప్రణాళికకు ప్రతిగా ఇరాన్ కూడా తనదైన ఎదురు ప్రణాళిక సమర్పిస్తుందని చెప్పారు. తప్పుడు అంచనాలు వేయడం ద్వారా మరోసారి తాము మోసపోవడానికి సిద్ధంగాలేమని ప్రకటించారు. ఇంతకు ముందు చర్చల్లో తప్పు అంచనాతో మోసపోయామని, ఆ చర్చల్లో అవమానాలు పడ్డామని అన్నారు. హోర్ముజ్ జలసంధి ద్వారా మిత్రదేశాల నౌకలకు మాత్రమే అనుమతి ఉంటుందని, శత్రుదేశాలకు అనుమతి లేదని చెప్పారు.

## జెడి వాన్స్ పాకిస్థాన్ పర్యటన ఇరాన్ ప్రతినిధులతో చర్చలకోసమే!



**వాషింగ్టన్:** అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్ పాకిస్థాన్ పర్యటనకు వెళుతున్నారని ఇద్దరు సీనియర్ అధికారులను ఉటంకిస్తూ సిఎన్ఎన్ వార్తాసంస్థ పేర్కొంది. ఇరాన్–అమెరికాకు మధ్యవర్తి పని చేస్తున్న పాకిస్థాన్ యుద్ధ పరిష్కారానికి వీలైన కీలక చర్చల వేదికగా ఇస్లామాబాద్‌ను ఉపయోగించుకోవడానికి సంసిద్ధత ప్రకటించింది. పాకిస్థాన్ ద్వారా ఇరాన్‌కు ట్రంప్ తన 15 అంశాల యుద్ధ నివారణ ప్రణాళికను పంపించారని వాషింగ్టన్ వర్గాలతోపాటు ఇరాన్ ప్రభుత్వ టీవీ కూడా ధృవీకరించింది. ఈవారంలోనే ఇరాన్–అమెరికా ప్రతినిధులమధ్య ఇస్లామాబాద్‌లో సంభాషణలు జరుగుతాయని అమెరికా పత్రికలు చెబుతుండగా, అసలు చర్చలే జరగలేదని, ఆ ప్రసక్తే లేదని ఇరాన్ నిర్ద్వంద్వంగా తోసిపుచ్చుతున్న తరుణంలో ఏది నిజం? ఏది అబద్ధం? అనే సందిగ్ధం ఏర్పడింది. ఈ పరిస్థితులమధ్య సిఎన్ఎన్ నివేదిక వెలువడింది. ఈ ప్రక్రియ ప్రారంభానికి ముందు ఆదివారం పాకిస్థాన్ సర్వసైన్యాధిపతి ఆసిఫ్ మునీర్ డోనాల్డ్ ట్రంప్‌తో, పాకిస్థాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియన్‌తో టెలిఫోన్ సంభాషణలు చేశారని ఫైనాన్షియల్ టైమ్స్ ప్రకటించింది. ఇరాన్ నాయకులు అమెరికాతో జరుగుతున్న చర్చలను రహస్యంగా దాచిపెడుతున్నారని అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తాజా ప్రకటనలో స్పష్టం చేయగా, అమెరికాతో ఎట్టిపరిస్థితుల్లోనూ ప్రత్యక్ష చర్చలకు తాము సిద్ధంగా లేమని, తాము కోరుకున్న పద్ధతుల్లో తమకు అనుకూలమైన విధంగానే యుద్ధం ముగుస్తుందని ఇరాన్ నాయకత్వం చెబుతున్నది. మొదటినుండీ యుద్ధాన్ని వ్యతిరేకిస్తున్న జె.డి.వాన్స్‌తో ప్రత్యక్ష లేదా పరోక్ష చర్చలకు ఇరాన్ సిద్దంగా ఉందని ఇంతకుముందే వార్తలు వెలువడిన తరుణంలో ఆయన పాకిస్థాన్ పర్యటన సందేశం ప్రాముఖ్యత సంతరించుకుంది. ఇరాన్‌లో అత్యంత గౌరవనీయుడుగా పరిగణించే నాయకుడితో అమెరికా సంభాషణలు చేస్తోందని ట్రంప్ మొదటి నుండీ చెబుతున్నారు. ఐతే ఆయన పేరుమాత్రం ప్రకటించనప్పటికీ అమెరికా పత్రికలు మాత్రం ఇరాన్ పార్లమెంటు స్పీకరే ఆ గౌరవనీయుడైన వ్యక్తి అని ప్రకటించాయి. ఈ చర్చల్లో స్టీవ్ విట్‌కాఫ్, జారెడ్ కుష్నెర్ క్రియాశీల పాత్ర వహిస్తున్నారని మీడియా సంస్థలు ప్రకటించాయి. కానీ ఇరాన్ స్పీకర్ ఘాలిబాఫ్ మాత్రం అమెరికా చర్చల ప్రకటనను తన ఎక్స్ వేదిక ద్వారా మొదట్లోనే ఒక నకిలీ వార్తగా కొట్టిపారేశారు. నాలుగు వారాల యుద్ధాన్ని ముగించాలని ఇరాన్ కోరుకుంటోందని, అందుకే చర్చల కోసం ఇరాన్ అడిగిందని ట్రంప్ చెప్పగా, వైట్‌హౌస్ కూడా ఒక ప్రకటన చేస్తూ, ''ఇరాన్ చర్చలు కోరుకుంటోంది,ట్రంప్ వినడానికి సిద్ధంగా ఉన్నారు'' అని పేర్కొంది.

## నాటో మిత్రదేశాలపై మళ్లీ ట్రంప్ విమర్శల దాడి



**షింగ్టన్:** జి–7 దేశాల సమావేశం సందర్భంగా నాటో మిత్రదేశాలపై అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మరోసారి విరుచుకుపడ్డారు. ఇరాన్‌లో పరిస్థితులను చక్కదిద్దడానికి వారు అస్సలు ఏమీ చేయలేదు అని సోషల్ మీడియా వేదికగా విమర్శించారు. ఇప్పుడు వారి అవసరం లేదు అని కూ డా తిరస్కారభావం చూపించారు. చాలా ముఖ్యమైన సమయంలో వారు సహాయాన్ని నిరాకరించారని, ఈ సందర్భాన్ని తాము ఎప్పటికీ గుర్తుంచుకుంటామని అన్నారు. కొన్ని దేశాలు సహాయం చేయడానికి ముందుకు వస్తున్నాయని ఆయన చె ప్పినప్పటికీ ఆ దేశాల పేర్లు మాత్రం ఆయన చెప్పలేదు. పది రోజుల క్రితం ఫైనాన్సియల్ టైమ్స్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో కూడా ఆయన హోర్ముజ్ జలసంధిని తెరిచేందుకు సహాయం చేయడంలో ముందుకు రాకపోతే భవిష్యత్తు ''మహా చెడ్డగా' ఉంటుందని హెచ్చరించారు.నాటో మిత్రులను పిరికివాళ్ళుగా ఆయన అభివర్ణించారు. పాత విమర్శలనే ఆయన ఏకరువు పెట్టారు.

### ఇరాన్,ఉక్రేన్ ఎజెండాగా జి–7 మీట్

పారిస్: జి–7 దేశాల నాయకులు పారిస్ వెలుపల శివార్లలో సమావేశమయ్యారు. గురువారం,శుక్రవారం రెండు రోజులు ఈ సమావేశం జరుగుతుంది. పశ్చిమాసియాలో యుద్ధం, ఉక్రేన్‌లో యుద్ధం, గాజాలో సంక్షోభం అంశాలే ప్రధాన ఎజెండాగా ఈసమావేశం జరిగింది. ఇరాన్‌తో జరుగుతున్న యుద్ధంలో అమెరికాతో యూరప్ దేశాలకు తీవ్ర విభేదాలు ఉన్నాయి. వారు యుద్ధంలో పాల్గొనేందుకు తిరస్కరించడంతో ట్రంప్ మిత్రదేశాలపై తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. యుద్ధం రోజు రోజుకూ సంక్లిష్టంగా మారుతున్న కొద్దీ యూరప్–అమెరికా మధ్య విభేదాలు కంటికి కనిపించకుండా తీవ్రమవుతున్నాయి. అదేవిధంగా ఉక్రేన్ విషయం లో, గాజా బోర్డుపై కూడా మిత్రులమధ్య భిన్నాభిప్రాయాలున్నాయి. ఈ ఎజెండాపై చర్చించేందుకు ఈ కీలక సమావేశం నిర్వహించారు.ఇరాన్ గనుక తమ 15 అంశాల ప్రణాళికకు అంగీకరించకపోతే నరకం చూపిస్తామని ఇప్పటికే అమెరికా ప్రకటించింది.

## 'ట్రిపోలీ'యుద్ధనౌక

(మొదటి పేజీ తరువాయి)

నుండి రష్యా తన సిబ్బందిని ఖాళీ చేయించింది. ఇజ్రాయెల్‌ను ఆక్రమించుకుంటామని హెజ్బొల్లా ఉగ్రవాదులు ప్రతిజ్ఞ చేయగా, ఇజ్రాయెల్ రక్షణ కోసం లెబనాన్ సరిహద్దుల్లో బఫర్‌జోన్‌ను మరింత విస్తరిస్తామని నెతన్యాహూ ప్రకటించారు. యుద్ధం చేయి దాటిపోయిందని, పరిస్థితి విషమించిందని ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనీ గుటెర్రెస్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. లెబనాన్‌లో గాజా తరహా నమూనా పునరావృతం కాకూడదన్నారు. పశ్చిమాసియాలో 26వ రోజు గురువారం యుద్ధంలో గల్ఫ్ దేశాలపై ఇరాన్ దాడుల తీవ్రత ఎంతమాత్రం తగ్గలేదు. దక్షిణ లెబనాన్‌లో హెజ్బొల్లా ఉగ్రవాదులతో జరుగుతున్న యుద్ధంలో ఒక ఇజ్రాయెల్ సైనికుడు మరణించగా అనేకమందితీవ్రంగా గాయపడ్డారు. ఇరాక్ పశ్చిమ అంబర్‌లోని ఆర్మీ మెడికల్ సమీపంలో ఇరాన్ చేసిన దాడుల్లో ఏడుగురు సైనికులు మరణించారు. మరో 13 మంది గాయపడ్డారు. ఈ ఘటనపై ఇరాక్ ప్రభుత్వం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ విషయంపై ఐక్యరాజ్యసమితికి ఫిర్యాదు చేసింది. దీంతో గల్ఫ్‌లోని మిత్రదేశాలు స్పందించాయి. ''మీ భూభాగం నుండి దాడులు చేయడం మానేయండి'' అని ఇరాక్‌కు హితవు చెప్పాయి.

## క్యూర్‌లో ఎంఎంటిఎస్ సేవలు

(మొదటి పేజీ తరువాయి)

స్టేషన్లు లోపలికి ఉండటంతో అక్కడకు రాకపోకలు సాగించేందుకు వీలుగా మినీ బస్సులు నడిపే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. ఎంఎంటిఎస్ స్టేషన్లలో ప్రయాణికులకు అవసరమైన అన్ని వసతులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మెరుగైన వసతులు ఉన్నప్పుడే ప్రయాణికులు ఎంఎంటిఎస్ వైపు మొగ్గు చూపుతారని తెలిపారు. స్వీయ ఆదాయ వనరులు పెంచుకునేందుకు ప్రయత్నించాలని అధికారులకు సూచించారు. లాస్ట్ మైల్ కనెక్టివిటీ పెంపుతో పాటు ప్రయాణికుల సంఖ్య పెంపు, వసతులు మెరుగుపరచడానికి ఉన్న అవకాశాలపై అధ్యయనం చేసి నివేదిక సమర్పించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. సమీక్ష సమావేశంలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో పాటు ప్రభుత్వ ఉన్నతాధికారులు, దక్షిణ మధ్య రైల్వే అధికారులు పాల్గొన్నారు.

## జర్నలిస్టులకు కనీస వేతనం, పెన్షన్

(మొదటి పేజీ తరువాయి)

పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రంలో పనిచేస్తున్న జర్నలిస్టుల సంఖ్యపై స్పష్టమైన గణాంకాలను సేకరించి, అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని సాంబశివరావు ప్రభుత్వానికి సూచించారు. జర్నలిస్టులకు చట్టబద్ధమైన కనీస వేతనం అమలు చేయడంతో పాటు, ప్రతి ఒక్కరికీ ప్రభుత్వమే జీవిత బీమా సౌకర్యం కల్పించాలన్నారు. వృత్తి నుంచి విరమణ పొందిన రిటైర్డ్ జర్నలిస్టుల కోసం ప్రత్యేక పెన్షన్ పథకాన్ని ప్రవేశపెట్టి, వారిని ఆదుకోవాలన్నారు. జర్నలిస్టులందరికీ డిజిటల్ హెల్త్ కార్డులు జారీ చేయాలని కోరారు. కార్పొరేట్ ఆస్పత్రుల్లో వారికి నగదు రహిత మెరుగైన వైద్యం అందే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. వృత్తిపరమైన అవసరాల కోసం ల్యాప్‌టాప్‌లు, కంప్యూటర్లు, మొబైల్ ఫోన్లు కొనుగోలు చేసేందుకు వాయిదా పద్ధతిలో రాయితీలు కల్పించాలన్నారు. ఎంప్యానల్ అయిన చిన్న పత్రికలకు ప్రకటనల కేటాయింపులో న్యాయం చేయాలని ఆయన ప్రభుత్వానికి సూచించారు. ప్రజాస్వామ్యంలో నాలుగో స్థంభంగా ఉన్న జర్నలిస్టులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారికి సామాజిక భద్రత కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని కూనంనేని సాంబశివరావు అన్నారు. సాంబశివరావు లేవనెత్తిన అంశాలపై రాష్ట్ర మంత్రి ధనసరి అనసూయ సీతక్క సానుకూలంగా స్పందించారు. జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం గుర్తించిందని, సాంబశివ రావు చేసిన సూచనలను నోట్ చేసుకున్నామని తెలిపారు. ఈ అంశాలను సంబంధిత శాఖల దృష్టికి తీసుకెళ్లి, జర్నలిస్టుల సంక్షేమానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని మంత్రి సభలో హామీ ఇచ్చారు.

## రూ.2.19 లక్షల కోట్ల పెట్టుబడులు

(మొదటి పేజీ తరువాయి)

68,150 మందికి ప్రత్యక్షంగా ఉపాధి లభించనుందని ఆయన తెలిపారు. కేవలం ఒప్పందాలకే పరిమితం కాకుండా, పెట్టుబడులను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లడంలో ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోందన్నారు. రూ. 81,800 కోట్ల పెట్టుబడి పెట్టే 6 కంపెనీలకు ఇప్పటికే భూములు కేటాయించగా, దీని ద్వారా ప్రభుత్వానికి రూ.1,540 కోట్ల ఆదా యం సమకూరిందన్నారు.

మరో రూ. 30,000 కోట్ల పెట్టుబడులకు సంబంధించి 3 కంపెనీల కోసం భూములను గుర్తించినటు చెప్పారు.

**పారదర్శకత – శ్వేతపత్రం విడుదల**

కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి పారదర్శకతతో ఉందని, త్వరలోనే పెట్టుబడులు, ఎంఓయులపై శ్వేతపత్రం విడుదల చేస్తామని మంత్రి శ్రీధర్‌బాబు ప్రకటించారు.

పెట్టుబడులపై విపక్షాలు చేస్తున్న విమర్శల పట్ల మంత్రి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ 'రాష్ట్ర అభివృద్ధిని కాంక్షించకుండా కొందరు విషప్రచారం చేస్తున్నారు.

ఐసోలేషన్‌లో ఉంటే పెట్టుబడులు రావు, ప్రపంచ వేదికలపై మన రాష్ట్ర అవకాశాలను వివరించినప్పుడే పారిశ్రామికవేత్తలు ముందుకొస్తారు' అని అన్నారు.

**టైర్–2 నగరాల్లో ఐటి విస్తరణ**

హైదరాబాద్‌తో పాటు ద్వితీయ శ్రేణి నగరాల్లోనూ ఐటిని విస్తరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. ప్రస్తుతం నిజామాబాద్‌లో 11 కంపెనీలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని, 681 సీట్ల సామర్థ్యం ఉన్న ఈ టవర్‌లో 276 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారని తెలిపారు. టిఫైబర్ లాస్ట్ మైల్ కనెక్టివిటీలో తెలంగాణను దేశానికే రోల్ మోడల్‌గా నిలిపామని, రైతు వేదికలు, ప్రభుత్వ కార్యాలయాలకు ఇంటర్‌నెట్ సౌకర్యం కల్పిస్తున్నామని చెప్పారు. సిద్దిపేట వంటి ఐటి టవర్‌లో ఉన్న సమస్యలను, అద్దె రాయితీలు, పెండింగ్ జీతాల అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకురాగా, వాటిని సమీక్షించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.

పదేళ్ల తర్వాత రాష్ట్రంలో సరికొత్త ఎంఎస్ఎంఈ పాలసీని తెచ్చిన ఘనత తమ ప్రభుత్వానిదేనని ఆయన ఈ సందర్భంగా తెలిపారు.

## భద్రాచలం ముస్తాబు

(మొదటి పేజీ తరువాయి)

భక్తులు పెద్ద ఎత్తున ఇక్కడికి చేరుకుంటున్నారు. రాష్ట్రప్రభుత్వం తరుపున సాంప్రదాయానుసారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం స్వామివారి కళ్యాణ మహోత్సవానికి హాజరు కానున్నారు. ఇందు కోసం హెలీ ప్యాడ్‌ను సిద్ధం చేశారు. శ్రీరామ నవమి సందర్భంగా సుమారు 2వేల మందితో గట్టిపోలీస్ బందోబస్తు నిర్వహించనున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా కలెక్టర్ అంకిత్, ఎస్‌పి రోహిత్ రాజ్ ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నారు. రాముల వారి పెళ్లి వేడుకకు విచ్చేసే భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఛాందినీ వస్త్రాలతో పందిళ్లు ఏర్పాటు చేశారు. దూర ప్రాంతాల నుండి వచ్చే భక్తుల కోసం సదుపాయాలు కల్పించారు.

దేవస్థానం ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదానికి గానూ 3 లక్షల లడ్డూలు సిద్ధం చేశారు. లడ్డూ ప్రసాదాల కోసం 19 కౌంటరు, కళ్యాణ తలంబ్రాల పంపిణీకి 80 ప్రత్యే కౌంటర్లు ఏర్పాటు చేశా రు. కళ్యాణ మండపాన్ని 26 సెక్టార్లుగా విభజించారు. సుమారు 32 వేల మంది భక్తులు నేరుగా స్వామి వారి కళ్యాణాన్ని మిథిలా స్టేడియంలో ప్రత్యక్షంగా తిలకించనున్నారు. వేసవి తాపాన్ని తట్టుకునే విధంగా ఏసిలు, కూలర్లు, ఫ్యాన్లు అమరుస్తున్నారు. టిజి ఆర్‌టిసి, ఏపిఎస్ ఆర్టిసి వారు భక్తుల కోసం ప్రత్యేక బస్సు సర్వీసులను నడుపుతున్నారు.

**రూ.351 కోట్ల పనులకు సిఎం శంకుస్థాపన** : భద్రాచలం రామాలయాన్ని సర్వంగా సుంధరంగా నూతన హంగులతో తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం రూ.351 కోట్ల మొదటి దశ అభివృద్ధి పనులకు శుంకు స్థాపన చేయనున్నారు. మొత్తం రూ.586 కోట్లను ఆలయాభివృద్ధి, విస్తరణ పనుల కోసం ప్రభుత్వం కేటాయించింది. ఈ పనులు మూడు దశల్లో పూర్తి చేసేందుకు మాస్టర్ ప్లాన్ సిద్ధం చేశారు. రూ.75 కోట్లతో గోదావరిఘాట్ విస్తరణ పనులు, మౌళిక సదుపాయాల ఏర్పాటుకు వాడనున్నారు. మరో రూ.180 కోట్లతో అలయ చుట్టు ప్రకారాలు, కాంప్లెక్స్ పనులు చేపడతారు. రూ.96 కోట్లతో రామాలయ పరిసరాలను అభివృద్ధి చేయనున్నారు.

ఈ పనులు వచ్చే ఏడాది శ్రీరామ నవమి నాటికి పూర్తి చేసేలా ప్లాన్ సిద్ధం చేస్తున్నారు. ఇదిలా ఉండగా మిగతా రూ.235 కోట్లను రెండు విడతల్లో వినియోగించనున్నారు. ఈ పనులు 2029 నాటికి పూర్తి చేసేందుకు మాస్టర్ ప్లాన్ సిద్ధం చేస్తున్నారు. యాదాద్రికి మించి భద్రాద్రిని అభివృద్ధి చేసి తీరుతామని ముఖ్యమంత్రి చేసిన వాగ్ధానం నేరవేరుతున్నట్లు రామభక్తులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.

**రేపు పట్టాభిషేకం** : శ్రీరామ నవమి ముగిన మరుసటి రోజు రామయ్యకు పట్టాభిషేక మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నారు. ఈ వేడుకలో పాల్గొనేందుకు గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లాహాజరుకానున్నారు.

## వైద్యం, విద్యే ప్రధానం

(మొదటి పేజీ తరువాయి)

కొత్త పథకాల గురించి గణాంకాలతో సహా వివరించారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకానికి సంబంధించి రూ.600.27 కోట్ల బకాయిలను వారసత్వంగా మిగిల్చిందని సిఎం విమర్శించారు. ఆ భారాన్ని మోస్తూనే కాంగ్రెస్ ప్రభుత్వం నిధులను భారీగా కేటాయించిందని తెలిపారు. గడిచిన 27 నెలల్లో ఆరోగ్యశ్రీ, సిఎంఆర్ఎఫ్ కలిపి రూ.4,500 కోట్లు ఖర్చు చేశామన్నారు. ఇప్పటివరకు రూ.2,408.51 కోట్ల ఆరోగ్యశ్రీ నిధులను ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులకు రూ.927.99 కోట్లు, ప్రైవేట్ ఆసుపత్రులకు రూ.1,480.52 కోట్లు, గతంలో నెలకు సగటున రూ.52 కోట్లు ఖర్చు చేయగా, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం సగటున రూ.89 కోట్లు వెచ్చిస్తోందన్నారు. రాష్ట్రంలోని పేద కుటుంబాలకు ధీమా కల్పించేందుకు ప్రభుత్వం కొత్త నిర్ణయం తీసుకుందని, ఇటీవల చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ సర్వే ఆధారంగా రాష్ట్రంలోని 1.15 కోట్ల కుటుంబాలకు 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని' అమలు చేయనున్నట్లు ప్రకటించారు.

**ఆసుపత్రుల నిర్వహణలో కీలక మార్పులు**

మెడికల్ కాలేజీలను ఆరోగ్యశ్రీ అనుసంధానం చేస్తే ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయని సిఎం చెప్పారు. మెడికల్ కాలేజీలకు ఆరోగ్యశ్రీ నిధులు అందించడం ద్వారా ఆసుపత్రులు బలోపేతం అవుతాయని, దీని ద్వారా వైద్యుల సమస్యలు తొలగిపోవడంతో పాటు ప్రజలకు మంచి సేవలు అందుతాయన్నారు. వైద్య సేవలను మరింత మెరుగుపరిచేందుకు ఆసుపత్రుల అడ్మినిస్ట్రేషన్ విధానంలో ప్రభుత్వం మార్పులు చేస్తోందని సిఎం వెల్లడించారు. వైద్యులు కేవలం చికిత్సపైనే దృష్టి సారించేలా, ఆసుపత్రుల నిర్వహణ బాధ్యతలను వేరు చేసి గ్రూప్1 లేదా గ్రూప్2 అధికారులకు అప్పగిస్తామన్నారు. నిమ్స్, టిమ్స్ (సనత్‌నగర్, అల్వాల్, ఎల్‌బి నగర్, వరంగల్)తో పాటు రూ.3,000 కోట్లతో నిర్మిస్తున్న కొత్త ఉస్మానియా ఆసుపత్రి ద్వారా రాష్ట్రం లో అదనంగా 10,000 పడకల సామర్థ్యాన్ని అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు తెలిపారు. విదేశాల్లో ఉన్న ప్రముఖ తెలుగు వైద్యులు తమ సేవలను ఉచితంగా అందించేందుకు వీలుగా ప్రత్యేక 'హెల్త్ వెబ్‌సైట్' వేదికను రూపొందిస్తున్నామన్నారు. వారు స్వదేశానికి వచ్చినప్పుడు వైద్య సేవలు అందించేందుకు సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు.

**విపక్షాల విమర్శలపై తీవ్ర స్పందన**

ఆరోగ్యశ్రీ బకాయిలపై విపక్షాలు చేస్తున్న ఆరోపణల పట్ల ముఖ్యమంత్రి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. గతంలో సిఎం రిలీఫ్ ఫండ్ (సిఎంఆర్ఎఫ్) ఎలా దుర్వినియోగమైందో, కొందరు పిఏలు నిధులను ఎలా దారి మళ్లించారో విచారణలో అన్నీ బయటకు వస్తాయని హెచ్చరించారు. పారదర్శకత కోసం ప్రస్తుతం సిఎంఆర్ఎఫ్ దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా ప్రజాప్రతినిధులే నేరుగా దరఖాస్తు చేసేలా వెసులుబాటు కల్పించామన్నారు. 'విద్య కోసం నర్సరీ నుంచి పైస్థాయి వరకు, వైద్యం కోసం పిహెచ్‌సి నుంచి సూపర్ స్పెషాలిటీ వరకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్తున్నామని, ఈ విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదన్నారు. విద్య, వైద్య రంగాల్లో రాష్ట్రాన్ని రోల్ మోడల్‌గా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని సిఎం రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు.

## అగ్ని కీలల్లో బస్సు

(మొదటి పేజీ తరువాయి)

కుటుంబాలకు రూ.5 లక్షలు చొప్పున పరిహారం ఇవ్వాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. అదే విధంగా గాయపడినవారికి రూ.2 లక్షలు చొప్పున పరిహారం ఇవ్వాలని నిర్ణయించారు. దీంతో పాటు బాధితులకు అందుతున్న వైద్యాన్ని పర్యవేక్షించాలని మంత్రులు, అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశాలిచ్చారు. ప్రమాదాల నివారణతో పాటు ఇలాంటివి మళ్లీ పునరావతం కాకుండా ఉండేందుకు ఆర్అండ్‌బీ, రవాణా శాఖ, పోలీసు, ఆరోగ్య శాఖలు సమన్వయంతో పని చేయాలని పేర్కొన్నారు. ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపి దానికి అనుగుణంగా చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు సూచించారు.

**చంద్రబాబు, పవన్, జగన్ దిగ్భ్రాంతి**

మార్కాపురం జిల్లా రోడ్డు ప్రమాద ఘటనపై సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మాజీ సీఎం జగన్, పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, కొందరు మంత్రులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందేలా చూడాలని అధికారులను సీఎం ఆదేశించారు. పరిస్థితి విషమంగా ఉన్న ముగ్గురిని మెరుగైన వైద్యం కోసం వేరే ఆసుపత్రికి తరలించాలని సూచించారు. ప్రమాదానికిగల కారణాలను జిల్లా అధికార యంత్రాంగం నుంచి తెలుసుకున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్... క్షతగాత్రులకు మెరుగైన వైద్య చికిత్స అందించాలని ఆదేశించారు. మతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ప్రైవేటు బస్సు ప్రమాద దుర్ఘటన మనసును కలిచివేసిందని జగన్ పేర్కొన్నారు.

గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని, ప్రమాదంపై దర్యాప్తు చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావతం కాకుండా కట్టుదిట్ట చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

**ఒక్కో కుటుంబానికి రూ.50 లక్షలు: షర్మిల డిమాండ్**

ట్రావెల్ బస్సు మంటల్లో చిక్కుకొని 13 మంది సజీవదహనం కావడం అత్యంత విషాదకరమని పీసీసీ అధ్యక్షురాలు షర్మిల అన్నారు. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. 50 లక్షల చొప్పున ఆర్థిక సహాయం ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రమాదానికి గల కారణాలపై ఉన్నతస్థాయి కమిటీతో విచారణ చేపట్టాలన్నారు. ప్రమాద ఘటనపై మంత్రులు నారా లోకేశ్, వంగలపూడి అనిత, కందుల దుర్గేశ్, రాంప్రసాద్‌రెడ్డి, అచ్చెన్నాయుడు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వీ శ్రీనివాసరావు తదితరులు తీవ్ర దిగ్భ్రాంతి, విచారం వ్యక్తం చేశారు.

**ఘటనపై సిఎం రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి...**

మార్కాపురం బస్సు ప్రమాద ఘటనపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ప్రమాద ఘటనలో పలువురు మృతి చెందడం.. కొందరికి తీవ్ర గాయాలపాలవడంపై సిఎం విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుభూతి తెలిపారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని సిఎం ఆకాంక్షించారు.

బస్సు నిర్మల్ నుంచి నెల్లూరు వైపు వెళుతున్న నేపథ్యంలో బస్సు ప్రమాదంలో మృతిచెందిన వారు.. గాయపడిన వారి వివరాలు తెలుసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావును ఆదేశించారు. ఎపి అధికారులతో మాట్లాడి పూర్తి వివరాలు సేకరించాలని సిఎం సూచించారు. గాయపడి న వారికి మెరుగైన వైద్యం సహాయం అందేలా చూడా లని సిఎం ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశాలతో సిఎస్ రామకృష్ణారావు ఎపి సిఎస్‌తో మాట్లాడారు.

రోడ్డు ప్రమాదం అత్యంత బాధాకరం అని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రమాదంపై మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

STATE & REGIONAL NEWS
జనరల్
STATE & REGIONAL NEWS
హైదరాబాద్
శుక్రవారం
27-03-2026
www.prajapaksham.in
ప్రజాపక్షం
Telugu National Daily


# గత ప్రభుత్వ బకాయిలు క్రమంగా చెల్లిస్తున్నాం

## శాసనసభలో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ పథకం అమలులో పురోగతి సాధించామని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సి.దామోదర్ రాజనర్సింహ తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటివరకు 9.45 లక్షల మందికి ఉచిత వైద్య సేవలు అం దించినట్లు ఆయన తెలిపారు. శాసనసభ గురువారం ప్ర శ్నోత్తరాల సమయంలో బిఆర్ఎస్ సభ్యులు కల్వకుంట్ల సంజయ్, టి.హరీశ్ రావు అడిగిన ప్రశ్నలకు మంత్రి స మాధానమిచ్చారు. సభలో ఆరోగ్యశ్రీ పథకం అమలు, బకాయిల చెల్లింపులపై అధికార, ప్రతిపక్షాల మధ్య చర్చ జరిగింది. ఈ విషయంలో జోక్యం చేసుకున్న సిఎం రేవంత్ రెడ్డి సైతం ఆరోగ్యశ్రీ పథకానికి ఖర్చు చేసిన నిధుల వివరాలను గణాంకాలతో సహా వివరించారు. సభలో మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ గత ప్రభుత్వ కాలంలో ఏడాదికి సగటున 2.5 లక్షల మందికి మాత్రమే ఆరోగ్యశ్రీ సేవలు అందేవని, ప్రస్తుతం ఆ సంఖ్య 4 లక్షలకు పెరిగిందన్నారు. సామాన్య ప్రజల కు మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. నెట్‌వర్క్ ఆసుపత్రులకు చెల్లింపుల విషయంలో కూడా ప్రభుత్వం మెరుగైన చర్యలు తీసుకుంటుందన్నారు. గతంలో నెలకు రూ.52 కోట్లు మాత్రమే చెల్లించేవారని, ఇప్పుడు ఆ మొత్తాన్ని రూ.89 కోట్లకు పెంచామని వివరించారు. 2023 డిసెంబర్ 8 నుంచి ఇప్పటివరకు రూ.2,400 కోట్లకు పైగా చెల్లింపులు జరిపినట్లు చెప్పారు. అలాగే గత ప్రభుత్వ కాలంలో ఉన్న రూ.600 కోట్ల ఆరోగ్యశ్రీ బకాయిలు, రూ.130 కోట్ల ఇహెచ్ఎస్ బకాయిలను కూడా క్రమంగా విడుదల చేస్తున్నామని తెలిపారు. ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ విస్తరణలో భా గంగా ప్రైవేట్ ఆసుపత్రుల సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు 330 ప్రైవేటు ఆసుపత్రుల్లో మాత్రమే సేవలు అందుబాటులో ఉండగా, ప్రస్తుతం ఆ సంఖ్య 537కు చేరిందన్నారు. ములుగు, నారాయణపేట వంటి దూర ప్రాంతాల్లో కూడా ఈ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చామని మంత్రి తెలిపారు.

### ఐసియును ఆరోగ్యశ్రీలో చేర్చాలి : కల్వకుంట్ల సంజయ్



అంతకు ముందు బిఆర్ఎస్ సభ్యులు కల్వకుంట్ల సంజయ్ మాట్లాడుతూ ఐసియులో పేదలు చేరితే ఒక ఆస్తి అమ్ముకునే పరిస్థితి నెలకొందన్నారు. ఐసియులో ఒక వ్యక్తికి రూ.50 వేల నుంచి రూ.లక్ష వసూలు చేస్తున్నార ని చెప్పారు. ప్రైవేట్, ప్రభుత్వ ఆస్పత్రులలో ఐసియు వై ద్య సేవలను ఆరోగ్యశ్రీలో చేర్చాలని ప్రభుత్వాన్ని ఆయ న కోరారు. అలాగే ఆరోగ్యశ్రీలో ఆర్థోపెడిక్, ఈఎన్‌టి వై ద్య సేవలను కూడా ఆరోగ్యశ్రీలో చేర్చాలన్నారు. పెరిగి న ధరలకు అనుగుణంగా ఆరోగ్యశ్రీ రేట్లను కూడా పెం చాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఎంఆర్ఐ, ఎంఎంఆర్ సౌకర్యాలు కల్పించాలన్నారు. ప్రతి జిల్లా కేంద్రంలోని ఏరియా ఆస్పత్రుల్లో డి ఆడిక్షన్ సెంటర్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి సంజయ్ సూచించారు.

### బిల్లులు రాక దవాఖానాలు మూతపడుతున్నాయి : హరీశ్ రావు



బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ బిల్లుల చెల్లింపులు ప్రభుత్వం గ్రీన్ ఛానెల్ ద్వారా బిల్లులు విడుదల చేస్తున్నామని చెబుతున్నప్పటికీ, వాస్తవంగా నిధులు విడుదల కావడం లేదన్నారు. ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచినప్పటికీ, రెండున్నర సంవత్సరాల్లో కేవలం 496 మంది మాత్రమే లబ్ధి పొందారని ఆయన తెలిపారు. కార్పొరేట్ ఆసుపత్రులు పెద్ద శస్త్రచికిత్సలను ఆరోగ్యశ్రీ కింద చేయడం లేదని, దీనిపై సమీక్ష చేయాలని సూచించారు. బిల్లులు చెల్లించకపోవడంతో చిన్న ఆసుపత్రులు మూతపడే పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్ బిల్లుల వివరాలు, చెల్లింపుల గడువు గురించి ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు.

# 'జిఎస్‌టి బిల్లుకు శాసనసభ ఆమోదం

## చట్ట సవరణతో రాష్ట్రానికి ఎటువంటి నష్టమూ లేదు : మంత్రి జూపల్లి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** 'తెలంగాణ వస్తువుల,సేవ పన్ను(జిఎస్‌టి) సవరణ బిల్లు2026'ను శాసనసభ గురువారం అమోదించింది.ఈ బిల్లును ముఖ్యమంత్రి ఎరేవంత్‌రెడ్డి తరపున రాష్ట్ర పర్యాటక,ఆబ్కారి శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు జిఎస్‌టి సవరణ బిల్లును శాసనసభలో ప్రవేశపెట్టగా, చర్చ అనంతరం ఈ బిల్లును సభ ఆమోదించింది. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ జిఎస్‌టిలో కమిషనర్ పదవిని ప్రధాన కమిషనర్‌గా మార్చడం, అదనపు కమిషనర్‌గ్రేడ్ 1ను కమిషనర్‌గా మార్చడమే ఈ బిల్లు ముఖ్య ఉద్దేశమని వివరించారు. ఒకే దేశం,ఒకే పన్ను అనే నినాదంతో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జిఎస్‌టి చట్టం ప్రకారం తెలంగాణ రాష్ట్రంలో కూడా జిఎస్‌టి చట్ట సవరణ చేశామన్నారు. చట్ట సవరణ ద్వారా ద్వారా రాష్ట్రానికి వచ్చే నష్టం ఏమీ లేదని స్పష్టం చేశారు. ఎసిటిలను గెస్టెడ్ అధికారులుగా గుర్తించే అంశం పరిశీలోనలో ఉన్నదని మంత్రి జూపల్లి తెలిపారు. అంతకుముందు కాంగ్రెస్ సభ్యులు చిట్టెం రాంమోహన్ రెడ్డి మాట్లాడుతూ వైద్య సీట్లలలో సగం సీట్లను కేవలం రూ.60 వేలకు ఇస్తున్న విద్యా సంస్థలకు జిఎస్‌టి మినహాయింపు ఇవ్వాలని కోరారు. బిజెపి ఎంఎల్‌ఎ పాల్వాయి హరీశ్‌బాబు మాట్లాడుతూ ఈ చట్టం ద్వారా దేశ వ్యాప్తంగా ఉన్న కమిషనర్లు ప్రధాన కమిషనర్లుగా ఉంటారన్నారు. ఎంఐఎం అహ్మద్ బిన్‌అబ్దుల్లా బలాల మాట్లాడుతూ ఈ చట్ట సవరణలో భాగంగా ఎసిటిలను డిటిసిలుగా మార్చడం ద్వారా వారికి గెస్టెడ్ అధికారులుగా గుర్తిస్తారా?,వారి జీతభత్యాలలో ఏమైనా మార్పు ఉంటుందా? అని ప్రశ్నించారు.

తెలంగాణ ప్రభుత్వము
ప్రత్యేక ఉప కలెక్టర్ కార్యాలయము (భూసేకరణ)
నాగర్ కర్నూల్ జిల్లా

No. G2/254/2026
Gaz. No.60/2026 తేది. 27.02.2026

భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార హక్కు చట్టము 2013 (చట్టం 30/2013) సెక్షన్ 11(1) మరియు తెలంగాణ రాష్ట్ర భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార నియమావళి 2014 రూల్ 19 (1) ప్రకారము

ఫారం. 6
ప్రాథమిక ప్రకటన

నాగర్‌కర్నూల్ జిల్లా బిజినపల్లి మండలంలోని గంగారం గ్రామము వద్ద ప్యాకేజి నెం. 29 మార్కేండేయ లిఫ్ట్ యొక్క శాయినిపల్లి కెనాల్ గ్రామా పరిధి నందు ఈ క్రింది షెడ్యూల్లో ఉదహరించిన ఎ. 0.20 గుంటలు / సెంట్లు భూమి ప్రజా ప్రయోజనార్థం అనగా మార్కేండేయ లిఫ్ట్ యొక్క శాయినిపల్లి కెనాల్ నిమిత్తం సేకరించవలిసిన అవసరం ఉన్నదని ప్రత్యేక ఉప కలెక్టరు (భూసేకరణ) యం.జి.ఎల్.ఐ.యస్.పి నాగర్‌కర్నూల్ గారు భావిస్తున్నారు. కాబట్టి ఎ.లు 0.20 గు. భూమి మార్కేండేయ లిఫ్ట్ యొక్క శాయినిపల్లి కెనాల్ నిమిత్తం భూసేకరణ ద్వారా సేకరించుటకు గాను ప్రాథమిక ప్రకటన చేయడమైనది. సేకరించడానికి నిర్ధారించిన భూముల వివరాలు సంక్షిప్తంగా క్రింది ప్రకారం గలవు.

షెడ్యూల్
గ్రామము: గంగారం మండలం: బిజినపల్లి జిల్లా: నాగర్‌కర్నూల్

| క్ర. సం. | సర్వే నెం./సబ్ డి. నెం. | పట్టా/ఇనాం etc., | భూవర్గీకరణ మెట్ట/తరి | సేకరించుటకు ప్రతిపాదించిన విస్తీర్ణము ఎ.సెంట్లు/ఎ.గుంటలు | పట్టాదారు పేరు, అనుభవదారు పేరు మరియు ఏవైన హక్కులు గల యితర వ్యక్తులు | సరిహద్దులు ఉ | ద | తూ | ప | చెట్లు | | నిర్మాణములు | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 | 12 | 13 | 14 |
| 1 | 480 | లావుణి పట్టా | మెట్ట | 0.20 | యం. బుచ్చిరెడ్డి తండ్రి వెంకట్ రెడ్డి (0.20) ఎ. రాజు తండ్రి వస్య ఎ. శంకర్ తండ్రి వస్య ఎ. రెడ్యా తండ్రి వస్య ఎ. గోరి భర్త హన్మంతు ఎ. శంకర్ తండ్రి పర్ష ఎ. గోపాల్ తండ్రి పర్ష ఎ. బద్య తండ్రి పర్ష ఎ. సక్రు తండ్రి పర్ష ఎ. సక్రు తండ్రి తావురు బి. పార్వతమ్మ భర్త వెంకటయ్య పి. హస్లి భర్త లచ్య పి. మత్ర తండ్రి బాపుసింగ్ నార్య తండ్రి సోంలా ఎ. సక్రు తండ్రి ఇచ్చ ఎ. అంజి తండ్రి జేత్య ఎ. తారాసింగ్ తండ్రి సేవ్య ఆర్. బోజ్య తండ్రి హన్మ్య ఎ. దేవి భర్త గోప్య ఆర్. సోని భర్త బాష ఆర్. రెడ్య తండ్రి హన్మ్య ఆర్. బద్య తండ్రి హన్మ ఇ. సరియ తండ్రి సేవ్య ఎ. శంకర్ తండ్రి లక్ష్మా ఎ. శ్రీను తండ్రి హన్మంతు ఎ. కృష్ణ తండ్రి వస్య ఆర్. మత్రు తండ్రి వస్ రాం | 469 | 59 | 463 | 480/1 | లేవు | లేవు | పైప్ లైన్ | 1 |
| | మొత్తం | | | 0.20 | | | | | | | | | |

భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార హక్కు చట్టము 2013 (చట్టం 30/2013) సెక్షన్ 11(1) మరియు తెలంగాణ రాష్ట్ర భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార నియమావళి 2014 రూల్ 19 (1)ని అనుసరించి సంబంధిత వ్యక్తులందరి దృష్టికి ఇట్టి విషయాన్ని తెస్తూ ఈ ప్రకటన జారీ చేయడమైనది.

సదరు చట్టంలోని సెక్షన్ 12 లో గల అధికారాలను అనుసరించి జిల్లా కలెక్టర్ నాగర్‌కర్నూల్ గారు, ప్రత్యేక ఉప కలెక్టరు, యం.జి.ఎల్.ఐ.యస్.పి., నాగర్ కర్నూల్, మరియు వారి సిబ్బందికి సదరు భూమిలో ప్రవేశించి సర్వే మరియు యితర పనులు చేపట్టుటకు అధికారమివ్వ నైనది. ఇట్టి భూసేకరణకు అవసరమైన భూముల యొక్క నక్షా సదరు కార్యాలయము నందు కార్యాలయపు పనివేళలలో పరిశీలించవచ్చును.

సదరు చట్టంలోని సెక్షన్ 11(4) ననుసరించి జిల్లా కలెక్టరు గారి అనుమతి లేకుండా షెడ్యూల్ ప్రకటించిన భూములకు సంబంధించి క్రయ, విక్రయాలు లేదా ఏవిధమైన లావాదేవిలు జరుపరాదని తెలియచేయడమైనది.

సదరు చట్టంలోని సెక్షన్ 15 ననుసరించి ప్రతిపాదిత భూసేకరణ పై ఏమైన ఆభ్యంతరములుగాని, ఆక్షేపణలు గాని ఉన్న యెడల సంబంధిత వ్యక్తులు ఈ ప్రకటన ప్రచురించబడిన తేది నుండి 60 (అరువది) దినములలోగా ప్రత్యేక ఉప కలెక్టరు, యం.జి.ఎల్.ఐ.యస్.పి., నాగర్‌కర్నూల్, గారి ఎదుట అభ్యర్థనలు దాఖలు చేసుకోనవచ్చును.

భూసేకరణ తల పెట్టిన భూమిలో బొగ్గు, ఇనుము, స్టీల్ మరియు ఇతర ఖనిజములు ఇట్టి భూములలో లేదా కొంత భాగములో లభ్యమైనచో, ఆ ఖనిజాలు ప్రాజెక్టు నిర్మాణమునకు ఉపయోగమున్న పక్షములో, వాటిని స్వీకరించబడును. లేనిచో సీకరించబడవు.

పైన చూపిన భూమిని భూసేకరణ చేయు భూముల యొక్క ప్లాన్ ఏదైనా పని దినములలో మరియు కార్యాలయ పని వేళలలో భూసేకరణ అధికారి మరియు ప్రత్యేక ఉప కలెక్టర్ కార్యాలయము, నాగర్‌కర్నూల్ నందు పరిశీలించుకొను నిమిత్తం అందుబాటులో ఉండును.


ఇట్టి ప్రతిపాదించిన భూసేకరణ తెలంగాణ ప్రభుత్వము నీటిపారుదల శాఖ G.O.Ms.No. 51, తేది: 25.07.2017 ద్వారా భూసేకరణ, నష్ట పరిహరము, పునరావాస, పునరుపాధి కల్పన చట్టము, 2013 లోని అధ్యాయము- II మరియు అధ్యాయము-III ప్రభావిత అధ్యాయము మరియు ఆహార భద్రత నుండి మినహాయింపును ఇవ్వడము జరిగినది.

సం/- స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూ.సే), యూనిట్-1, యం.జి.ఎల్.ఐ.యస్.పి., నాగర్‌కర్నూల్
సం/- అదనపు కలెక్టర్ నాగర్‌కర్నూల్
సం/- జిల్లా కలెక్టర్ నాగర్‌కర్నూల్

DIPR RO NO. 1335/LA/PP/Advt/Pub/2025-26

# వచ్చే నెల 2 నుంచి ఐదు మండలాల్లో.. 'భూభారతి' పైలట్ ప్రాజెక్ట్

## మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఇంటిగ్రేటెడ్ భూభారతి (ఇంటిగ్రేటెడ్ డిజిటల్ ల్యాండ్ రికార్డ్స్ మేనేజిమెంట్ సిస్టమ్) పోర్టల్‌ను వచ్చేనెల 2వ తేదీ నుంచి ఐదు మండలాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేయనున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. సచివాలయంలో రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్, ఎన్ఐసి అధికారులతో గురువారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో మంత్రి ఈ కీలక నిర్ణయాలను తెలిపారు. రెవెన్యూ, సర్వే, స్టాంప్స్, రిజిస్ట్రేషన్ విభాగాలను సమన్వయం చేస్తూ ఈ పోర్టల్‌ను రూపొందించామని మంత్రి తెలిపారు. సర్వే నుంచి రిజిస్ట్రేషన్ వరకు అన్ని సేవలు ఇకపై ఒకే చోట లభిస్తాయన్నారు. కొస్గి (నారాయణపేట జిల్లా), అమనగల్ (రంగారెడ్డి జిల్లా), వట్‌పల్లి, (సంగారెడ్డి జిల్లా), కుసుమంచి (ఖమ్మం జిల్లా), అశ్వరావుపేట (భద్రాద్రి కొత్తగూడెం జిల్లా) ప్రయోగాత్మాకంగా ఈ గ్రామాల్లో అమలు చేస్తామన్నారు. ప్రతి సర్వే నెంబర్‌కు భూధార్' ఆధార్ కార్డు తరహాలోనే ప్రతి సర్వే నెంబర్‌కు ప్రత్యేకంగా 'భూధార్' నెంబర్‌ను కేటాయిస్తామన్నారు. ఇప్పటికే ఐదు గ్రామాల్లో రీసర్వే పూర్తి చేసి భూధార్‌ను కేటాయించినట్లు మంత్రి తెలిపారు. భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా, రిజిస్ట్రేషన్ సమయంలోనే సర్వే మ్యాప్‌ను జతపరిచే నిబంధనను పైలట్ మండలాల్లో అమలు చేస్తామన్నారు. ప్రజలు తమ మొబైల్ నెంబర్ (ఆధార్ అనుసంధానిత) ద్వారా లాగిన్ అయ్యి కేవలం ఒక క్లిక్ తో భూమికి సంబంధించిన పూర్తి సమాచారాన్ని పొందవచ్చని తెలిపారు. మైల్యాండ్ పోర్ట్‌పోలియో, నాలా ఆర్డర్స్, మ్యూటేషన్, ఈసి, మార్కెట్ విలువ, విలేజ్ మ్యాప్, పాస్ బుక్ కరెక్షన్ వంటి సేవలతో పాటు అప్పీల్ చేసుకునే సదుపాయం కూడా ఉంటుందన్నారు. దరఖాస్తు చేసుకున్నప్పటి నుండి ప్రక్రియ పూర్తయ్యే వర కు ప్రతి దశలోనూ వినియోగదారుడికి ఎస్ఎంఎస్ ద్వారా సమాచారం అందుతుందన్నారు. ఎన్నికల హామీ మేరకు ధరణి చిక్కుముడులను విప్పుతూ భూ భారతి చట్టాన్ని తీసుకువచ్చామన్నారు. పైలట్ మండలాల్లో వచ్చే ఫలితాలను బట్టి, అవసరమైన మార్పులు చేసి త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా ఈ విధానాన్ని అమలు చేస్తామన్నారు. ఈ సమావేశంలో రెవెన్యూ కార్యదర్శి లోకేశ్ కుమార్, రిజిస్ట్రేషన్ ఐటి రాజీవ్ గాంధీ హనుమంతు పాల్గొన్నారు.

# హుస్నాబాద్‌లో రహదారి అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి

## మంత్రి పొన్నంకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి వినతి




**ప్రజాపక్షం/హైదరాబాద్:** హుస్నాబాద్ నియోజకవర్గంలోని రహదారి అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. మహ్మదాపూర్ నుంచి అనభేరి ప్రభాకర్‌రావు స్మృతి చిహ్నం వరకు రహదారి అభివృద్ధి కోసం పంచాయతీరాజ్ శాఖ ద్వారా ఒక కోటి రూపాయల నిధులు మంజూరు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు అసెంబ్లీ లాబీల్లోని మంత్రి ఛాంబర్‌లో పొన్నం ప్రభాకర్‌ను చాడ వెంకట రెడ్డి కలిసి ఒక విజ్ఞాపన పత్రాన్ని అందజేశారు. 1948 మార్చి 14న తెలంగాణ సాయుధ పోరాట సమయంలో 12 మంది వీరులు ప్రాణాలు కోల్పోయిన ప్రాంతంలో స్మారక చిహ్నం నిర్మించారని, ఆ ప్రాంతానికి వెళ్లే రహదారి ప్రస్తుతం దెబ్బతినడం, కల్వర్టులు లేకపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఒక్కోసారి ప్రమాదాలు కూడా చోటుచేసుకుంటున్నాయని చాడ వెంకట్ రెడ్డి మంత్రి ప్రభాకర్‌కు వివరించారు. ఈ పరిస్థితిని పరిగణలోకి తీసుకుని మహ్మదాపూర్ ఆర్ అండ్ బి రహదారి నుంచి స్మృతి చిహ్నం వరకు రహదారిని అభివృద్ధి చేసి ప్రజలకు సౌకర్యం కల్పించాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఆయన కోరారు.

# కాంట్రాక్టు ఉద్యోగులకు కనీస వేతనాలు అమలు చేయాలి

## సమగ్ర శిక్షా ఉద్యోగుల మహాధర్నాలో కూనంనేని సాంబశివరావు





**ప్రజాపక్షం/హైదరాబాద్:** కాంట్రాక్టు ఉద్యోగులకు కనీస వేతనాలు అమలు చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాలు, అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలు, సమ గ్రశిక్షాలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, సిబ్బంది సమస్యల పరిష్కారం కోరుతూ టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావ రవి అధ్యక్షతన గురువారం చలో అసెంబ్లీ కార్యక్రమంలో భాగంగా ఇందిరాపార్కు వద్ద మహా ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు కూనంనేని సాంబశివరావు హాజరై మద్దతు తెలిపారు. ఈ సదర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ గత ఇరవై ఏళ్లుగా కెజిబివి, యుఆర్ఎస్, సమగ్ర శిక్షా ఉద్యోగులకు నామ మాత్రపు వేతనాలతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శ్రమ దోపిడీకి పాల్పడుతున్నాయని విమర్శించారు. శాసనసభలో కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలను ప్రస్తావించి పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. ప్రొఫెసర్ కె.నాగేశ్వర్ మాట్లాడుతూ కెజిబివిలలో అనాథలు, పాక్షిక అనాథ బాలికలకు నా ణ్యమైన విద్యను అందిస్తూ అద్భుతమైన ఫలితాలను సాధిస్తున్నారన్నారు. జాతీయ మహిళా ఉపాధ్యాయ నాయకురాలు ఎం.సంయుక్త మాట్లాడుతూ కెజిబివి, యుఆర్ఎస్ ఉద్యోగు లకు రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మరణిస్తే కనీసం చావు ఖర్చులు కూడా ఇవ్వడం లేదని, రూ.10 లక్షల ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. చావ రవి మాట్లాడుతూ తెలంగాణ తొలి పిఆర్‌సి సిఫారసు చేసిన విధంగా కాంట్రాక్టు ఉద్యోగులకు వెయ్యి రూపాయల వార్షిక ఇంక్రిమెంట్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టిఎస్‌యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.వెంకట్, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి బి.మధు, టిఎస్‌యుటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు దుర్గా భవాని, కో శాధికారి టి.లక్ష్మారెడ్డి, కెజిబివి, యుఆర్ఎస్, సమగ్ర శిక్ష నాయకులు విశాలాక్షి తదితరులు పాల్గొన్నారు.

# ఆర్‌టిసి జెఎసి సమ్మెకు జాతీయ సంఘాల మద్దతు

## 'ఆర్‌టిసి పరిరక్షణ -ప్రభుత్వ హామీలు' అనే అంశంపై జాతీయ కార్మిక సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఆర్‌టిసి జెఎసి తలపెట్టిన సమ్మెకు జాతీయ సంఘాలు తమ సంపూర్ణ మద్ధతు ప్రకటించినట్లు ఆర్‌టిసి జెఎసి చైర్మన్ ఈదురు వెంకన్న ఒక ప్రకటనలో తెలిపారు. టిజిఎస్ ఆర్‌టిసి జెఎసి ఆధ్వర్యంలో హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని ఎఐటియుసి రాష్ట్ర కార్యాలయంలో గురువారం 'ఆర్‌టిసి పరిరక్షణ ప్రభుత్వ హామీలు' అనే అంశంపై జాతీయ కార్మిక సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. జెఎసి చైర్మన్ ఈదురు వెంకన్న, వైస్ చైర్మన్ ఎం.థామస్ రెడ్డిలు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్ రాజ్, సిఐటియు రాష్ట్ర కోశాధికారి వి.రాములు, ఐఎఫ్‌టియు ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాస్, టియుసిఐ ప్రధాన కార్యదర్శి ఎస్.ఎల్ పద్మ హాజరు కాగా, వీరితో పాటు ఆర్‌టిసి జెఎసి కో కన్వీనర్లు కత్తుల యాదయ్య, బి.యాదగిరి, జెఎసి కోశాధికారి బి.యాదయ్య, కె.సత్యం, జె.రాఘవులు, బి.గోపాల్, కె.మనోహర్, డి.రాంచందర్ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్. బాలరాజ్ మాట్లాడుతూ ఆర్‌టిసి పరిరక్షణ కోసం, ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు కోసం, దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న వేతన సవరణల కోసం, న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఆర్‌టిసి జెఎసి తలపెట్టిన సమ్మెకు సంపూర్ణ మద్దతు ప్రకటించి, ప్రత్యక్ష పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈదురు వెంకన్న, థామస్‌రెడ్డిలు మాట్లాడుతూ ఆర్‌టిసిని ప్రైవేట్ పరం కాకుండా పరిరక్షించుకోవాల్సిన భాద్యత విద్యార్థులు, నిరుద్యోగులు, రైతు కూలీలు, అసంఘటిత కార్మికులపై, ప్రజాస్వామిక వాదులపై, ప్రజాసంఘాలపై, మేధావులపై ఉందని అభిప్రాయపడ్డారు. అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టినట్లుగా ఆర్‌టిసి ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం, ట్రేడ్ యూనియన్ల పునరుద్ధరణ, రెండు వేతన సవరణలు, ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా అన్ని సౌకర్యాలు కల్పించడం, ఆర్‌టిసిని విస్తరించి, అభివృద్ధి చేస్తామనే హామీలను నేటికీ ఎందుకు అమలు చేయడం లేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

# ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా దాడిని ఖండించాలి

## యుద్ధం వద్దని మహిళామణులు ఐక్యంగా ముందుకు సాగాలి

## శ్రామిక మహిళా ఫోరమ్ రాష్ట్ర కన్వీనర్ ప్రేమ్ పావని




**ప్రజాపక్షం/హైదరాబాద్:** మొదటి, రెండో ప్రపం చ యుద్ధాల తరవాత మరో యుద్ధం రావొద్ద ని, అందుకోసం ప్రపంచ వ్యాప్తంగా ఉన్న మహిళామణులు ఐక్యంగా ముందుకు సాగాలని తెలంగాణ శ్రామిక మహిళా ఫోరం రాష్ట్ర కన్వీనర్ పి.ప్రేమ్ పావని అన్నారు. మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత మతాల మధ్య ఘర్షణలు అధికమయ్యాయన్నారు. మౌన ముని మోదీ యుద్ధాన్ని నియంత్రించే చర్యలు చేపట్టకుండా, కనీసం ఖండించలేని స్థితికి దేశాన్ని తీసుకొచ్చారని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ దాడిని ఖండిస్తూ ఈ నెల 29న ప్రజాస్వామ్య రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో చార్మినార్ నుండి నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ వరకు జరిగే ర్యాలీకి సంఘీభావంగా గురువారం హైదరాబాద్ హిమాయతనగర్‌లోని మఖ్దూంభవన్‌లోని రాజ్ బహదూర్ హాల్‌లో భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యు) రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో 'యుద్ధం వద్దు' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం ఎన్ఎఫ్ఐడబ్ల్యు రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎస్. ఛాయాదేవి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ప్రేమ్ పావని మాట్లాడుతూ యుద్ధం కారణంగా చిన్న, మధ్య తరగతి ప్రజలు ఉపాధి కోల్పోయి ఇంటికే పరిమితమయ్యే పరిస్థితి ఏర్పడిందన్నారు. 'యుద్ధం వద్దు, శాంతి ముద్దు' అని పేర్కొన్నారు. ఎన్ఎఫ్ఐడబ్ల్యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి మాట్లాడుతూ ఇరాన్, ఇజ్రాయిల్ యుద్ధం సెగ ఇండియాలోని ప్రతి ఇంటిలోని వంటింటి దాకా తాకిందని, నిత్యావసర ధరలు వి పరీతంగా పెరుగుతున్నాయని, ఇకనైనా యుద్ధం ఆపేలా ప్రపంచ దేశాలు చర్యలు చేపట్టాలని కోరారు. ఛాయా దేవి మాట్లాడుతూ పశ్చిమాసియాలో జరుగుతున్న యుద్ధం కారణంగా భారతదేశంలో గ్యాస్, పెట్రోల్, డీజిల్ కొరత ఏర్పడి తీవ్ర ఆర్థిక సంక్షోభం నెలకొందన్నారు. పిఓడబ్ల్యు జాతీయ కన్వీనర్ సంధ్య మాట్లాడుతూ పశ్చిమ ఆసియా దే శాలలో జరుగుతున్న యుద్ధం ప్రపంచ శాంతికి భగ్నం కలిగించే యుద్ధం అని పేర్కొన్నారు. పిఓడబ్లు రాష్ట్ర కార్యదర్శి అనసూయ మాట్లాడుతూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఎత్తులు, కుయుక్తులు పన్ని, చిన్న దేశాలను తన గుప్పిట్లో పెట్టుకునే ప్ర యత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో ఎన్ఎఫ్ఐడబ్ల్యు రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎండి.ఫైమీదా, యంగ్ వర్కింగ్ ఉమెన్ కన్వీనర్ జ్యోతి శ్రీమాన్, సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి బి.స్టాలిన్, ఎఐఎస్ఎఫ్ నేతలు ఉదయ్ కుమార్, రెహమాన్ తదితరులు పాల్గొని యుద్ధంపై తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ప్రజానాట్యమండలి ప్రధాన కార్యదర్శి పల్లె నరసింహ తన దైన శైలిలో పాడిన పాటలు మహిళల్లో ఉత్సాహాన్ని నింపాయి. ప్రజాతంత్ర, అభ్యుదయవాదులు, మహిళలు, ప్రజలు పెద్ద ఎత్తున ర్యాలీలో పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు.

# ఎల్‌పిజి గ్యాస్ కొరత వల్ల ఆటో డ్రైవర్లకు అవస్థలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** అమెరికా, ఇజ్రాయిల్, ఇరాన్ యుద్ధం వలన ఆటో డ్రైవర్లకు రోజువారిగా ఉపయోగించే ఎల్‌పిజి గ్యాస్ కొరత వలన పెట్రోల్ బంకుల వద్ద రెండు కిలోమీటర్ల వరకు ఆటోలతో క్యూ లైన్లలలో ఉన్నా, ఎల్‌పిజి దొరకడం లేదని తెలంగాణ రాష్ట్ర ఆటో రిక్షా, ప్రైవేట్ మోటార్ డ్రైవర్స్ యూనియన్ (ఎఐటియుసి ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.వెంకటేశం అన్నారు. గత 20 రోజుల ముందు ఆటో ఎల్‌పిజి ధర రూ.60లు ఉండగా ప్రస్తుతం గ్యాస్ కొరత వలన రూ.120లకు పెంచారని, అయినా కూడా పెట్రోల్, గ్యాస్ బంక్‌లలో నో స్టాక్ బోర్డులు ఏర్పాటు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ గ్యాస్ కొరత వలన రోజువారీగా ఆటోలు నడుపుకొని జీవించే ఆటో డ్రైవర్ల కుటుంబాలపై తీవ్ర ప్రభావం ఏర్పడిందని, ఆటోలు నడపలేక డ్రైవర్లు నానా అవస్థలు పడుతున్నారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే జోక్యం చేసుకొని ఆటో ఎల్‌పిజి కొరతను నివారించి, ఆటో డ్రైవర్లను ఆదుకోవాలని, లేకుంటే ఆటో డ్రైవర్ల జీవన భృతికి రూ.15వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

పురపాలక సంఘం : యాదగిరిగుట్ట

నెం. ఎ1/24/2026 ప్రకటన తేది: 25.03.2026

ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా పురపాలక సంఘం, యాదగిరిగుట్టనకు సంబంధించిన అంగడి వేలము 2026-2027 సంవత్సరమునకు గాను తేది: 04/04/2026 శనివారం నాడు. సాయంత్రం: 03.00 గంటలకు పురపాలక సంఘ కార్యాలయము, యాదగిరిగుట్ట నందు బహిరంగ వేలము ద్వారా నిర్వహింపబడును.

వివరములు

| క్ర.స. | మార్కెట్ | ధరావత్ సొమ్ము (E.M.D.) డిమాండ్ డ్రాఫ్ట్ (డి.డి.). |
|---|---|---|
| 1 | అంగడి వేలము | రూ.1,00,000/-లు |

ధరావత్ సొమ్ము కమీషనర్, యాదగిరిగుట్ట మునిసిపాలిటి పేరిట ఏదేని బ్యాంకు ద్వారా తీయబడిన డిమాండ్ డ్రాఫ్ట్ ద్వారా సమర్పించవలెను. తేది. 03/04/2026 గురు వారం నాడు సాయంత్రం 5.00 గంటలలోగా పురపాలక సంఘ కార్యాలయము, యాదగిరిగుట్ట నందు ధరఖాస్తుతో పాటుగా ధరావత్ సొమ్ము (E.M.D.) Through Bank Demand Draft చెల్లించవలెను. ఇంటి పన్ను, నల్లా పన్ను మరియు లైసెన్స్ ఫీజులు మొదలుగున్నవి. బకాయి లేనట్లు సర్టిఫికెట్ జతపర్చవలెను. తేది: 28/03/2026 నుండి తేది: 03/04/2026 వరకు కార్యాలయ పని వేళలలో ధరఖాస్తు రుసుము రూ.లు 3000/- చెల్లించి దరఖాస్తు ఫారమును పొందగలరు. మిగతా వివరములకై కార్యాలయము నందు సంప్రదించగలరు.

సం/- కమీషనర్, పురపాలక సంఘం, యాదగిరిగుట్ట.

DIPR R.O. No. : 17649-PP/CL/ADVT/1/2025-26, Date: 26-03-2026

# సిఎస్ఆర్ నిధుల వినియోగానికి
# ప్రత్యేక పాలసీ

### అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కార్పొరేట్ సామాజిక బాధ్యత (సిఎస్ఆర్) నిధుల సమీకరణతో పాటు వాటిని సమర్థవంతంగా వినియోగించడానికి ప్రత్యేక పాలసీని రూపొందించాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. రాష్ట్ర స్థాయిలో సిఎస్ఆర్ సెల్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. సిఎస్ఆర్ నిధులతో రాష్ట్రంలో అభివృద్ధి, ప్రజోపయోగ కార్యక్రమాలు చేపట్టే కార్పొరేట్ సంస్థలను ప్రభుత్వం తరఫున అభినందించాలని సూచించారు. ప్రతి ఏడాది అత్యుత్తమ భాగస్వామ్యం అందించిన సంస్థల ప్రతినిధులను అభినందించేందుకు ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేయాలని చెప్పారు. రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో భాగంగా ఈ అభినందన కార్యక్రమానికి ఏర్పాట్లు చేయాలన్నారు.శాసనమండలి సమావేశ హాల్‌లో ముఖ్యమంత్రి సిఎస్ఆర్ నిధులపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. సమావేశంలో సిఎం మాట్లాడుతూ ఇప్పటి వరకు వచ్చిన సిఎస్ఆర్ ఫండ్స్ ఆశించిన స్థాయిలో లేవని, తెలంగాణలో కంపెనీలు, పరిశ్రమలు ఏర్పాటు చేసి సిఎస్ఆర్ నిధులను వేరే చోట ఖర్చు పెడితే ఎలా అని ముఖ్యమంత్రి అధికారులను ప్రశ్నించారు. రాష్ట్రానికి మరిన్ని సిఎస్ఆర్ నిధులు రావాల్సిన అవసరం ఉందని, మన రాష్ట్రంలో ఉన్న కార్పొరేట్ సంస్థలు తెలంగాణలోనే ఎక్కువ సిఎస్ఆర్ ఖర్చు పెట్టేలా చూడాలన్నారు. రాష్ట్రంలోని కార్పొరేట్ కంపెనీలు సిఎస్ఆర్ నిధులతో చేపడుతున్న కార్యక్రమాల వివరాలు, అన్ని ప్రభుత్వ విభాగాల్లో అందుబాటులో ఉన్న ప్రాజెక్టులు, సిఎస్ఆర్ ద్వారా చేపట్టేందుకు వీలున్న కార్యక్రమాల వివరాలన్నీ సమన్వయం చేసే బాధ్యతలను రాష్ట్రస్థాయి సెల్ నిర్వర్తిస్తుందని తెలిపారు. ప్రభుత్వానికి, కార్పొరేట్ సంస్థలకు అనుసంధానంగా ఉండేలా ప్రత్యేకంగా తెలంగాణ సిఎస్ఆర్ పోర్టల్ రూపొందించాలని సిఎం ఆదేశించారు. కార్పొరేట్ సంస్థల సిఎస్ఆర్ వివరాలను ఇచ్చేందుకు, వివిధ విభాగాల పరిధిలో చేపట్టేందుకు వీలున్న ప్రాజెక్టుల వివరాలన్నీ పోర్టల్‌లో పొందుపరచాలన్నారు. కార్పొరేట్ సంస్థలు ప్రభుత్వాన్ని సంప్రదించేందుకు, తమకు అనువైన ప్రాజెక్టులను ఎంచుకునేందుకు వీలుగా ఈ పోర్టల్ ఆకర్షణీయంగా తయారు చేయాలని చెప్పారు. సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావుతో పాటు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



### ప్రతి చిన్నారికి నాణ్యమైన విద్య, పోషకాహారం
## అందించేందుకు చర్యలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలోని ప్రతి చిన్నారికి నాణ్యమైన విద్య, పోషకాహారం అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రముఖ ఆర్థికవేత్త కార్తీక్ మురళీధరన్ రాష్ట్ర శాసనమండలి హాల్‌లో ముఖ్యమంత్రితో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావుతో పాటు సంబంధిత శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో 10 ఏళ్ల లోపు పిల్లల్లో పోషకాహార లోపం, విద్యాభ్యాస స్థాయి సామర్థ్య లోపాలకు సంబంధించిన పలు నివేదికలను కార్తీక్ మురళీధరన్ దృష్టికి తెచ్చారు. చిన్న వయసులో పోషకాహార లోపం వల్ల భవిష్యత్తులో తలెత్తే ఆరోగ్య సమస్యలు, ప్రాథమిక స్థాయిలో సరైన బోధన లభించకపోతే విద్యార్థి భావి జీవితంలో పడే మానసిక వేదనను ఆయన వివరించారు. వాటిని అధిగమించడానికి తీసుకోవాల్సిన అంశాలను సూచించారు. విభిన్న అంశాలపై తాము ఇప్పటికే ప్రత్యేక శ్రద్ధ పెట్టామని ముఖ్యమంత్రి తెలిపారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంతో పాటు అల్పాహారం అందించేందుకు బడ్జెట్‌లో కేటాయింపులు చేసినట్టు వివరించారు. అంగన్‌వాడీల్లో కార్యకర్తలు, ఆయాలతో పాటు పోషకాహారం అందించేందుకు అదనంగా మరొకరిని నియమించాలని కార్తీక్ మురళీధరన్ సూచించారు. అంగన్‌వాడీల్లో పిల్లలకు పోషకాహారం అందించేందుకు 'పోషణ సఖి' పేరుతో మరొకరిని నియమించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. కార్తీక్ మురళీధరన్ సూచించిన అంశాలను కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ (క్యూర్) పరిధిలోని 29 స్కూల్ కాంప్లెక్స్‌ల్లో ప్రయోగాత్మకంగా అమలు చేసే అవకాశాలను పరిశీలించాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు.

## నిఖిల్ డే బృందంతో సిఎం భేటీ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డితో ప్రముఖ సామాజిక కార్యకర్త, మజ్దూర్ కిసాన్ శక్తి సంఘటన్ (ఎంకెఎస్ఎస్) వ్యవస్థాపక సభ్యులు నిఖిల్ డే బృందం భేటీ అయ్యారు. ఈ సమావేశం తెలంగాణ శాసనమండలి కాన్ఫరెన్స్ హాల్‌లో గురువారం జరిగింది. రాష్ట్రంలో అమలవుతున్న వివిధ ప్రజాక్షేమ కార్యక్రమాలు, పాలనాపరమైన సంస్కరణలపై ఈ సందర్భంగా సుదీర్ఘ చర్చించారు. ప్రస్తుతం రాష్ట్ర స్థాయిలో విజయవంతంగా కొనసాగుతున్న 'ప్రజా వాణి' కార్యక్రమాన్ని మరింత చేరువ చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఈ ఫిర్యాదుల పరిష్కార వేదికను రెవెన్యూ డివిజన్ స్థాయి వరకు విస్తరించాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. తద్వారా సామాన్య ప్రజలు తమ సమస్యల కోసం రాజధాని వరకు రానవసరం లేకుండా, స్థానికంగానే పరిష్కారం పొందే అవకాశం లభిస్తుంది. దీనిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. పారదర్శకతను పెంచే లక్ష్యంతో రాజస్థాన్‌లోని 'జన్ సూచన పోర్టల్' మాదిరిగా తెలంగాణలో కూడా 'ప్రజా సూచన పోర్టల్' ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. వివిధ ప్రభుత్వ శాఖలు అమలు చేస్తున్న పథకాలు, వాటి లబ్దిదారులు, నిధుల వివరాలన్నీ ఈ పోర్టల్లో అందుబాటులో ఉంటాయి. ఈ పోర్టల్‌ను అత్యుత్తమ సాంకేతికతతో రూపొందించే బాధ్యతను ఐటీ శాఖకు అప్పగిస్తూ సిఎం ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించిన 'గిగ్ వర్కర్స్ బిల్లు'పై నిఖిల్ డే ప్రశంసించారు. అసంఘటిత రంగంలోని స్విగ్గీ, జొమాటో బాయ్స్, క్యాబ్ డ్రైవర్లు వంటి గిగ్ కార్మికులకు సామాజిక భద్రత కల్పించడంలో ఈ బిల్లు దేశానికే ఆదర్శంగా, చారిత్రాత్మక నిర్ణయంగా నిలుస్తుందని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ భేటీ సమావేశంలో ప్లానింగ్ బోర్డ్ వైస్ చైర్మన్ డాక్టర్ జి. చిన్నారెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీనియర్ ఉన్నతాధికారులు దాన కిషోర్, వి. శేషాద్రి, బి. అజిత్ రెడ్డి, మాణిక్ రాజ్, దివ్య దేవరాజన్, వేముల శ్రీనివాసులు పాల్గొన్నారు.



### దక్షిణభాగం రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణానికి
## మరో కీలక అడుగు
### డిపిఆర్ రూపొందిస్తామని మంత్రి కోమటిరెడ్డికి లేఖ ద్వారా స్పష్టం చేసిన కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర రహదారుల నెట్‌వర్క్‌లో మరో మైలురాయి చేరబోతోంది. రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి నిరంతర కృషితో దక్షిణ భాగం రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణ ప్రక్రియలో ఒక కీలక ముందడుగు పడింది. మంత్రి కోమటిరెడ్డి గతంలో చేసిన ప్రతిపాదనలపై సానుకూలంగా స్పందించిన కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ, ఈ ప్రాజెక్టు పురోగతిని వివరిస్తూ ఆయనకు ఒక అధికారిక లేఖ రాశారు. సదరన్ పార్ట్ రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణానికి సంబంధించి డీటెయిల్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (ఆర్ఆర్ఆర్) రూపొందిస్తున్నట్లు కేంద్ర మంత్రి స్పష్టం చేశారు. ఈ పనుల కోసం ఇప్పటికే ప్రత్యేక కన్సల్టెన్సీని అపాయింట్ చేశామని, నివేదిక తయారీ ప్రక్రియ కొనసాగుతోందని గడ్కరీ తన లేఖలో పేర్కొన్నారు. కేంద్రం నుంచి వచ్చిన సానుకూల స్పందన పట్ల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని తాము చేసిన విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకున్నందుకు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. 'ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో నిర్మితం కాబోయే ఈ రీజినల్ రింగ్ రోడ్డు రాష్ట్ర ఆర్థిక ముఖచిత్రాన్ని మార్చేయబోతోంది. ఇది తెలంగాణ అభివృద్ధికి నిజమైన 'గేమ్ చేంజర్'గా నిలుస్తుంది' అని మంత్రి పేర్కొన్నారు. ఈ రింగ్ రోడ్డు పూర్తయితే రవాణా వ్యవస్థ మెరుగుపడటమే కాకుండా, శివారు జిల్లాల్లో పారిశ్రామికాభివృద్ధికి భారీ అవకాశాలు లభిస్తాయన్నారు. ఉత్తర, దక్షిణ భాగాల అనుసంధానంతో హైదరాబాద్ చుట్టూ ఉన్న ప్రాంతాలు అంతర్జాతీయ స్థాయి మౌలిక వసతులను పొందుతాయనీ, ఈ ప్రాజెక్టును వీలైనంత త్వరగా పూర్తి చేసేలా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో నిరంతరం సమన్వయం చేసుకుంటుందని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు.

## పిఆర్‌సి మరోసారి పొడిగింపు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగుల వేతన సవరణ కమిషన్ గడువును ప్రభుత్వం సెప్టెంబర్ నెలాఖరు వరకు పొడిగించింది. ప్రస్తుత పిఆర్‌సి కమిటీ గడువు మరో ఐదు రోజుల్లో మార్చి 31వ తేదీ నాటికి ముగియనుంది. ఈ నేపథ్యంలో మరో ఆరు నెలల పాటు కమిటీ గడువును పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు కొత్త పిఆర్‌సి కోసం చాలా కాలంగా ఎదురు చూస్తున్నారు. కొత్త పిఆర్‌సి నివేదిక ఇంకా ప్రభుత్వానికి చేరలేదు. ఇప్పటికే కొత్త పిఆర్‌సి కోసం ఉద్యోగ సంఘాల నేతలు ప్రభుత్వానికి పలుమార్లు వినతిపత్రాలు సమర్పించారు. ఇదిలా ఉండగా పిఆర్‌సి కమిటీ గడువును ప్రభుత్వం పొడిగించడంతో ఉద్యోగులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

### జర్నలిస్టుల సమస్యలపై అసెంబ్లీలో..
## కూనంనేని వాయిదా తీర్మానం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలోని జర్నలిస్టులు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలపై చర్చించాలని కోరుతూ సిపిఐ శాసనసభ పక్షనేత కూనంనేని సాంబశివరావు గురువారం శాసనసభలో వాయిదా తీర్మానం నోటీసు ఇచ్చారు. అయితే ఈ వాయిదా తీర్మానాన్ని స్పీకర్ తిరస్కరించారు.

**ఒయు పదోన్నతుల్లో గందరగోళం : ఎమ్మెల్యే పాల్వాయ్ హరీశ్ బాబు**

ఉస్మానియా యూనివర్సిటీలో అర్హత కలిగిన ఫ్యాకల్టీకి పదోన్నతుల విషయంలో తీవ్ర అన్యాయం జరుగుతోందని సిర్పూర్ బిజెపి ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు శాసనసభ జీరో అవర్‌లో ఆవేదన వ్యక్తం చేశారు. ఒయు పాలన పూర్తిగా అస్తవ్యస్తంగా మారిందని ఆయన విమర్శించారు. కెరియర్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్ కింద పదోన్నతులకు కావాల్సిన అన్ని యుజిసి అర్హతలు ఉన్నప్పటికీ, 47 మంది ఫ్యాకల్టీ సభ్యులకు పదోనన్నతులు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారని సభ దృష్టికి తీసుకొచ్చారు. ప్రొఫెసర్ మనోహర్‌పై విధించిన అక్రమ సస్పెన్షన్ వెంటనే రద్దు చేయాలని, దీనిపై యుజిసి కమిటీతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. నిలిచిపోయిన పదోన్నతుల ప్రక్రియను యథావిధిగా, నిబంధనల ప్రకారం చేపట్టాలని కోరారు.

**కొండగట్టులో లిఫ్ట్ ఇరిగేషన్ పనులు పూర్తి చేయాలి : ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం**

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొండగట్టు ప్రాంతంలో తాగు, సాగునీటి ఇబ్బందులను తొలగించాలని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం శాసనసభ జీరో అవర్‌లో ప్రభుత్వాన్ని కోరారు. నాచుపెల్లి జెఎన్‌టియు కళాశాలలోని సుమారు 2,000 మంది విద్యార్థులు తాగునీటి సమస్యతో ఇబ్బంది పడుతున్నారని సభ దృష్టికి తీసుకెళ్లారు. కొండగట్టు లిఫ్ట్ ఇరిగేషన్ పనులను త్వరితగతిన పూర్తి చేస్తే విద్యార్థులతో పాటు పలు రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. నారాయణపూర్ గ్రామాన్ని ముంపు గ్రామంగా ప్రకటించి, బాధితులకు న్యాయం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

**అసైన్డ్ భూముల సమస్యను పరిష్కరిస్తాం : మంత్రి పొంగులేటి**

రాష్ట్ర వ్యాప్తంగా సంవత్సరాల తరబడి అసైన్డ్ భూముల్లో ఇళ్లు కట్టుకొని నివాసం ఉంటున్న వారి సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని రెవెన్యూ శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. శాసనసభ జీరో అవర్‌లో ఆలేర్ ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఆలేర్, భువనగిరి ప్రాంతాల్లో 3040 సంవత్సరాల నుంచి స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్న వారి భూములను నిషేధిత జాబితాలో పెట్టడం కారణంగా రిజిస్ట్రేషన్‌లు, భవన నిర్మాణ అనుమతులు, బ్యాంకు రుణాలు రావడం లేదని, ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. దీనిపై మంత్రి స్పందిస్తూ త్వరలోనే ఈ సమస్యపై సమావేశం నిర్వహిస్తామన్నారు. దశాబ్దాలుగా పేదలు నివాసం ఉంటున్న స్థలాలపై ఉన్నత స్థాయిలో నిర్ణయం తీసుకుంటామని హామీనిచ్చారు.

### 'బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల' అంశంపై
## ప్రభుత్వ, ప్రతిపక్షాల మధ్య వాగ్వాదం
### బిసిల రిజర్వేషన్లను సాధించే లక్ష్యంగా పని చేస్తున్నామని, అందరూ కలిసి రావాలని ప్రతిపక్షాలను ఆహ్వానించిన మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** శాసనసభలో పద్దులపైన జరిగిన చర్చలో 'బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల' అంశం పైన ప్రభుత్వ, ప్రధానప్రతిపక్షాల మధ్య వాగ్వాదం చోటుచేసుకున్నది. బిసిల రిజర్వేషన్లను సాధించే లక్ష్యంగా పని చేస్తున్నామని, ఇందుకు అందరూ కలిసి ముందుకు రావాలని ఐటి,పరిశ్రమల, శాసనసభ వ్యవహారాల మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు ప్రతిపక్షాలను ఆహ్వానించారు. ఒక వేళ ముందుకు రాకపోయినా తమ లక్ష్యాన్ని మాత్రం నిర్వీర్యం చేయొద్దని సూచించారు. శాసనసభలో గురువారం పద్దులపైన జరిగిన చర్చలో బిఆర్‌ఎస్‌ఎల్‌పి ఉప నాయకుడు తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ బిసి రిజర్వేషన్ల అంశంపైన సిఎం, మంత్రులు, కాంగ్రెస్ ఎంపిలు, ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలు ఢిల్లీలో చేపట్టిన ధర్నాకు ఆ పార్టీకి చెందిన రాహుల్‌గాంధీ, ఎఐసిసి అధ్యక్షుడు కూడా రాలేదని, ఓట్ల కోసం అమలుకు సాధ్యం కాని హామీలతో ప్రజలను మోసం చేసేందుకేనా అని బిఆర్‌ఎస్‌ఎల్‌పి ఉప నాయకుడు తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆరోపించారు. దీనిపైన మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు స్పందిస్తూ బిసి వర్గాలకు రిజర్వేషన్లు ఉండాలని, వారి పక్షాన రాహుల్‌గాంధీ నిలబడ్డారని, ఇది వరకు జరిగిన తప్పును సరి చేయాలని ఆయనముందుకొచ్చారని గుర్తు చేశారు. ఢిల్లీలో తాము పోరాటం చేస్తుంటే బిఆర్‌ఎస్ మాత్రం బిజెపికి భయపడి అక్కడికి రాలేదని ఆయన ఆరోపించారు. డెడికేషన్ కమిటీని ఏర్పాటు చేసి కోర్టు తీర్పుకు అనుగుణంగా ఒక ప్రయత్నం చేశామన్నారు. ఎన్‌డిఎ కూటమి సభ్యులు కూడా రాష్ట్రపతి వద్దకు వెళ్లి బిసి రిజర్వేషన్ల అంశాన్ని తీసుకెళ్లారని వివరించారు. తమ ప్రయత్నాన్ని, చిత్తశుద్ధిని శంకించాల్సిన అవసరం లేదన్నారు.

మంత్రి సీతక్క మాట్లాడుతూ 'మీరు (తలసాని శ్రీనివాసయాదవ్) అప్పుడు మంత్రిగా ఉన్నప్పుడు ఎందుకు అడగలేదని' ప్రశ్నించారు. తాము అధికారంలోనికి వస్తే రిజర్వేషన్లు అమలు చేస్తామని గత ఎంఎల్‌ఎల ఎన్నికల హామీనిచ్చామని, కానీ ఆ తర్వాత జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోనికి రాలేదని అన్నారు. అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో తాము చిత్తశుద్ధిగా పనిచేస్తున్నామని వివరించారు. మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ బిసి రిజర్వేషన్ల విషయంలో తాము వెనకడుగు వేయలేదని, రిజర్వేషన్లను 9వ షెడ్యూల్‌లో చేర్చాల్సి ఉన్నందున ,కేంద్రంలోని బిజెపి ప్రభుత్వంపైన ఒత్తిడి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నామని వివరించారు. రానున్న ఎన్నికల్లో తాము కేంద్రంలో అధికారంలోనికి వస్తామని, రిజర్వేషన్లను అమలు చేస్తామని, అప్పటి వరకు తమ పోరాటం, ప్రయత్నాలు ఆగబోవని స్పష్టం చేశారు.

**కెసిఆర్ అన్నీ చేశారని చెప్పడంలేదు..ఒక ప్రయత్నం చేశారు..: తలసాని**

ఎస్‌సి,ఎస్‌టి,బిసి,మైనార్టీలు కలిసి బయటికి వస్తే మీరే(అగ్రకులాలు)తమను రిజర్వేషన్లు అడిగే పరిస్థితి వస్తుందని బిఆర్‌ఎస్‌ఎల్‌పి ఉప నాయకుడు తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వంలో కెసిఆర్ అన్నీ చేశారని తాము చెప్పడం లేదనికానీ ఒక ప్రయత్నం మాత్రం చేశారని, అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని వివరించారు. కెసిఆర్ ప్రభుత్వం 9 ఏళ్లలో రూ 45 వేల కోట్లు ఖర్చు చేశారని, రాజ్యసభ కు ఇద్దరు బిసి బిడ్డలను ఎంపిక చేశారని వివరించారు. బిసిలను నమ్మించి మోసం చేయవద్దని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

## ఖాళీల ఆధారంగానే పోలీసుల పదోన్నతులు
### మంత్రి పొన్నం ప్రభాకర్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో పోలీసుల పదోన్నతులు, సంక్షేమంపై ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శాసనసభలో గురువారం ప్రశ్నోత్తరాల సమయంలో కాంగ్రెస్ సభ్యులు మందుల స్వామేల్, సిపిఐ శాసనసభ పక్ష నాయకులు కూనంనేని సాంబశివ రావు, బిఆర్‌ఎస్ సభ్యులు సబితా ఇంద్రారెడ్డి, పల్లా రాజేశ్వర్ రెడ్డి అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు. శాఖలో ఏర్పడే ఖాళీలను బట్టి అర్హులైన కానిస్టేబుళ్లకు హెడ్ కానిస్టేబుళ్లుగా ఎప్పటికప్పుడు పదోన్నతులు కల్పిస్తున్నామని మంత్రి తెలిపారు. పదోన్నతులు పొందని వారి కోసం ప్రత్యేక స్కీమ్‌లను అమలు చేస్తున్నట్లు చెప్పారు. 6/12/18/24 ఏళ్ల సర్వీసు నిర్ణీత కాలపరిమితిలో పదోన్నతులు రాని వారికి ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్ వర్తిస్తుందన్నారు. దీని ద్వారా ఎస్‌జిపి, ఎస్‌పిపి 1 ఏ, 1 బి, ఎస్‌పిపి 2 స్కేల్‌ల మంజూరుకు కానిస్టేబుళ్లు అర్హులవుతారని ఆయన వివరించారు. జోనల్ వారీగా ఉన్న ఖాళీల ఆధారంగా ఈ ప్రక్రియ పారదర్శకంగా సాగుతోందని చెప్పారు. శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులు చేస్తున్న కృషిని మంత్రి ఈ సందర్భంగా అభినందించారు. వారి సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను తెలిపారు. విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు ప్రాణాలు కోల్పోతే పోలీసు ఉద్యోగుల కుటుంబాలకు కోటి రూపాయల పరిహారం అందిస్తున్నామని చెప్పారు. నిజామాబాద్ దాడిలో గాయపడిన కానిస్టేబుల్ కుటుంబానికి ఇప్పటికే నష్టపరిహారం అందించడంతో పాటు, ఆ కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించామని మంత్రి గుర్తుచేశారు. కొత్త హెల్త్ స్కీమ్ ద్వారా పోలీసులకు పటిష్టమైన వైద్య సదుపాయాలు అందజేస్తున్నట్లు తెలిపారు. పోలీసుల పని ఒత్తిడిని తగ్గించేందుకు, విభజన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కసరత్తు చేస్తోందని మంత్రి తెలిపారు. పోలీసులకు షిఫ్టుల వారీగా పని విభజన చేసే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోందని, దీనిపై ఒక కమిటీ పని చేస్తోందన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య పెండింగ్‌లో ఉన్న పోలీసుల విభజన అంశంపై అధికారుల కమిటీ చర్చిస్తోందని చెప్పారు. పోలీసులకు అందాల్సిన ఇన్సెంటివ్‌లను ఎప్పటికప్పుడు విడుదల చేస్తున్నామన్నారు. రాష్ట్రం ప్రశాంతంగా ఉండటానికి అహర్నిశలు శ్రమిస్తున్న పోలీస్ యంత్రాంగానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని మంత్రి పొన్నం ప్రభాకర్ పునరుద్ఘాటించారు.

**పోలీసులకు షిఫ్ట్ విధానం తీసుకరావాలి : కూనంనేని**

అంతకు ముందు కూనంనేని సాంబశివ రావు మాట్లాడుతూ పోలీసు శాఖలో విధుల నిర్వహణలో షిఫ్ట్ విధానం తీసుకరావాలని సూచించారు. సరెండర్ లీవులు, టిఎ, డిఏలకు సంబంధించిన డబ్బులు సకాంలో ఇవ్వడం లేదన్నారు. కొత్తగూడెంలో ఇప్పటి వరకు ఇవ్వలేదని కూనంనేని సభ దృష్టికి తీసుకొచ్చారు. ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్‌లో గంటల తరబడి నిలబడాల్సి వస్తుందని, వారికి తమిళనాడు, మహారాష్ట్రలలో ఉన్న విధానాలను అధ్యాయనం చేయాలని ప్రభుత్వానికి ఆయన సూచించారు. పోలీస్ శాఖలో ఉన్న అర్డర్‌లీ వ్యవస్థను తొలగించాలన్నారు. హోంగార్డుల సర్వీసులను రెగ్యులరైజ్ చేయాలని కోరారు. అగ్నిమాపక శాఖలో జి.ఓ 86తో సీనియరిటీ కోల్పోతున్నారని, దీనిని సమీక్షించి, వారికి న్యాయం చేయాలని కోరారు.

### వెలుగుమట్లలో నిర్మాణాల కూల్చివేతలపై స్టేకు నిరాకరణ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఖమ్మం జిల్లా వెలుగుమట్ల గ్రామంలోని భూదాన్ భూముల్లో నిర్మించిన ఇళ్ల కూల్చివేతల వ్యవహారంలో స్టే ఇచ్చేందుకు హైకోర్టు నిరాకరించింది. అర్హులైన వారికి ఇళ్ల పట్టాలు, ఇందిరమ్మ గృహాలను ప్రభుత్వం మంజూరు చేస్తున్న నేపథ్యంలో స్టే వంటి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేస్తే వారికి నష్టం కలిగే అవకాశం ఉంటుందని చెప్పింది. టి. వెంకటనరసమ్మ సహా పాతిక మంది బాధితులు దాఖలు చేసిన పిటిషన్లను జస్టిస్ బి. విజయ్‌సేన్‌రెడ్డి గురువారం విచారించారు. నోటీసు ఇవ్వకుండా ఏకపక్షంగా అన్యాయంగా కూల్చివేత చర్యలు తీసుకున్నారని పిటిషనర్ లాయర్ చెప్పారు. పిటిషనర్లలో ఆరుగురికి ఇప్పటికే పట్టాలు, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని ప్రభుత్వం చెప్పింది. సొంత ఇళ్లు ఉన్నందున ఐదుగురి దరఖాస్తులను తిరస్కరించినట్లు చెప్పింది. ఇతరుల విషయాల పరిశీలన ఉందని తెలిపింది. కూల్చివేతలకు గురైన నిర్మాణాల్లో పిటిషనర్ల ఇళ్లు లేవని వివరించింది. కూల్చివేతల అనంతరం 311 మందికి పట్టాలు, 101 మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసినట్లు తెలిపింది. వాదనల తర్వాత స్టే ఇవ్వడాన్ని నిరాకరించిన హైకోర్టు విచారణను ఏప్రిల్ 15కు వాయిదా వేసింది.

### న్యాయవాదుల రక్షణ బిల్లు నమ్మకాన్ని పెంచుతుంది

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన తెలంగాణ న్యాయవాదుల సంక్షేమ, రక్షణ బిల్లు న్యాయవ్యవస్థపై ప్రజల్లో విశ్వాసాన్ని బలోపేతం చేస్తుందని బార్ కౌన్సిల్ ఛైర్మన్ ఎ. నరసింహా రెడ్డి, మెంబర్ కొల్లి సత్యనారాయణ చెప్పారు. ప్రభుత్వ ముసాయిదా బిల్లును స్వాగతిస్తున్నట్లు చెప్పారు. గురువారం వారు మీడియా సమావేశంలో మాట్లాడుతూ లాయర్లు, వారి కుటుంబాలకు భద్రత కల్పించే దిశగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు చెప్పారు. న్యాయవాదులపై ఫిర్యాదులు వచ్చిన వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేయకుండా, ముందుగా జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ముందు ఉంచి ప్రాథమిక ఆధారాలపై నిర్ణయం తీసుకోవాలని బిల్లులో ప్రతిపాదన చేసినట్లు వివరించారు. ఈ చట్టాన్ని అడ్వొకేట్లు ఎవరైనా దుర్వినియోగం చేసే.. వారిపై చర్యలు తీసుకునేందుకు కూడా చట్టంలో ప్రతిపాదించారని తెలిపారు. ప్రస్తుతం అమల్లో ఉన్న న్యాయవాదుల సంక్షేమ నిధి ట్రస్ట్‌ను చట్టంలో విలీనం చేయకుండా బార్ కౌన్సిల్ పరిధిలోనే కొనసాగేలా చేయాలని కోరారు.

## మిర్యాలగూడలో బియ్యం వ్యాపారి నివాసంలో తనిఖీలు




**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పట్టణానికి చెందిన ప్రముఖ బియ్యం వ్యాపారి చీదళ్ల గోపికి చెందిన నివాసం, కార్యాలయాల్లో గురువారం ఢిల్లీ హైకోర్టు అడ్వకేట్ జనరల్ ప్రతినిధులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. పలు రకాల బియ్యం బ్రాండ్లను నకిలీవి ముద్రించి ఇలాంటి అనుమతులు లేకుండా దేశంలోని వివిధ రాష్ట్రాలకు సరఫరా చేస్తున్నట్లుగా ఆయనపై ఆరోపణలు ఉన్నాయి. కర్ణాటక, తమిళనాడు, తెలంగాణాకు చెందిన పలువురు బ్రాండెడ్ వ్యాపారులు ఢిల్లీ హైకోర్టులో ఫిర్యాదులు చేశారు. దీనిపై విచారణ ప్రారంభించిన హైకోర్టు ప్రత్యేకంగా అడ్వకేట్ జనరల్‌లను నియమించి తనిఖీలకు ఆదేశించారు. ఢిల్లీ హైకోర్టు నుంచి వచ్చిన బృందం ప్రతినిధులు గురువారం వన్ టౌన్ సీఐ నాగభూషణ్‌రావును కలిసి పోలీసులు ఎస్కార్ట్ సహాయంతో తనిఖీలు చేపట్టారు. పట్టణంలోని బ్లావెల్ ప్యాలెస్‌తో పాటు రెడ్డికాలనీలో ఆయన నివాసం, ఆయన వ్యాపార సంస్థల్లో తనిఖీలు చేశారు. పట్టణంలో ఎఫ్‌సీఐ సమీపంలో బస్తాలు ముద్రిస్తున్న పరిశ్రమలో విస్తృతంగా తనిఖీలు చేసి పలు బ్రాండ్లకు సంబంధించిన బస్తాలను వారు స్వాదీనం చేసుకున్నారు. పిడుగురాళ్లలోని మరో బస్తాల ముద్రించే కేంద్రంలో ప్రధానంగా మిర్యాలగూడకు చెందిన బ్రాండ్లను ముద్రిస్తున్నట్లు వారు గుర్తించారు. బియ్యం వ్యాపారిపై తనిఖీల విషయం పట్టణంలో బియ్యం వ్యాపారుల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. అడ్వకేట్ జనరల్ తనిఖీ సందర్భంగా సందర్భంగా వన్ టౌన్ ఎస్ఐ శ్రీనివాస్‌నాయక్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.



### సూర్యాపేట బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా
## నూకల సుదర్శన్‌రెడ్డి గెలుపు



**ప్రజాపక్షం / సూర్యాపేట :** అత్యంత ప్రతిష్ఠాత్మకంగా జరిగిన ఎన్నికల్లో సూర్యాపేట బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షులుగా నూకల సుదర్శన్ రెడ్డి గెలుపొందారు. గురువారం సూర్యాపేట జిల్లా కోర్టుల సముదాయంలో జరిగిన ఈ ఎన్నికల్లో నూకల సుదర్శన్‌రెడ్డి బాణాల విజయ్‌కుమార్‌పై 35 ఓట్ల తేడాతో విజయం సాధించారు. బాణాల విజయ్‌కుమార్‌కు 82 ఓట్లు రాగా, నూకల సుదర్శన్ రెడ్డికి 117 ఓట్లు పోల్ అయ్యాయి. ఉపాధ్యక్షులుగా పోలెబోయిన నర్సయ్య యాదవ్ (106 ఓట్లు) సాధించారు. జనరల్ సెక్రటరీగా తల్లమల్ల హస్సేన్, జాయింట్ సెక్రటరీగా పసల బాలరాజు (118), స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీగా పత్తిపాక రాధాకృష్ణ గెలుపొందారు. 30 ఇ యర్స్ ఈసీ మెంబర్‌గా వసంత సత్యనారాయణ పిళ్ళై యాదవ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కాగా, 20 ఇయర్స్ ఈసీ మెంబర్‌గా బొమ్మగాని శ్రీనివాస్ (134), 2 ఇయర్స్ ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా బొజ్జ అనిల్ (95), మందుల శ్రీనివాస్ (92), మీసాల శ్రీనివాస్ 126 ఓట్లతో విజయాన్ని దక్కించుకున్నారు.



**'20 ఇయర్స్ ఈసీ' మెంబర్‌గా... బొమ్మగాని శ్రీనివాస్‌కు అత్యధిక ఓట్లు**

ఈ 20 సంవత్సరాల ఈసీ మెంబర్ పదవికి అభ్యర్థులు హోరాహోరీగా పోటీపడగా బొమ్మగాని శ్రీనివాస్‌కు అత్యధికంగా134 ఓట్లు పోలయ్యాయి.ఈ ఎన్నిక ఫలితం ఆద్యంతం ఉత్కంఠభరితంగా చోటు చేసుకుంది. ఈ సందర్భంగా విజేతలను సూర్యాపేట మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్ ఎం.డి.షఫీఉల్లా, న్యాయవాదులు శ్రీనివాస్‌రావు, బత్తిని వెంకటేశ్వర్లు గౌడ్, సినేపల్లి సోమేశ్వర్, ఫరీదుద్దీన్, కోణం రఘురామయ్య, గుంటూరు మధు, కొక రంజిత్, దయాకర్‌రావు అభినందించారు.

## గన్‌పార్కు వద్ద బిఆర్‌ఎస్ ఎమ్మెల్యేల నిరసన

**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిసిలను వంచించిన కాంగ్రెస్ పార్టీ గద్దె దిగాలని బిఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు గన్‌పార్కు వద్ద నిరసన వ్యక్తం చేశారు. బిసి సబ్ ప్లాన్ అమలు ఏమైంది అని ప్రశ్నిస్తూ, ప్లకార్డులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ వెనుకబడిన తరగతుల సంక్షేమానికి ప్రతి వార్షిక బడ్జెట్‌లో రూ. 20 వేల కోట్లు ఖర్చు పెడతామని చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కామారెడ్డి డిక్లరేషన్ పేరుతో బిసిలను మోసం చేయడంతో పాటు కర్ణాటక డిప్యూటీ సిఎం సిద్ధరామయ్యతో అబద్ధాలు చెప్పించి ఓట్లు దండుకున్నారని విమర్శించారు.

# విరాళాల సేకరణలో బిజెపి టాప్

- ఇతర జాతీయ పార్టీలకంటే పది రెట్లు ఎక్కువ
- గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 2024-25లో 161 శాతం అధికం : ఎడిఆర్ వెల్లడి

**న్యూఢిల్లీ :** జాతీయ పార్టీలకు విరాళాలు భారీగా పెరుగుతున్నాయి. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 2024–25లో జాతీయ పార్టీలకు అందిన విరాళాలు 161 శాతం భారీగా పెరిగాయి. ఇందులో అధికార బిజెపి వాటానే అత్యధికంగా ఉంది. ఇతర జాతీయ పార్టీలన్నింటికీ కలిపి వచ్చిన మొత్తం కంటే ఇది పది రెట్లు అధికం.ఈ మేరకు గురువారం అసోసియేషన్ ఫర్ డెమాక్రటిక్ రిఫార్మ్స్ (ఎడిఆర్) నివేదిక విడుదల చేసింది. 2025 ఆర్థిక సంవత్సరంలో జాతీయ పార్టీలు ప్రకటించిన రూ. 20,000 కంటే ఎక్కువ విలువైన మొత్తం విరాళాలు 11,343 కాగా, వాటి విలువ రూ. 6,648.563 కోట్లుగా నమోదైంది. ఇందులో కేవలం బిజెపి ఒక్కటే 5,522 విరాళాల ద్వారా రూ. 6,074.015 కోట్లు పొందింది. ఆ తర్వాతి స్థానంలో కాంగ్రెస్ పార్టీ 2,501 విరాళాల ద్వారా రూ. 517.394 కోట్లు పొందింది. అదే కాలానికి కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్), కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియామార్క్సిస్ట్ (సిపిఐ(ఎం) , నేషనల్ పీపుల్స్ పార్టీ (ఎన్‌పిఇపి)లకు కలిపి వచ్చిన మొత్తం విరాళాల కంటే, బిజెపికి వచ్చిన విరాళాలు పది రెట్లు ఎక్కువగా ఉన్నాయని ఈ నివేదిక వెల్లడించింది. మరోవైపు, బహుజన్ సమాజ్ పార్టీ (బిఎస్‌పి) మాత్రం గత 19 ఏళ్లుగా అనుసరిస్తున్న విధానాన్ని కొనసాగిస్తూనే, రూ. 20,000 కంటే ఎక్కువ విలువైన విరాళాలు ఏవీ తమకు అందలేదని ప్రకటించింది. మొత్తంగా చూస్తే, 2023–24తో పోలిస్తే 2024–25లో జాతీయ పార్టీలకు అందిన విరాళాలు రూ. 4,104.285 కోట్లు పెరిగాయి. బిజెపి వసూళ్లు మాత్రమే గత ఆర్థిక సంవత్సరంలోని రూ. 2,243.947 కోట్ల నుండి 171 శాతం మేర భారీగా పెరిగాయి. కాంగ్రెస్ పార్టీకి అందిన విరాళాలు 84 శాతం పెరిగి, 2023–24లో ఉన్న రూ. 281.48 కోట్ల నుండి 2024–25లో రూ. 517.394 కోట్లకు చేరుకున్నాయి. ఇతర పార్టీల విషయానికి వస్తే, ఆప్ రూ. 27.044 కోట్లు (ఇది 244 శాతం పెరుగుదల) పొందిందని, అలాగే ఎన్‌పిఇపి రూ. 1.943 కోట్లు (ఇది 1,313 శాతం పెరుగుదల) పొందిందని ఈ నివేదిక పేర్కొంది. రాజకీయ నిధుల సమీకరణలో కార్పొరేట్ విరాళాలే ఆధిపత్యం వహించాయి. మొత్తం 3,244 విరాళాల ద్వారా రూ. 6,128.787 కోట్లు సమకూరగా, ఇది మొత్తం విరాళాలలో 92.18 శాతంగా నమోదైంది. వ్యక్తిగత దాతలు 7,900 విరాళాల ద్వారా రూ. 505.66 కోట్లు అందించారు. ఇది మొత్తం నిధులలో 7.61 శాతంగా ఉంది. బిజెపికి 2,794 కార్పొరేట్ విరాళాల ద్వారా రూ. 5,717.167 కోట్లు లభించాయి. ఇది ఇతర జాతీయ పార్టీలన్నింటికీ కలిపి వచ్చిన మొత్తం విరాళాల (రూ. 411.62 కోట్లు) కంటే 13 రెట్లు అధికం. అలాగే, 2,627 మంది వ్యక్తిగత దాతల నుండి ఆ పార్టీకి రూ. 345.94 కోట్లు సమకూరాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో కాంగ్రెస్ పార్టీకి 112 కార్పొరేట్ విరాళాల ద్వారా రూ. 383.86 కోట్లు, 2,357 మంది వ్యక్తిగత దాతల నుండి రూ. 132.39




కోట్లు లభించాయి. ప్రముఖ దాతల జాబితాలో, 'ప్రూడెంట్ ఎలక్టోరల్ ట్రస్ట్' బిజెపి, కాంగ్రెస్, ఆప్‌లకు కలిపి మొత్తం రూ. 2,413.465 కోట్లు విరాళంగా ఇచ్చింది. ఇందులో రూ. 2,180.7119 కోట్లు బిజెపికి (ఆ పార్టీకి వచ్చిన మొత్తం నిధులలో 35.90 శాతం), రూ. 216.335 కోట్లు కాంగ్రెస్‌కు (ఆ పార్టీకి వచ్చిన మొత్తం నిధులలో 41.81 శాతం), రూ. 16.4178 కోట్లు ఆప్‌కు (ఆ పార్టీకి వచ్చిన మొత్తం నిధులలో 43.08 శాతం) అందాయి. బిజెపి, కాంగ్రెస్ పార్టీలకు'ప్రోగ్రెసివ్ ఎలక్టోరల్ ట్రస్ట్' రెండు విరాళాల ద్వారా రూ. 834.97 కోట్లు, 'ఎబి జనరల్ ఎలక్టోరల్ ట్రస్ట్' 16 విరాళాల ద్వారా రూ. 621 కోట్లు, 'న్యూ డెమోక్రటిక్ ఎలక్టోరల్ ట్రస్ట్' ఏడు విరాళాల ద్వారా రూ. 155 కోట్లు విరాళంగా అందించాయి. 2024–25 ఆర్థిక సంవత్సరంలో 'సీరం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ మూడు విరాళాల ద్వారా రూ. 100 కోట్లు, 'రుంగ్తా సన్స్ ప్రైవేట్ లిమిటెడ్ నాలుగు విరాళాల ద్వారా రూ. 95 కోట్లు బిజెపికి విరాళంగా ఇచ్చాయి.

# దేశంలో 60 రోజులకు సరిపడా చమురు నిల్వలు

- ఆందోళన అక్కర్లేదన్న కేంద్రం



**న్యూఢిల్లీ :** దేశంలో చమురు కొరత లేదని కేంద్రం ప్రకటించింది. 60 రోజులకు సరిపడా చమురు నిల్వలు ఉన్నాయని, ప్రజల్లో ఆందోళన అవసరం లేదని కేంద్రం తెలిపింది. పెట్రోల్, డీజిల్, ఎల్‌పిజికి ఎలాంటి కొరతా లేదని కేంద్ర పెట్రోలియం, చమురు మంత్రిత్వశాఖ గురువారం వెల్లడించింది. చమురు సరఫరా లేదంటూ జరుగుతున్నది ఉద్దేశపూర్వక ప్రచారమే అని, ఈ ప్రచారం వల్లే వినియోగదారులు ఆందోళనతో ఎక్కువ కొనుగోళ్లకు పాల్పడుతున్నారని తేల్చింది. దేశంలోని అన్ని పెట్రోల్ పంపుల్లో తగినంత చమురు ఉందని, సాధారణంగానే సరఫరా కొనసాగుతోందని కేంద్రం తెలిపింది. ఎక్కడా, ఎలాంటి ఇబ్బంది లేదని, ధరలు కూడా ఎప్పట్లాగే ఉన్నాయని పేర్కొంది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా వినియోగదారులు పెట్రోల్ బంకుల వద్ద పెట్రోల్, డీజిల్ కోసం క్యూ కడుతున్న సంగతి తెలిసిందే. పెట్రోల్ సరఫరా లేదని జరుగుతున్న ప్రచారంతో జనాలు బంకుల వద్ద బారులు తీరుతున్నారు. ఈ నేపథ్యంలోనే దేశంలో ఎలాంటి చమురు కొరతా లేదని కేంద్రం తెలిపింది. పెట్రో ఉత్పత్తుల్లో ఇండియా ఐదో స్థానంలో ఉంది. అలాగే, ఆయిల్ రిఫైనరీలో ఇండియా నాలుగో స్థానంలో ఉంది. దేశంలో చమురు తగినంత ఉందని, అలాగే పెట్రో ఉత్పత్తుల్ని 150 దేశాలకు ఎగుమతి చేస్తున్నామని కూడా కేంద్రం తెలిపింది. దేశంలోని ప్రతి రిఫైనరి 100 శాతం పని చేస్తోందని, ఇండియాలోని కంపెనీలు 60 రోజులకు సరిపడా క్రూడాయిల్ నిల్వలతో ఉన్నాయని కేంద్రం వెల్లడించింది. సరఫరాలో ఎలాంటి లోటూ లేదని, వ్యూహాత్మక నిల్వలతో కలిపి 74 రోజులకు సరిపడా చమురు నిల్వలున్నట్లు ప్రకటించింది. 60 రోజులకు సరిపడా నిల్వలుండగా, యుద్ధం ప్రారంభమై 27 రోజులు మాత్రమే అవుతుందని తెలిపింది. ప్రపంచంలో ఎలాంటి పరిణామం ఎదురైనా ప్రతి పౌరుడికి రెండు నెలలకు సరిపడా చమురు దేశంలో అందుబాటులో ఉంటుందని చెప్పింది. దేశీయంగా ఎల్‌పిజి నిల్వలు కూడా తగినంత ఉన్నాయని, ఇక్కడి కంపెనీల్లో ఉత్పత్తి కూడా పెంచామని పేర్కొంది. ఇప్పటికే అనేక దేశాల నుంచి కార్గోల ద్వారా చమురు దేశానికి రానున్నట్లు తెలిపింది.

## చికిత్సకు స్పందిస్తున్న సోనియాగాంధీ



**న్యూఢిల్లీ :** సీనియర్ కాంగ్రెస్ నాయకురాలు సోనియా గాంధీ శరీరమంతటా వ్యాపించిన ఇన్ఫెక్షన్‌కు చికిత్స పొందుతున్నారని, ఆమె చికిత్స బాగానే స్పందిస్తున్నారని సర్ గంగా రామ్ ఆసుపత్రి అధికారులు గురువారం తెలిపారు. ఈనెల 24 రాత్రి ఆసుపత్రిలో చేరిన సోనియాగాంధీకి శరీరమంతటా వ్యాపించిన ఇన్ఫెక్షన్‌కు యాంటీబయాటిక్స్‌తో చికిత్స అందిస్తున్నారని, ఆమె చికిత్సకు బాగా స్పందిస్తున్నారని చైర్మన్ డాక్టర్ అజయ్ స్వరూప్ తెలిపారు. ఆమె పరిస్థితిని సీనియర్ వైద్యుల బృందం నిశితంగా పర్యవేక్షిస్తోందని ఆయన చెప్పారు. ముందస్తు జాగ్రత్త చర్యగా మరో రెండు రోజులు ఆసుపత్రి పర్యవేక్షణలో ఉండే అవకాశం ఉందని వర్గాలు తెలిపాయి. ఆమె పరిస్థితి నిలకడగా ఉందని, తీవ్రత ఏమీ లేదని వారు తెలిపారు. 79 ఏళ్ల ఈ నాయకురాలు జ్వరం రావడంతో మంగళవారం రాత్రి సుమారు 10.22 గంటలకు ఆసుపత్రిలో చేరారు. వాతావరణ మార్పుల కారణంగానే ఆమె అనారోగ్యానికి గురయ్యారని మొదట వర్గాలు తెలిపాయి.

## రూ. 408 కోట్ల విలువైన మద్యం, నగదు స్వాధీనం




**న్యూఢిల్లీ:** నాలుగు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతంలోని ఓటర్లను ప్రభావితం చేసే ఉద్దేశంతో పంపిణీకి సిద్ధం చేసిన రూ. 408 కోట్లకు పైగా విలువైన ప్రలోభాలను గత నెల రోజుల్లో స్వాధీనం చేసుకున్నట్లు ఎన్నికల సంఘం గురువారం తెలిపింది. శాసనసభ ఎన్నికలు, ఉప ఎన్నికల షెడ్యూల్‌ను ఈనెల 15న ప్రకటించినప్పటికీ, 'ఎలక్ట్రానిక్ సీజర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్' (ఇఎస్ఎంఎస్)ను మాత్రం ఫిబ్రవరి 26న నుంచే అందుబాటులోకి తెచ్చినట్లు పేర్కొంది. ఈ వ్యవస్థ అందుబాటులోకి వచ్చినప్పటి నుండి, రూ. 17.44 కోట్ల నగదు, రూ. 37.68 కోట్ల విలువైన మద్యం (16.3 లక్షల లీటర్లు), రూ. 167.38 కోట్ల విలువైన మాదక ద్రవ్యాలు, రూ. 23 కోట్ల విలువైన విలువైన లోహాలు, రూ. 163.30 కోట్లకు పైగా విలువైన ఇతర ఉచిత వస్తువులతో కలిపి, మొత్తం రూ. 408.82 కోట్ల విలువైన అక్రమ ప్రలోభాలను వివిధ సంస్థలు స్వాధీనం చేసుకున్నట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది. అంతేకాకుండా, ఈనెల 15 నుండి 25 మధ్య కాలంలో, 'సి విజిల్' అప్లికేషన్ ద్వారా 70,944 ఫిర్యాదులు నమోదయ్యాయి. వీటిలో 70,831 ఫిర్యాదులను పరిష్కరించినట్లు, అందులోనూ 67,899 ఫిర్యాదులను— అంటే 95.8 శాతాన్ని కేవలం 100 నిమిషాలలోపే పరిష్కరించినట్లు ఎన్నికల సంఘం తెలిపింది. ఎన్నికల సమయంలో అమల్లో ఉండే ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలపై పౌరులు సులభంగా ఫిర్యాదు చేసేందుకు వీలుగా, ఎన్నికల సంఘం రూపొందించిన మొబైల్ అప్లికేషనే ఈ 'సివిజిల్'. వచ్చే నెలలో పశ్చిమ బెంగాల్, అసోం, తమిళనాడు, పుదుచ్చేరి, కేరళ రాష్ట్రాల్లో శాసనసభ ఎన్నికలు జరగనున్నాయి.

# రెండు రోజుల్లో ఆరుగురు మావోయిస్టులు లొంగుబాటు

**కాంకర్ :** ఛత్తీస్‌గఢ్‌లో మావలోయిస్టులు లొంగుబాటు పర్వం కొనసాగుతూనే ఉంది. తాజాగా కాంకర్ జిల్లాలో గత రెండు రోజుల్లో ఆరుగురు నక్సలైట్లు లొంగిపోయారని ఒక సీనియర్ అధికారి గురువారం తెలిపారు. రాజ్‌నందగావ్–కాంకర్ సరిహద్దు డివిజన్‌కు చెందిన ఐదుగురు మావోయిస్టు కార్యకర్తలుష మిలిటరీ కంపెనీ నంబర్ 5కి చెందిన ఒకరు గత రెండు రోజుల్లో పోలీసుల ఎదుట లొంగిపోయి, జనజీవన స్రవంతిలో కలిసేందుకు నిర్ణయించుకున్నారని కాంకర్ జిల్లా పోలీసు సూపరింటెండెంట్ నిఖిల్ రాఖేచా తెలిపారు. లొంగిపోయిన వారిలో ఏరియా కమిటీ సభ్యులు (ఎసిఎం) మంగేష్ పొడియామి, గణేష్ వి కె, మంగటి జుర్రి, హిడ్మే మార్కం అలియాస్ సునీత, రాజే, పిఎల్‌జిఎ మిలిటరీ కంపెనీ నంబర్ 5కి చెందిన ప్లాటూన్ పార్టీ కమిటీ సభ్యురాలు (పిపిసిఎం) స్వరూప ఉసెండి ఉన్నారని ఆయన పేర్కొన్నారు. వారు ఒక సెల్ఫ్‌లోడింగ్ రైఫిల్ (ఎస్ఎల్ఆర్), రెండు .303 రైఫిల్స్‌తో సహా మూడు ఆయుధాలను పోలీసులకు అప్పగించారని ఆయన తెలిపారు. వారు అందించిన సమాచారం ఆధారంగా, ఆ ప్రాంతంలో ఇంకా క్రియాశీలకంగా ఉన్న ఇతర కార్యకర్తలను సంప్రదించి, హింసను విడనాడి జనజీవన స్రవంతిలో కలిసేలా ప్రోత్సహించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన చెప్పారు. సమాజంలో తిరిగి కలిసిపోవడం, ఆయుధాలను అప్పగించడంతో కూడిన అధికారిక పునరావాస ప్రక్రియ తర్వాతి దశలో జరుగుతుందని ఆయన జోడించారు. బస్తర్ రేంజ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సుందర్‌రాజ్ పట్టిలింగం, మిగిలిన మావోయిస్టు కార్యకర్తలు హింసను విడనాడి, శాంతియుతమైన, గౌరవప్రదమైన జీవితాన్ని ఎంచుకోవాలని తన విజ్ఞప్తిని పునరుద్ఘాటించారు. లొంగిపోయిన వారికి ప్రభుత్వ పునరావాస విధానం కింద లభించే అన్ని ప్రయోజనాలు కల్పిస్తామని ఆయన హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ లొంగుబాటు, పునరావాస విధానం కింద గత 26 నెలల్లో 2,700 మందికి పైగా మావోయిస్టు కార్యకర్తలు జనజీవన స్రవంతిలో కలిశారని ఆయన తెలిపారు. ఈనెల 24న, బస్తర్ ప్రాంతంలో సీనియర్ మావోయిస్టు కమాండర్ పాపా రావు తన 17 మంది అనుచరులతో కలిసి లొంగిపోవడం, వామపక్ష తీవ్రవాదంపై రాష్ట్రం సాగిస్తున్న పోరాటంలో ఒక కీలక పరిణామంగా నిలిచింది. ఆయన లొంగుబాటు అనంతరం, హోంశాఖ బాధ్యతలు కూడా నిర్వహిస్తున్న ఉప ముఖ్యమంత్రి విజయ్ శర్మ మాట్లాడుతూ, పాపా రావు లొంగిపోయిన తర్వాత రాష్ట్రంలో ఏ ఒక్క సీనియర్ స్థాయి నక్సల్ నాయకుడు కూడా క్రియాశీలకంగా మిగిలి ఉండరని పేర్కొన్నారు. ఈనెల 31 నాటికి ఛత్తీస్‌గఢ్ సాయుధ నక్సలిజం రహిత రాష్ట్రంగా మారుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

# గత అనుభవాల నుంచి గుణపాఠం నేర్చుకోని రాహుల్

లోక్‌సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ పార్టీ బిజెపికి 'బి-టీమ్' లా వ్యవహరిస్తున్నాయి : పినరయ్ విజయన్




**కొచ్చి :** జాతీయ స్థాయి రాజకీయ నాయకుడైనప్పటికీ, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ గత అనుభవాల నుండి గుణపాఠాలు నేర్చుకోవడం లేదని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ తీవ్రంగా విమర్శించారు. రాహుల్, కాంగ్రెస్ పార్టీ బిజెపికి 'బి టీమ్' లా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. విజయన్‌పై ఉన్న వివిధ అవినీతి కేసులలో కేంద్ర దర్యాప్తు సంస్థలు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడమే ఎల్‌డిఎఫ్, బిజెపి మధ్య ఉన్న కుమ్మక్కుకు నిదర్శనమని రాహుల్ వ్యాఖ్యానించిన నేపథ్యంలో విజయన్ స్పందించారు. కొచ్చిలోని కొత్తమంగళంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ నేత చేసిన ఆరోపణలకు సంబంధించి విలేకరులు అడిగిన ప్రశ్నలకు సమాధానమిస్తూ రాహుల్ జాతీయ నాయకుడే అయినప్పటికీ, ఒక ప్రాంతీయ నాయకుడికి ఉండే అవగాహన ఆయనకు లేకపోవడమే వాస్తవమన్నారు. ఆయన ఏ విషయాన్నైనా స్పష్టంగా అర్థం చేసుకోవడానికి ప్రయత్నించరని, అంతేకాకుండా, ఆయన అనుభవాల నుండి ఏమీ నేర్చుకోరన్నారు. 'ఇవి ఒక రాజకీయ నాయకుడికి తగిన లక్షణాలు కావు. కాంగ్రెస్ వంటి పార్టీలో ఒక కీలక వ్యక్తిలో ఇంతటి స్థాయి పతనం ఎలా సంభవిస్తుంది?, ఇదంతా భారతదేశంలోని రాహుల్ గాంధీ, కాంగ్రెస్, బిజెపికి బి టీమ్ అని చూపిస్తోందని పేర్కొన్నారు. రాహుల్ తీసుకుంటున్న వైఖరి అందుకు అనుగుణంగానే ఉందని ముఖ్యమంత్రి అన్నారు. బుధవారం, కాంగ్రెస్ నేతృత్వంలోని యుడిఎఫ్ ఎన్నికల కార్యక్రమంలో రాహుల్ మాట్లాడుతూ, బిజెపికి వ్యతిరేకంగా పోరాడినందుకు దేశవ్యాప్తంగా ప్రతిపక్ష నాయకులపై దాడులు జరుగుతున్నాయని, వారిపై కేసులు నమోదు చేస్తున్నారని అన్నారు. అయితే, విజయన్‌పై ఉన్న అవినీతి కేసులు ఎక్కడికీ వెళ్లడం లేదని, ఇది ఎల్‌డిఎఫ్, బిజెపిల మధ్య కుమ్మక్కుకు సూచన అని అన్నారు. కాంగ్రెస్ నాయకుడిపై విజయన్ ఎదురుదాడి చేస్తూ, ఢిల్లీలో మద్యం విధాన అవినీతి కేసులో ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) నాయకుడు అరవింద్ కేజ్రీవాల్‌ను అరెస్టు చేయాలని రాహుల్, కాంగ్రెస్ కోరాయని అన్నారు. కానీ, కేజ్రీవాల్ తర్వాత నిర్దోషిగా విడుదలయ్యారని, ఇది రాహుల్‌తో సహా బిజెపి, కాంగ్రెస్‌కు ముఖంపై కొట్టిన దెబ్బ అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఢిల్లీలో బిజెపిని ఓడించడానికి ఆప్‌తో చేతులు కలపడానికి బదులుగా, కాంగ్రెస్ కేజ్రీవాల్ పార్టీని వ్యతిరేకించిందని, ఇది ఆయనను తీవ్ర ఇబ్బందులకు గురిచేసిందని కూడా ఆయన ఎత్తి చూపారు. అదేవిధంగా, హర్యానా, బిహార్‌లలో కూడా, బిజెపికి వ్యతిరేకంగా పొత్తును ముందుకు తీసుకెళ్లడంలో కాంగ్రెస్ విఫలమవడం ఆ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలలో కాషాయ పార్టీ విజయానికి దారితీసిందని విజయన్ పేర్కొన్నారు. ఇదంతా కాంగ్రెస్, బిజెపి గెలవడానికి సహాయపడుతోందని, దాని భాగస్వామిగా వ్యవహరిస్తోందని నిరూపితవుతుందని అని ఆయన అన్నారు. కేరళలో ఎల్‌డిఎఫ్‌ను ఓడించడానికి దశాబ్దాలుగా బిజెపితో పొత్తు పెట్టుకున్నది కాంగ్రెస్సేనని విజయన్ మండిపడ్డారు. ఇఎంఎస్ నంబూదిరిపాడ్ కాలం నుంచి, ఆ దక్షిణ రాష్ట్రంలో అధికారం కోసం కాంగ్రెస్, ఆర్ఎస్ఎస్‌తో, ఆ తర్వాత జనసంఘ్ పార్టీతో, ఇప్పుడు బిజెపితో పొత్తు పెట్టుకుంటోందని ఆయన అన్నారు. కాంగ్రెస్, బిజెపి రెండింటికీ ఒకే విధమైన ఆలోచనా విధానం ఉందని సిఎం తెలిపారు. అందువల్ల, రానున్న అసెంబ్లీ ఎన్నికలలో తమకు ఎదురుకానున్న ఓటమిని దృష్టిలో ఉంచుకుని, సిపిఐ(ఎం), బిజెపి మధ్య పొత్తు ఉందన్న కాంగ్రెస్ నాయకుడి ఆరోపణ కేవలం ముందస్తు బెయిల్ మాత్రమేనని ముఖ్యమంత్రి అన్నారు. రాహుల్, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, యుడిఎఫ్ ఎన్నికల కార్యక్రమంలో సిపిఐ(ఎం), బిజెపి మధ్య రహస్య ఒప్పందం ఉందని ఆరోపించారు.

## పళనిస్వామి వ్యాఖ్యలపై డిఎంకె గరంగరం

- ఎఐఎడిఎంకెకు బిహార్, మహారాష్ట్ర పరిస్థితులు ఎదురవుతాయని వ్యాఖ్య



**చెన్నై :** తమ కూటమి భాగస్వామ్య పక్షాలపై ఎఐఎడిఎంకె ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి కె. పళనిస్వామి చేసిన వ్యాఖ్యలను అధికార డిఎంకె గురువారం తీవ్రంగా తప్పుబట్టింది. అవి అనవసరమైన వ్యాఖ్యలను అభివర్ణించింది. ఎఐఎడిఎంకెను విమర్శిస్తూ, ఆ పార్టీ భవిష్యత్తు బిహార్‌లో జెడియు అధినేత నితీష్ కుమార్ పరిస్థితిని, మహారాష్ట్రలో శివసేన, ఎన్‌సిపిల పరిస్థితిని, అలాగే గోవాలో బిజెపితో పొత్తులో ఉండి ఆ పార్టీ చేతిలో కబళించబడిన ప్రాంతీయ పార్టీల పరిస్థితిని తలపిస్తుందని డిఎంకె సీనియర్ నాయకుడు, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి ఎస్.ఎస్. శివశంకర్ గురువారం విలేకరుల సమావేశంలో పేర్కొన్నారు. డిఎంకె కూటమిలో కీలక భాగస్వామ్య పక్షమైన 'విడుదలై చిరుతైగళ్ కచ్చి' (విసికె)ని విమర్శించినందుకు పళనిస్వామిని శివశంకర్ ఎద్దేవా చేశారు. విసికె అనేది ఎన్నికల రంగంలో సవాళ్లను ఎదుర్కొంటూ, అంచెలంచెలుగా ఎదిగిన పార్టీ అని అన్నారు. ఆ పార్టీ అధినేత తోల్ తిరుమావలవన్, ప్రతిసారీ ఎన్నికల్లో తన విజయాన్ని నిరూపించుకుంటున్నారని, నేడు తమ పార్టీ అధినేత (ముఖ్యమంత్రి) ఆయనకు తగిన గుర్తింపును ఇస్తున్నారన్నారు. ఇంతటి సత్సంబంధాలు కలిగిన తమ కూటమిని పళనిస్వామి విమర్శిస్తున్నారని, ఆయన నేతృత్వంలోని కూటమిలో పళనిస్వామి బిజెపికి గతంలో కంటే ఎక్కువ సీట్లు కేటాయించడమే కాకుండా, అనేక ఇతర పార్టీలు బిజెపి ఎన్నికల చిహ్నమైన కమలం గుర్తుపై పోటీ చేసే పరిస్థితిని కల్పించారని మండిపడ్డారు. బిజెపితో పాటు, తమిళ మానిల కాంగ్రెస్ (మూపనార్), తమిళగ మక్కళ్ మున్నేట్ర కజగం, ఇండియ జననాయగ కచ్చి (ఐజెకె), పుదియ నీతి కచ్చి వంటి పార్టీలు కూడా బిజెపి 'కమలం' గుర్తుపైనే పోటీ చేస్తున్నాయని శివశంకర్ తెలిపారు. గత ఎన్నికల్లో ''నోటా' కంటే తక్కువ స్థానంలో నిలిచిన కమలం గుర్తుకు, పళనిస్వామి తమిళనాడులో ఇప్పుడు అత్యంత విశాలమైన స్థానాన్ని కల్పించారని ఆరోపించారు. బిహార్‌లో నితీష్ కుమార్‌కు ఎదురైన పరిస్థితి, మహారాష్ట్రలో శివసేన, శరద్ పవార్ పార్టీలు ఎదుర్కొన్న పరిస్థితి, అలాగే గోవాలో బిజెపితో పొత్తులో ఉండి ఆ పార్టీ చేతిలో కబళించబడిన ప్రాంతీయ పార్టీల పరిస్థితి... ఎఐఎడిఎంకె భవిష్యత్తు కూడా సరిగ్గా అలాగే ఉండబోతోందని పళనిస్వామి పదేపదే స్పష్టం చేస్తున్నారని శివశంకర్ పేర్కొన్నారు. చెన్నైలో అభివృద్ధిని డిఎంకె నిర్లక్ష్యం చేసిందన్న పళనిస్వామి ఆరోపణలపై పార్టీ సీనియర్ నాయకుడు, రాష్ట్ర మంత్రి పికె శేఖర్ బాబు స్పందిస్తూ 'ముఖ్యమంత్రి (ఎంకె స్టాలిన్) ఆధ్వర్యంలో అద్భుతమైన 'వడ చెన్నై వలర్చి తిట్టం' (ఉత్తర చెన్నై అభివృద్ధి పథకం) ప్రారంభించబడిందన్నారు. ఈ పథకం ఉత్తర చెన్నైలో జీవన ప్రమాణాలను మెరుగుపరిచిందని, ఇక్కడ సురక్షితమైన తాగునీరు, సజావైన మురుగునీటి పారుదల, నిరంతర విద్యుత్ సరఫరా వంటి సౌకర్యాలు కల్పిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్ పాఠశాలలకు సమానంగా ఉన్నతీకరించారని ఆయన ఇక్కడ విలేకరులతో అన్నారు.

## జి-7 సమావేశానికి హాజరయ్యేందుకు..

# ఫ్రాన్స్ వెళ్లిన విదేశీ వ్యవహారాల మంత్రి జైశంకర్

- పశ్చిమాసియా సంక్షోభంపై కీలకచర్చ సభ్య దేశం కానప్పటికీ, భాగస్వామ్యదేశంగా భారత్‌ను ఆహ్వానించిన ఫ్రాన్స్



**న్యూఢిల్లీ :** విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్.జైశంకర్ జి7 విదేశీ మంత్రుల సమావేశానికి హాజరయ్యేందుకు గురువారం ఫ్రాన్స్ వెళ్లారు. ఈ అత్యంత కీలక సమావేశంలో పశ్చిమాసియా సంక్షోభంపై చర్చించడంతో పాటు అంతర్జాతీయ నౌకాయానానికి హోర్ముజ్ జలసంధిని తెరిచిఉండేలా చూసేందుకు ప్రయత్నాలను సమన్వయం చేయడంపై దృష్టి సారించారు. భారతదేశం జి7 సభ్యదేశం కానప్పటికీ, ఈ శక్తివంతమైన జి7 సభ్యదేశాల కూటమి సమావేశానికి ప్రస్తుత అధ్యక్ష దేశమైన ఫ్రాన్స్ భారతదేశాన్ని భాగస్వామ్య దేశంగా ఆహ్వానించింది. అమెరికా, కెనడా, జర్మనీ, ఇటలీ, ఫ్రాన్స్, జపాన్, యునైటెడ్ కింగ్‌డమ్ తదితర దేశాల దౌత్యవేత్తలు ఈ సమావేశానికి హాజరవుతున్నారు. భాగస్వామ్య దేశాలతో మార్చి 26, 27 తేదీలలో ఫ్రాన్స్‌లోని అబ్బే డెస్ వాక్స్‌దెసెర్నే లో జరిగే జి7 విదేశాంగ మంత్రుల సమావేశాన్ని సందర్శించనున్నారని ఒక అధికారిక ప్రకటన తెలిపింది. ఈ జి7 సమావేశం సందర్భంగా జైశంకర్ తన సహచరులతో ద్వైపాక్షిక చర్చలు కూడా జరుపనున్నారని ఆ ప్రకటన వెల్లడించింది. భారతదేశంతో పాటు ఫ్రాన్స్, సౌదీఅరేబియా, సౌత్ కొరియా, బ్రెజిల్‌లను ఫ్రాన్స్ ఆహ్వానించింది. ఒక ఫ్రెంచి అధికారి తెలియజేసిన ప్రకారం పశ్చిమాసియా సంక్షోభానికి అంకితం చేసేలా ఒక సమావేశం జరుగనుంది. ఈ ప్రాంతంలో ఉద్రిక్తతలను తగ్గించి సముద్రమార్గాలను తిరిగి తెరవడానికి దారితీసే వివిధ చర్చల మార్గాలను అన్వేషించడంపై మంత్రులు చర్చిస్తారని ఆ అధికారి తెలిపారు. ఇరాన్ అణు బాలిస్టిక్ కార్యక్రమాన్ని ఎలా ఎదుర్కోవాలనే దానిపై కూడా విదేశాంగ మంత్రులు చర్చిస్తారని ఆ అధికారి పేర్కొన్నారు. ప్రపంచ చమురు, గ్యాస్‌లో సుమారు 20శాతం రవాణ జరిగే పర్షియన్ గల్ఫ్, గల్ఫ్ ఆఫ్ ఒమన్ మధ్య ఉన్న ఇరుకైన రవాణా మార్గమైన హోర్ముజ్ జలసంధిని ఇరాన్ వాస్తవంగా దిగ్బంధించిన తర్వాత ప్రపంచ చమురు, లిక్విఫైడ్ నేచురల్ గ్యాస్ (ఎల్ఎన్‌జి) ధరలకు ఒక్కసారిగా రెక్కలు వచ్చాయి. భారతదేశ ఇంధన సేకరణకు పశ్చిమాసియా ఒక ప్రధానవనరుగా ఉంది.పశ్చిమాసియాలో వీలైనంత త్వరగా సంఘర్షణలను ముగించడంపై దృష్టి సారించి భారతదేశం దౌత్యపరమైన ప్రయత్నాలు చేసింది. నౌకా రవాణ మార్గం దిగ్బంధం కొనసాగితే భారతదేశం సహా అనే క దేశాల ఇంధన ఎరువుల భద్రతపై తీవ్ర పరిణామాలు ఎదురవుతాయని న్యూఢిల్లీ భావిస్తోంది. గ్రూప్ ఆఫ్ 7 ప్రపంచంలోని జి7 అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థలను ఒకచోట చేర్చుతుంది. కెనడా, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, జపాన్, యునైటెడ్ కింగ్‌డమ్, యునైటెడ్ స్టేట్స్ (యుఎస్ఎ) యురోపియన్ యూనియన్ కూడా ఈ కూటమిలో సభ్యదేశంగా ఉంది. ప్రపంచ వేదికపై ఎదురయ్యే ప్రధాన ఆర్థిక, ద్రవ్య, భౌగోళిక , రాజకీయ సవాళ్లకు ప్రతిస్పందనగా చర్చించడానికి, చర్యలను సమన్వయం చేసుకోవడానికి జి7 దాని సభ్య దేశాలకు ఒక ప్రాధాన్య వేదికగా పనిచేస్తుంది.

## నదిలో పడిన బస్సు : 24 మంది మృతి

**ఢాకా:** బంగ్లాదేశ్‌లో ఒక బస్సు ఫెర్రీపైకి ఎక్కుతూ నదిలో పడిపోవడంతో బస్సులో ఉన్న 24 మంది మరణించారు. గల్లంతైన ప్రయాణికులకోసం గాలిస్తున్నారు. నైరుతిప్రాంత జిల్లా రాజ్‌బరిలో ఈ ఘటన జరిగింది. ఢాకాకు వెళుతున్న ఈ బస్సులో 40 మంది ప్రయాణికులున్నారు. వీరిలో అనేకమంది పిల్లలు. వీరంతా ఈద్ సెలవులు ముగించుకుని తిరిగి రాజధానికి చేరుకుంటున్నారు. అగ్నిమాపకదళ అధికారుల సమాచారం ప్రకారం క్రేన్ సహాయంతో బస్సును బయటకు తీశారు. 24 మంది ప్రయాణికుల మృతదేహాలను వెలికి తీశారు. ఇందులో 22 మంది బస్సులోనే మరణించారు. మృతుల్లో 11 మంది మహిళలు, ఐదుగురు పిల్లలు ఉన్నారు.11 మంది ప్రయాణికులు బస్సులోంచి తప్పించుకుని ఈదుకుంటూ ఒడ్డుకు చేరారు.పంటు మీద నుండి ఫెర్రీ దిశగా బస్సు వెళుతుండగా మరో చిన్న ఫెర్రీ వచ్చి పంటును ఢీకొట్టడంతో బస్సు నదిలో పడిపోయింది.

# స్వయం ప్రకటిత విశ్వగురు ఆధ్వర్యంలో... 'బ్రోకర్ కంట్రీ'గా మారిన 'బ్రోకెన్ కంట్రీ'

కాంగ్రెస్ విమర్శల దాడి
ప్రధాని మోదీ దౌత్యం ఆర్భాటాలు, పిరికితనంతో కూడిందని ఎద్దేవా

**న్యూఢిల్లీ :** పశ్చిమాసియా సంఘర్షణలో పాకిస్థాన్ మధ్యవర్తిత్వం వహించిందన్న వార్తలపై మోదీ ప్రభుత్వం 'దళాల్ నేషన్' అని వ్యాఖ్యానించడాన్ని కాంగ్రెస్ గురువారం తీవ్రంగా విమర్శించింది. స్వయం ప్రకటిత విశ్వగురువు ఆధ్వర్యంలో 'విచ్ఛిన్నమైన దేశం 'బ్రోకెన్ కంట్రీ'(విచ్ఛిన్నమైన దేశం) కాస్తా 'బ్రోకర్ కంట్రీ' (దళారీ దేశం)గా మారిందని కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి ఇన్‌చార్జి కమ్యునికేషన్స్ జైరాం రమేశ్ విమర్శలు గుప్పించారు. చక్కటి రూపం, సుదీర్ఘ అనుభవం ఉన్న విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి జైశంకర్ పశ్చిమాసియాలో ప్రస్తుత యుద్ధాన్ని ముగించడానికి పాకిస్థాన్ మధ్యవర్తిగా, చర్చల సమన్వయకర్తగా ఆవిర్భవించడం వల్ల భారతదేశానికి కలిగిన తీవ్రమైన ఇబ్బందిని, ప్రాంతీయ దౌత్యానికి ఎదురైన ఎదురుదెబ్బలను కప్పిపుచ్చడానికి శాయశక్తులా ప్రయత్నిస్తున్నారని జైరాం రమేశ్ విమర్శించారు. పాకిస్థాన్‌ను ఈ విషయంలో దోషిగా చిత్రీకరించడం దారుణమన్నారు. నాలుగు దశాబ్దాలకు పైగా ఇతర దేశాలపై ఉగ్రవాదాన్ని ప్రేరేపించి, దశాబ్దాలకు పైగా ఒసామా బిన్‌లాడెన్, ప్రపంచ ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించి ఇతరదేశాలు అణ్వస్త్రం సాధించేందుకు సహాయపడటానికి అణు నిరాయుధీకరణ చట్టాలను ఘోరంగా ఉల్లంఘించిందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ ఆరోపించారు. బలూచిస్థాన్, ఖైబర్ ఫఖ్తున్ఖ్వా సహా ఆఫ్ఘనిస్థాన్ ప్రావిన్స్‌లలోని ఆసుపత్రులు, పౌర సౌకర్యాలపై ఏక్యూ ఖాన్ నెట్‌వర్క్ దారుణంగా బాంబుదాడులు చేసిందని, తన సొంతపౌరులు, మతపరమైన మైనారిటీలపై యుద్ధం ప్రకటించిందని అప్పటి పాకిస్థాన్ ప్రెసిడెంట్ ముషారఫ్ బహిరంగంగా అంగీకరించారని జైరాంరమేష్ తన 'ఎక్స్' పోస్ట్‌లో తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ దౌత్యం యొక్క సారం, శైలి ఆర్భాటాలతో నిండి పిరికితనంతో కూడి ఉందని ఆయన అన్నారు. ముంబయిలో 26/11 ఉగ్రదాడులు జరిపిన తర్వాత పాకిస్థాన్ ఏకాకిగా మిగిలిపోయిందనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ఎందుకంటే డాక్టర్ మన్మోహన్‌సింగ్ ప్రభుత్వం పాకిస్థాన్ దుష్టపాత్రను గురించి ప్రపంచాన్ని నమ్మించగలిగిందని జైరాం రమేశ్ పేర్కొన్నారు. పశ్చిమాసియా సంఘర్షణలో పాకిస్థాన్ మధ్యవర్తిత్వం వహిస్తున్నదన్న వార్తలను ప్రస్తావిస్తూ ప్రభుత్వం దానిని 'దళాల్ నేషన్' అని అభివర్ణించిన నేపథ్యంలో బుధవారం కాంగ్రెస్ కూడా విమర్శనాస్త్రాలు సంధించింది. పశ్చిమాసియా సంక్షోభంపై పార్లమెంట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరైన వారితో విదేశాంగ శాఖ మంత్రి జైరాం రమేశ్ మాట్లాడుతూ 'మనం దళారీ దేశం కాదు' అన్నట్లు సమాచారం. దీనిపై కాంగ్రెస్ ముఖ్యనేత జైరాం రమేశ్ తన 'ఎక్స్' పోస్ట్‌లో స్పందిస్తూ విమర్శలు గుప్పించారు.

**పాస్‌పోర్ట్ పోయినది**

నేను, **బేరా సాయి తేజ, తండ్రి బేరా శ్రీనివాస్,** నివాసం: ఇంటి నంబర్ : 2-7-303/102, ఆర్.ఆర్. ఎన్‌క్లేవ్ (RR Enclave), ఎక్సైజ్ కాలనీ, హనుమకొండ, 506001, తెలంగాణ. వరంగల్‌లో 27-05-2022న జారీ చేయబడి, 26-05-2032 వరకు గడువు ఉన్న నా పాస్‌పోర్ట్ (నంబర్: **W1373214**) పోగొట్టుకున్నాను. నేను హనుమకొండలోని పాస్‌పోర్ట్ సేవా కేంద్రంలో డూప్లికేట్ పాస్‌పోర్ట్ కోసం దరఖాస్తు చేసుకున్నాను. ఎవరికైనా ఇది దొరికితే, దయచేసి పైన పేర్కొన్న చిరునామాకు లేదా సంబంధిత పాస్‌పోర్ట్ అధికారులకు తిరిగి పంపవలసిందిగా కోరుతున్నాను. సెల్: **9059886550**

# అధిక సంతానం పరిష్కారమా?

జనాభా పెరుగుదలకు ప్రోత్సాహమివ్వనున్నట్లు ఇటీవల తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అసెంబ్లీలో ప్రకటించారు. బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఉభయసభలను ఉద్దేశించి గవర్నర్ చేసిన ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై శాసనసభలో జరిగిన చర్చకు సమాధానం ఇస్తూ ఆయన ఈ అంశాన్ని ప్రస్తావించారు. పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఇద్దరు కంటే ఎక్కువ పిల్లలుంటే పోటీకి అనర్హత విధించే నిబంధనను తొలగిస్తూ తెలంగాణ ప్రభుత్వం చట్ట సవరణ తీసుకువచ్చింది. తాజాగా ముఖ్యమంత్రి పిల్లలను కనే దిశగా ప్రోత్సహించాలని సూచన ప్రాయంగా చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఒకరికి మించి కంటే ప్రోత్సాహమిస్తామని ప్రకటించారు. రెండవ లేదా మూడవ సంతానానికి రూ.25 వేల నగదు ప్రోత్సాహకం, ఐదేళ్ళ వరకు రూ.1,000 చొప్పున మంచి పౌష్టికాహారం కోసం ఇస్తామని వెల్లడించారు. అలాగే ప్రభుత్వ సంస్థలలో రెండవ, మూడవ సంతానానికి ఉచిత విద్యను 18వ ఏట వరకు అందజేస్తామని కూడా వెల్లడించారు. ఈ మేరకు జనాభా విధానాన్ని ఆంధ్రప్రదేశ్ శాసనసభలో ప్రకటించారు. అంతకుముందు తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ సైతం అధిక సంతానాన్ని కనవలసిందిగా దంపతులకు పిలుపునిచ్చారు. అదే బాటలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు కూడా ఉన్నాయి.

ఈ పిలుపులకు వెనుక జనాభా పడిపోతుండడమే కారణమే కాదు. ప్రాతినిధ్య ప్రజాస్వామ్య విధానాన్ని అవలంభిస్తున్న భారతదేశంలో దక్షిణాది రాష్ట్రాల లోక్ సభ స్థానాల సంఖ్య తగ్గనుందనే అందోళన కూడా ఉంది. తద్వారా ప్రజాస్వామ్య ప్రక్రియలో తమ బలం తగ్గిపోతుందని, విధాన రూపకల్పన, ఆర్థిక అంశాలలో దక్షిణాది గొంతుక బేలగా మారిపోతుందనే ఆదుర్దా ఉంది. 'ఒక్కరు ముద్దు, ఇద్దరు హద్దు, ముగ్గురు' అసలే వద్దని 70–80వ దశకాలలో భారత ప్రభుత్వం జనాభా నియంత్రణలో భాగంగా చేసిన ప్రచారం దక్షిణాదిలో సత్ఫలితాలను ఇచ్చింది. ఇక్కడ విద్య, ఆర్యోగ సేవలు, అభివృద్ధి మెరుగుగా ఉన్నాయి. ఇదే ప్రజాస్వామ్య ఎన్నిక వ్యవస్థలో శాపంగా మారి, తద్వారా ఈ రాష్ట్రాలకు వచ్చే నిధులకు గండిపడుతోంది. కేంద్ర ప్రభుత్వ నిర్దేశాలను క్రమశిక్షణతో అమలు చేసినందుకు తమను ప్రోత్సహించాల్సింది పోయి శిక్షిస్తారా? అనే ఆగ్రహం దక్షిణాది ముఖ్యమంత్రులలో వ్యక్తమవుతోంది. మరోవైపు సంతాన సాఫల్య రేటు (టిఎఫ్ఆర్) రెండుకు దిగువకు పోతుండడంతో దక్షిణాది రాష్ట్రాలలో ఆందోళన వ్యక్తమవుతోంది. ఆంధ్రప్రదేశ్‌లో టిఎఫ్ఆర్ 1.50 శాతం, తెలంగాణలో 1.6, తమిళనాడులో 1.5, కేరళలో 1.5, కర్నాటకలో 1.6గా ఉంది. అదే సమయంలో భారతదేశ వ్యాప్తంగా టిఎఫ్ఆర్ 2.0గా ఉంది. అంటే సగటున దంపతులు ఇద్దరిని కంటున్నప్పటికీ, దక్షిణాదిలో అంతకు తక్కువ గానే ఉంది. ఇక్కడ టిఎఫ్ఆర్ రెండు కంటే తక్కువ ఉండగా, ఉత్తరాదిలో ఎక్కువ. 2011, 2036 మధ్య కాలంలో భారతదేశ జనాభా 31.1కోట్లు పెరిగే అవకాశముండగా, అందులో సగం కేవలం బిహార్, ఉత్తర్ ప్రదేశ్, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్, మధ్య ప్రదేశ్ రాష్ట్రాల నుంచే ఉంటారు. ఇదే సమయంలో ఐదు దక్షిణాది రాష్ట్రాల నుంచి కేవలం 2.9 కోట్ల మందే దేశ జనాభాలో చేరుతారు.

దక్షిణాది రాష్ట్రాలకు మరో ప్రమాదం కూడా పొంచి ఉంది. అదే వయోధికుల సమస్య, 2011లో 60 ఏళ్ళు పైబడిన వృద్ధుల సంఖ్య 10 కోట్ల నుంచి 2036 నాటికి రెట్టింపై 23 కోట్లకు చేరనుంది. అప్పటికి కేరళలో ప్రతి నలుగురిలో ఒకరు 60 ఏళ్ళు పైబడనున్నారు. ఉత్తర్ ప్రదేశ్‌లో మాత్రం కేవలం 12 శాతం మాత్రమే వయోధికులు ఉండబోతున్నారు. పెరుగుతున్న వయోవృద్ధులు, తగ్గుతున్న జననాల సంఖ్య అనే ద్విముఖ సమస్య జనాభా నియంత్రిత రాష్ట్రాలలో ఎదురవుతోంది. వృద్ధులు పెరుగుదలతో వారు ఇతరులపై ఆధారపడాల్సి వస్తుంది. అలాగే ఆరోగ్య రక్షణ, సామాజిక భద్రత కోసం ఎక్కువ ఖర్చు చేయాల్సి వస్తుంది. అలాగే సమర్ధ యువశ్రామిక శక్తి తగ్గుతుంది. ఇలాంటి సమస్యలనే ఎదుర్కొంటున్న జపాన్, చైనా, ఐరోపా దేశాలు తమ ప్రజలను ఎక్కువ మంది పిల్లలు కనాల్సిందిగా కోరుతున్నాయి.

నిజానికి అభివృద్ధి చెందుతున్న, చెందిన దేశాలలో జనాభా తరుగుదల, వృద్ధుల పెరుగుదలకు సామాజిక కారణాలు ఉన్నాయి. ప్రధానంగా పెట్టుబడిదారి వ్యవస్థలో సంపద సృష్టించబడుతున్నప్పటికీ, కొందరి చేతుల్లో కేంద్రీకరింపబడుతుండడంతో అంతరాలు పెరిగిపోతున్నాయి. ఆధునీకరణతో యువతకు ఉద్యోగాలు, వేతనాలు తగ్గిపోవడం, నిరుద్యోగం తాండవిస్తుండడం, కనీస అవసరాలైన ఇళ్లు, వైద్యం, విద్య వ్యయం చుక్కలనంటుతున్న కారణాలతో వివాహాలకు విముఖంగా ఉంటున్నారు. పెళ్ళి చేసుకున్నా ఖర్చులకు వెరసి, పిల్లలు ఒక్కరు చాలు లేదంటే అసలే వద్దు అనే నిర్ణయానికి వచ్చేస్తున్నారు. శాస్త్ర, సాంకేతికత అభివృద్ధి మెరుగవడంతో ఆయుఃప్రమాణాలు పెరిగి వృద్ధుల సంఖ్య పెరిగిపోతుంది. ఈ వైరుధ్యానికి పరిష్కారాన్ని సమాంతరంగా అమలు చేయకుండా కేవలం ఎక్కువ మంది పిల్లలను కనేందుకు ప్రోత్సహించడంపై ఆలోచన చేయాలి. సంపన్నులు, కార్పొరేట్‌లపై పన్నులు పెంచి, ఆ నిధులను ప్రభుత్వ రంగంలో విద్య, వైద్యం, గృహ పథకాలకు వెచ్చించాలి. వ్యవసాయాన్ని రైతులకు లాభసాటి చేసి, నిత్యవసరాల ధరలను నియంత్రించాలి. భూమిని సేద్యం, అవసరమైన వారికి అందుబాటులో నివాసయోగ్యంగా ఉండాలే తప్ప స్పెక్యులేటివ్ రియల్ ఎస్టేట్ వ్యాపారంగా మార్చటానికి ప్రభుత్వాలు చెక్ పెట్టాలి. ఇవి పరిష్కారం కాకుండా, ఒక వైపు సంపద కేంద్రీకరణ పెరుగుతుంటే, మరోవైపు నిర్దిష్ట చర్యలు తీసుకోకుండా ఎక్కువ మంది పిల్లలను కనమని ప్రోత్సహించడం ద్వారా సామాజిక అశాంతికి దారి తీసే ప్రమాదాలూ లేకపోలేదు. అందుకే సామాజిక, ఆర్థిక నిపుణులు, సమాజంలోని వివిధ భాగస్వాములతో లోతుగా చర్చించిన తరువాతే జనాభా విధానాలపై ప్రభుత్వాలు ఒక నిర్ణయానికి రావడం సబబు.



## బిజెపి ప్రభుత్వాలు విఫలం

కేంద్రం, ఉత్తరప్రదేశ్‌లోని బిజెపి ప్రభుత్వం ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, కీలక పాలనా సవాళ్లను పరిష్కరించడంలో విఫలమయ్యాయి. కేవలం ప్రచారం, సంఘటనల ఆధారిత రాజకీయాలపైనే ఆధారపడ్డాయి. బిజెపి పాలనలో ప్రజలు వంటగ్యాస్ వంటి ప్రాథమిక అవసరాల కోసం క్యూలలో నిలబడాల్సి పరిస్థితులు వచ్చాయి. పెరుగుతున్న ధరలు, సరఫరా సమస్యలను ఎదుర్కోవడంలో ప్రభుత్వ సన్నద్ధతను ప్రశ్నిస్తూ, ఎల్‌పిజి సిలిండర్ల సరఫరాలో మార్పులకు అనుగుణంగా సరైన ఉత్పత్తి ప్రణాళిక లేదు. బిజెపి పాలనా విధానాన్ని లక్ష్యంగా చేసుకుని, దాని నిర్ణయాలు పౌరులను తీవ్ర ఇబ్బందుల్లోకి నెడుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల కుదుర్చుకున్న అవగాహన ఒప్పందాలపై (ఎంఒయు) సమగ్ర విచారణ జరపాలి.

– సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు
అఖిలేష్ యాదవ్




## నాటకరంగ సాంస్కృతిక సృజనతో ప్రపంచ శాంతి స్థాపన

నాటకరంగం లేదా థియేటర్ వేదికగా పలువురు నటులు, నటీమణులు, ఇతర కళాకారుల సహకార సృజనాత్మకత కళలను ప్రదర్శనలు ఇవ్వడం జరుగుతున్నది. నాటకశాల వేదికపై ప్రత్యక్షంగా కళాకారులు తమ నిజమైన లేదా ఊహాత్మక పాత్రలకు జీవం పోస్తూ ప్రేక్షకుల మన్ననలు పొందడం అనాదిగా కొనసాగుతున్నది. ఆధునిక నాటక రంగం కూడా డిజిటల్ రంగులు అద్దుకొని పలు వినూత్న మార్పులకు ఊపిరి పోస్తున్నది. నటులు తమ నటనతో పాటు పాత్రకు తగిన వేషధారణలు, వేదిక వెనుక సందర్భోచిత పరదాలు, ఆధునిక సాంకేతిక ప్రదర్శనలు, మైమింగ్, ఏకపాత్రాభినయాలు, తోలు బొమ్మలాటలు, సర్కస్, ఒపేరా, డిజిటల్ మీడియా లాంటివి అద్భుత రీతిలో అందంగా, వినోదాత్మకం గా, విజ్ఞానదాయకంగా, సానుకూల మార్పుల దిశగా, వేదికను సుసంపన్నం చేస్తూనే ఉన్నారు.

**నాటకరంగం – సాంస్కృతిక సృజనతో ప్రపంచ శాంతి స్థాపన:**
ప్రతి ఏటా 27 మార్చిన ప్రపంచ నాటకరంగ దినోత్సవం (వరల్డ్ థియెటర్ డే) పాటించుట 1962 నుంచి ఆనవాయితీగా మారింది. 2026 ప్రపంచ నాటక దినోత్సవం ఇతివృత్తంగా నాటకరంగం సాంస్కృతిక సృజనతో ప్రపంచ శాంతి స్థాపన అనబడే అంశాన్ని తీసుకున్నారు. ఒకరి పాత్రలో మరొకరు నటిస్తూ ప్రేక్షకులను అలరించడం లేదా ఒక అంశాన్ని ప్రజల కళ్ల ముందుంచ డం, సమాజ విపరీత పోకడలను వేలెత్తి చూపడం, సకారాత్మక మార్పులను సూచించడం, విద్య వినోదాల విందులు నాటకరంగ ప్రత్యేకతల్ని తెలుసుకో వాలి.
**డిజిటల్ వెలుగుల్లో కళ తప్పిన నాటకరంగం:** డిజిటల్ యుగంలో స్మార్ట్ ఫోన్స్, టీవీలు ఇంటింటా వెలగడంతో సినిమా హాళ్లు కూడా ఖాళీగా కనిపిస్తున్నాయి. నాటక రంగం రానురాను తెర వెనక్కి వెళుతూ కళాకారుల, ప్రజల ఆదరాభిమానాలు పలుచబడుతున్నాయి. నాటక ప్రదర్శనలు అరుదై పోయాయి. నటులు, నటీమణులు మరో మార్గం లేక నటనకు స్వస్తి పలకడం లేదా సినిమారంగంలోకి వెళ్లే ప్రయత్నాలు చేయడం కొనసాగుతున్నది. నాటక రంగ కళాకారులు అంటే పరిహాసం అయిపోవడం అత్యంత బాధాకరం. నాటకరంగానికి నిధుల కొరత, ప్రభుత్వాల నిరాదరణ, కొరవడిన కళాకారులకు ప్రోత్సాహకాలు, డిజిటల్ వేదికలకు పెరిగిన ఆదరణ, ప్రజల ఆసక్తి తగ్గడం లాంటి అంశాలు థియేటర్ ఆర్ట్ రంగానికి శాపంగా మారుతున్నాయి. మనదైన పూర్వపు నాటక కళకు డిజిటల్ రంగులు అద్ది కళాకారుల ప్రదర్శనలను ఆదరిద్దాం, విజ్ఞాన వినోద, చైతన్యాలను పొందుదాం.

**(27 మార్చి ప్రపంచ నాటకరంగ దినోత్సవం సందర్భంగా)**

# రాష్ట్ర బడ్జెట్ లో ఆర్‌టిసికి అరకొర నిధులు




ఎస్.బాబు
అధ్యక్షుడు
టిజిఎస్ఆర్టీసి ఎంప్లాయీస్ యూనియన్

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం 2026–27 సంవత్సరానికి 3,24,234 లక్షల కోట్ల బడ్జెట్ ప్రవేశపెట్టింది. బడ్జెట్ శాఖల వారీగా పంపకాలు జరిగాయి. ఆ సందర్భంలోనే బడ్జెట్‌లో ఆర్టీసి మహాలక్ష్మి పథకానికి సంబంధించి 4,305కోట్లు ప్రొవిజన్ పెట్టారు. ప్రతినెలా 382.5 కోట్ల రూపాయలు మహిళా ప్రయాణీకులకు ఆర్టీసి బస్సులో ప్రయాణించినందుకు ప్రభుత్వం ఆర్టీసికి చెల్లించాలి. ఆ లెక్కన వార్షిక బడ్జెట్‌లో 4,590 కోట్లు ప్రవేశపెట్టాలి. అలా కాకుండా ఇవ్వాల్సిన దానికంటే 285 కోట్ల రూపాయలు బడ్జెట్‌లో తక్కువ పెట్టారు. రెండున్నర ఏళ్ళకాలంలో ఈ పథకానికి ప్రభుత్వం నుండి ఇంకా ఆర్టీసికి రావలసిన 2,500కోట్ల రూపాయలు బకాయిలు ఉన్నాయి. మహాలక్ష్మి పథకం పాత బకాయిలు మరియు బడ్జెట్‌లో వాస్తవ ఖర్చు కలిపి 7,375 కోట్లు కేవలం ఈ పథకానికే బడ్జెట్ పెట్టాల్సి ఉండగా అర కొర నిధులిచ్చి ఆర్టీసిని ఎలా బ్రతికిస్తారు? ఈ సంస్థను ఎలా ముందుకు తీసుకెళ్తారో చెప్పలేదు.

బడ్జెట్ గురించి ఆర్థికమంత్రి భట్టి విక్రమార్క ప్రసంగిస్తూ "బాధ్యతతో ఎవరు ప్రశ్నించినా బాధ్యతతోనే వారికి సమాధానం చెబు తాం. ఇది ప్రజల పట్ల, ప్రజాస్వామ్యం పట్ల మాకున్న చిత్తశుద్ధి" అన్నారు. ప్రభుత్వం మహాలక్ష్మి పథకానికి ఇచ్చిన పద్దు సరిపోదని 7,375 కోట్ల వాస్తవ నిధులు ఇవ్వమని అదే బాధ్యత అని, అదే చిత్తశుద్ధి అని ఆర్టీసి కార్మికులు అడుగుతున్నారు. సమాధానం చెప్పాల్సిన బాధ్యత, బడ్జెట్ పెంచాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉందని కార్మిక సంఘాలు గుర్తు చేస్తున్నాయి. ప్రతినెల ప్రభుత్వం ఇవ్వాల్సిన 382.5కోట్ల రూపాయలు ప్రభుత్వం ఆర్టీసికి అందజేయక పోవడంతో ఆర్థిక ఇబ్బందులకు గురవుతోంది. హైదరాబాద్ నగరాభివృద్ధి, భద్రతకు 11,907కోట్లు బడ్జెట్ కేటాయించిన ప్రభుత్వానికి ఆర్టీసి భద్రత అవసరం లేదా? రాష్ట్రంలో కోటి 15 లక్షల రేషన్ కార్డుదారుల కుటుంబాలకి ఆ ఇంటి పెద్ద చనిపోతే 5 లక్షల రూపాయలు బీమా ఇచ్చి ఆ కుటుంబాన్ని ఆదుకుంటామని ఆర్థికమంత్రి చెప్పారు. కాని ఆర్టీసిలో విధి నిర్వహణలో చనిపోయిన ఉద్యోగి కుటుంబానికి ఇచ్చే కారుణ్య నియామకాలు రెగ్యులర్ పద్ధతిలో కాకుండా కన్సాలిడేటెడ్ విధానంలో ఇస్తున్నారు. ఆర్టీసి కార్మికులంటే ఎందుకు ఇంత వివక్ష అని కార్మికులు ఆగ్రహిస్తున్నారు. 2 గంటల పాటు జరిగిన బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ వారి ప్రభుత్వం వాస్తవాల పునాదుల మీద పని చేస్తోందని, వారు పాలకులు కాదని, ప్రజల సేవకులని, ప్రజలకు చెందిన ప్రతి పైసాకు కాపలాగా ఉంటామని డాంబికాలు పోయారు. వారన్నది నిజమే అయితే ఆర్టీసిని బడ్జెట్‌లో ఇంత దారుణంగా దెబ్బతీస్తారా? ప్రజా రవాణా వ్యవస్థ నిర్వీర్యం అయ్యే విధంగా బడ్జెట్‌లో నిర్ణయాలు చేస్తారా? బిఆర్ఎస్ ప్రభుత్వం చేసిన 8.50 లక్షల కోట్ల అప్పులకు 44,000 కోట్ల రూపాయలు వడ్డీ చెల్లిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసికి ఇవ్వాల్సిన మహాలక్ష్మి పాత బకాయిలతో పాటు ఇతర బకాయిలు ఎందుకు చెల్లించదు? బిఆర్ఎస్ ప్రభుత్వం ఆర్టీసి ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయాలని గెజిట్ ప్రచురించినా, విలీనం చేయకపోవడం ఏమిటని కార్మికులు మండిపడుతున్నారు.

ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన 6 గ్యారెంటీలకు 50 వేల కోట్ల పైచిలుకు బడ్జెట్‌లో పెట్టారు. సంతోషమే. కానీ ఆర్టీసికి కూడా ప్రభుత్వం 6 గ్యారెంటీలు ఇచ్చింది. వాటికి బడ్జెట్‌లో ఒక్క రూపాయి కూడా పెట్టలేదు. మరి ఆర్టీసికి ఇచ్చిన 6 గ్యారెంటీల హామీలు ఎలా అమలవుతాయి? 1.ఆర్టీసి ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం 2. రెండు వేతన సవరణల అమలు 3. ట్రేడ్ యూనియన్లపై ఆంక్షలు ఎత్తివేసి గుర్తింపు సంఘ ఎన్నికల నిర్వహణ 4.ఆర్టీసి కార్మికులకు ఉద్యోగ




భద్రత. 5. 2013 వేతన సవరణ బాండ్ల బకాయిల విడుదల 6. ప్రయాణీకుల సౌకర్యం కోసం కొత్త బస్సులు కొనుగోలు చేసి, సంస్థ విస్తరణకు కంకణ బద్ధులమవుతామన్నారు. ఉగాది రోజు మంత్రులు కంకణాలు కట్టుకున్నారు కానీ ఆర్టీసి ఊసెత్తలేదు. కేవలం ఒకటిన్నర హామీలు మాత్రమే పరిష్కారం అయ్యాయి. మిగిలిన నాలుగన్నర హామీల అమలుకు బడ్జెట్ లో నిధులు కేటాయించలేదు. ఇందులో 2 హామీలకు అసలు బడ్జెట్‌తో పనేలేదు. అవి ఆర్థిక భారం లేనట్టి ఉద్యోగ భద్రత, ట్రేడ్ యూనియన్ల పునరుద్ధరణతో పాటు ఎన్నికలు జరపడం.

ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 6 గ్యారెంటీలు అమలు జరగనందున ప్రైవేట్ బిల్లు అసెంబ్లీలో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ పెట్టారు. మరి ఆర్టీసికి ఇచ్చిన 6 గ్యారెంటీల గురించి బిఆర్ఎస్ ప్రశ్నించదా? ఆర్టీసి కార్మికులు కూడా ప్రజల్లో భాగమే కదా? అధికార పక్షము, విపక్షము ఆర్టీసి కార్మికులను పట్టించుకోకపోతే వారి గోస ఎవరికి వినిపించాలి? ప్రభుత్వ ఉద్యోగుల భద్రతకోసం దేశంలోనే తొలిసారిగా సమగ్ర ప్రమాద బీమా పథకాన్ని ప్రవేశపెట్టామని గొప్పలు పోతున్న ప్రభుత్వం, ఆర్టీసి కార్మికుల ఉద్యోగ భద్రతపై ఇచ్చిన హామీని ఎందుకు నెరవేర్చలేకపోతోంది? ఆర్టీసి కార్మికులపై సవతితల్లి ప్రేమ చూపించడాన్ని కార్మికు లు జీర్ణించుకోలేకపోతున్నారు. బడ్జెట్ కేటాయింపులు ప్రభుత్వ ప్రాధాన్యతను బట్టి కేటాయించామని మార్చి 20న జరిగిన క్యాబినెట్ మీటింగ్‌లో ముఖ్యమంత్రి అన్నారు. మరి ప్రభుత్వరంగ సంస్థ అయిన ఆర్టీసికి ప్రాధాన్యం లేనందువల్లే బడ్జెట్‌లో చాలీచాలని నిధులు కేటాయించారా? కొత్త బస్సులు కొనుగోలు చేసి ప్రయాణీకులకు సౌకర్యం కల్పిస్తామని, సంస్థను అభివృద్ధి పథంలో నడుపుతామని ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలు నీటిమీద రాతలేనా?

వివిధ రకాల పాస్‌లకు ఇచ్చే రాయితీలు కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా మర్చిపోయింది. ఒక్క మహాలక్ష్మి పథకానికే బడ్జెట్ లో ప్రొవిజన్ కల్పిస్తే విద్యార్థులు, వికలాంగులు, విలేఖరులు, ఎన్జీవోలకు ఇస్తున్న రాయితీలు ఎవరు భరించాలి? ప్రభుత్వం ఇవ్వాల్సిన రాయితీల కు ఆర్టీసిని బలిపీఠం ఎక్కించడం సమంజసం కాదు. సంస్థ అంతర్గత అవసరాలకు వాడుకున్న డబ్బు పిఎఫ్, ఎస్.ఆర్.బి.ఎస్, ఎస్.బి.టి, సిసిఎస్‌లకు 2,100 కోట్లు చెల్లించలేదు. ఈ విషయం ప్రభుత్వం, ఆర్టీసి మేనేజిమెంట్ మరచిపోవడం దురదృష్టకరం. బడ్జెట్ కేటాయింపుపై ఆయా శాఖల ఉన్నతాధికారులతో సమీక్షలు నిర్వహించుకుని, అవసరాలపై అవగాహనకు రావాలని, ఇంకా బడ్జెట్ అవసరమనుకుంటే సర్దుబాటు చేస్తానని కేబినెట్ భేటీలో ముఖ్యమంత్రి మంత్రులకు సూచించారు.

మహాలక్ష్మి పథకానికి 7,375 కోట్లు, బస్ పాస్ రాయితీలు 1,000 కోట్లు, సంస్థ అంతర్గత అవసరాలకు వాడుకున్న వివిధ రకాల ట్రస్ట్ ల సొమ్ము 2,100 కోట్లు, మొత్తం కలిపి 10,475 కోట్లు ప్రభుత్వం బడ్జెట్ లో సవరించాల్సిన అవసరం ఉంది. కాబట్టి రవాణా శాఖామాత్యులు, ఆర్టీసి యాజమాన్యంతో మాట్లాడి బడ్జెట్ పెంచే విధంగా ముఖ్యమంత్రికి నివేదించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. "రైతుల కళ్ళలో ఆనందం చూడాలన్నదే నా తపన" అన్నారు ముఖ్యమంత్రి. రైతు భరోసా ఉత్సవాలలో 70 లక్షల మంది రైతులకు 3,600 కోట్లు పంపిణీ చేశారు. దాన్ని స్వాగతిస్తున్నాం. మరి ఆర్టీసి కార్మికుల కళ్ళలో కారం కొడుతున్నారెందుకు? బడ్జెట్ లో ఎందుకు వివక్ష చూపిస్తున్నారు? బిసిలకు రూ.12,511కోట్లు, ఎస్సీలకు 11,784కోట్లు సంక్షేమ శాఖలకు ప్రభుత్వం బడ్జెట్‌లో కేటాయించింది. ఆర్టీసిలో కూడా బిసి, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు ఉన్నారు. వారి అవసరాలకు ఆర్టీసిలో ఉపయోగపడే సంక్షేమ విభాగాలకు డబ్బు చెల్లించకపోవటం వివక్ష కాక మరేమిటని కార్మికులు గుసగుస లాడుతున్నారు.

కాబట్టి కేబినెట్ మీటింగ్‌లో ముఖ్యమంత్రి మంత్రులకు సూచించిన విధంగా రవాణా శాఖామాత్యులు ముఖ్యమంత్రితో చర్చించి ఆర్టీసిలో బడ్జెట్ అవసరాల గురించి, ప్రభుత్వం ఆర్టీసి కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయటం గురించి తెలియజేసి ఆర్టీసికి బడ్జెట్ ప్రొవిజన్ 10,475 కోట్ల రూపాయలు పెట్టటం వలన సంస్థకు మరియు కార్మికులకు ఉపశమనం కలుగుతుంది. ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కార్మికవర్గం కోరుతోంది.

# ప్రపంచ యుద్ధాలు...మానవత్వంపై మహా విధ్వంసం

యుద్ధమంటే కేవలం రెండు దేశాల మధ్య జరిగే సంఘర్షణ మాత్రమే కాదు. పర్యావరణాన్ని, ఆర్థిక వ్యవస్థను, విద్యను, మానవ జీవనాన్ని సమగ్రంగా ధ్వంసం చేసే మహా విపత్తు. చమురు, గ్యాస్, సహజ వనరుల స్వాధీనం, భూభాగ విస్తరణ కాంక్షతో ఆయా దేశాలపై జియో పొలిటికల్ వ్యూహాలతో ఆధిపత్యం చెలాయించడానికి చేసే కుట్ర పూరిత మహా విధ్వంసం. మొదటి ప్రపంచ యుద్ధం (1914–1918) మానవ చరిత్రలో మొదటిసారిగా పారిశ్రామిక స్థాయి మారణహోమాన్ని చూపించింది. ఫ్లాండర్స్ మైదానాల్లో మస్టర్డ్ గ్యాస్ వ్యాపించి లక్షల మంది సైనికులను శాశ్వత గుడ్డివారిగా మార్చింది. రెండవ ప్రపంచ యుద్ధం (1939–1945) చరిత్రలోనే అతిపెద్ద మానవ విషాదంగా నిలిచిపోయింది. కోట్లకు పైగా మనుషులు మరణించారు, హోలోకాస్ట్‌లో లక్షల మంది నిర్మూలించబడ్డారు. హిరోషిమా, నాగసాకిలపై పడిన అణుబాంబులు (1945) ఒక్క క్షణంలో 2 లక్షల మంది ప్రాణాలు తీశాయి. John Hersey రాసినట్లు ఆ పేలుళ్ళకు మిగిలిన వారు అత్యంత దుర్భరంగా బతికారు.రేడియేషన్ వ్యాధులు, కేన్సర్, జన్యు వైకల్యాలు తరతరాలు వేధించాయి. రసాయన ఆయుధాలు మానవ చరిత్రలో అత్యంత క్రూరమైన ఆవిష్కరణలలో ఒకటి. సిరియా అంతర్యుద్ధంలో (2013) సరీన్, క్లోరిన్, గ్యాస్ వాడకంద్వారా ప్రాణాలు హరించబడ్డాయి. రసాయన ఆయుధాల ప్రభావం దశాబ్దాల పాటు నేలలో, నీళ్ళలో నిలిచి పంటలు పండవు, పశువులు చనిపోతాయి, పిల్లలలో శ్వాసకోశ వ్యాధులు పెరుగుతాయి. SIPRI 2023 నివేదిక ప్రకారం ప్రపంచవ్యాప్తంగా క్షిపణి ఆయుధ వ్యయం 2.2 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంది. ఇది ప్రపంచంలోని అన్ని దేశాల ఆరోగ్య బడ్జెట్‌ను మించిపోయే సంఖ్య.

**పర్యావరణ నష్టం...** యునైటెడ్ నేషన్స్ ఎన్విరాన్మెంట్ ప్రోగ్రామ్ (UNEP) నివేదికల ప్రకారం ఆధునిక యుద్ధాలలో అడవులు, నీటి వనరులు, మట్టి సంపద తీవ్రంగా దెబ్బతింటున్నాయి. వియత్నాం యుద్ధకాలంలో (1955– 1975) అమెరికా సైన్యం వాడిన 'ఏజెంట్ ఆరెంజ్' రసాయన పదార్థం వల్ల 50 లక్షల ఎకరాల పైగా అడవులు నాశనమయ్యాయి. మట్టిలో కలిసిపోయిన ఆ విషరసాయనాల ప్రభావం నేటికీ వియత్నాం మట్టిలో, పిల్లల శరీరాలలో కనిపిస్తూనే ఉంది. 1991 గల్ఫ్ యుద్ధంలో కువైత్ చమురు బావులలో మంటలు రేగి నెలల పాటు మండటం వల్ల 10 కోట్ల టన్నుల కార్బన్ డయాక్సైడ్ వాతావరణంలో కలిసింది. సముద్రంలో చమురు చిందడంతో సుమారు 700 కిలోమీటర్ల మేర జీవవైవిధ్యం నష్టపోయింది. రష్యా–ఉక్రెయిన్ యుద్ధం వల్ల సుమారు 500 కోట్ల డాలర్ల పర్యావరణ నష్టం సంభవించిందని అంచనా. సైనిక కార్యకలాపాలు, గ్రీన్‌హౌస్ వాయువుల ఉద్గారాల్లో సుమారు 5.5%కు కారణమవుతున్నాయి. గాజా, ఇజ్రాయిల్ యుద్ధాల వల్ల సుమారు 3.2 కోట్ల టన్నుల కార్బన్ ఉద్గారాలు గాలిలోకి చేరినట్లు అధ్యయనాలు సూచిస్తున్నాయి. ప్రస్తుత పశ్చిమాసియా యుద్ధం మరింత కాలం కొనసాగితే హోర్మజ్ జలసంధి వాణిజ్యం ముప్పులో పడుతుంది. ఇంటర్నేషనల్ ఎనర్జీ ఏజెన్సీ హెచ్చరిక ప్రకారం ఇక్కడ సంఘర్షణ తీవ్రమైతే ముడి చమురు ధర బ్యారెల్‌కు 150 డాలర్లకు చేరే ప్రమాదముంది. చమురు, గ్యాస్ ధరలు ఇప్పటికే సుమారు 25% పెరిగాయి. రాచెల్ కార్సన్ తన 'సైలెంట్ స్ప్రింగ్' పుస్తకంలో యుద్ధకాల రసాయనాలు ప్రకృతిపై చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తూ యుద్ధం అంటే అది భూమికి పెద్ద గాయం, అది మాయడానికి శతాబ్దాలు పట్ట



వచ్చు అన్నారు.

**ఆర్థిక వ్యవస్థపై...** యుద్ధం ఆర్థిక వ్యవస్థను మూలాల నుండి తెంచివేస్తుంది. ప్రపంచం 2024 నుండి ఇప్పటి వరకు సుమారు 2.6 లక్షల కోట్ల డాలర్లను మిలిటరీ ఖర్చులకు వినియోగించింది. ఈ మొత్తం ద్వారా ప్రపంచానికి తాగునీరు, ఆహార భద్రత వంటి ప్రాథమిక అవసరాలు తీర్చవచ్చు. ఈ ఖర్చులో అమెరికా వాటా సుమారు 38% ఉండటం గమనార్హం. వరల్డ్ బ్యాంకు అంచనాల ప్రకారం ఉక్రెయిన్ యుద్ధం (2022) వల్ల ఆ దేశానికి 400 బిలియన్ డాలర్ల నష్టం వాటిల్లింది. జోసెఫ్ స్టిగిలిజ్ మరియు లిండా బిమ్స్ రాసిన 'ది త్రీ ట్రిలియన్ డాలర్ వార్' పుస్తకం ప్రకారం ఇరాక్ యుద్ధం వల్ల అమెరికాకే 3 ట్రిలియన్ డాలర్ల నష్టం అంచనా వేయబడింది. మొదటి ప్రపంచ యుద్ధం తర్వాత జర్మనీ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలి హైపర్ ఇన్‌ఫ్లేషన్ వచ్చింది. ఒక రొట్టె కొనడానికి పెట్టెల నిండా డబ్బు తీసుకెళ్ళవలసి వచ్చింది. అగ్ర దేశాలు పేద దేశాల కు ఇచ్చే ఆర్థిక సహాయం 50% కంటే ఎక్కువగా తగ్గిపోయింది. ఉక్రెయిన్ ప్రపంచానికి 'గోధుమల గిడ్డంగి'. అక్కడి యుద్ధం వల్ల ఆఫ్రికా, ఆసియాలో ఆకలి మంటలు రేగాయి. మొదటి ప్రపంచ యుద్ధం తర్వాత ఏర్పడిన ఆహార కొరత, కిక్కిరిసిన సైనిక శిబిరాలు, ప్రజల తరలింపు వల్ల వైరస్ వేగంగా వ్యాప్తి చెంది యూరప్‌లో 1918–1919 స్పానిష్ ఫ్లూ మిలియన్లకు పైగా ప్రాణాలు తీసింది. యుద్ధం, వ్యాధి, ఆకలి మూడూ కలసి నడుస్తాయని చరిత్ర నిరూపించింది. గాజాలో పాఠశాలలు ధ్వంసమయ్యాయి లేదా ఆశ్రయ శిబిరాలుగా మారాయి. UNICEF 2023 నివేదిక ప్రకారం ప్రపంచవ్యాప్తంగా సంఘర్షణ ప్రభావిత ప్రాంతాల్లో అధిక సంఖ్యలోపిల్లలు చదువు మానేశారు. 'ఎడ్యుకేషన్ ఈజ్ ది మోస్ట్ పవర్ఫుల్ వెపన్ విచ్ యు కెన్ యూజ్ టు చేంజ్ ది వరల్డ్' అని నెల్సన్ మండేలా అన్నారు. ఆ ఎడ్యుకేషన్ అనే ఆయుధాన్నే యుద్ధం నాశనం చేస్తుంది.

**శాంతి మంత్రమే శాశ్వత పరిష్కారం...** యుద్ధం ముగిసినా దాని నీడ ఎప్పడికి అదృశ్యం కాదు. వియత్నాంలో నేటికీ ల్యాండ్ మైన్‌లు మోగుతున్నాయి. PTSD (పోస్ట్ ట్రామాటిక్ స్ట్రెస్ డిసర్డర్) అనే మానసిక వ్యాధి యుద్ధ సైనికుల్లో 30% వరకు నమోదవుతుందని అమెరికన్ సైకాలజికల్ అసోసియేషన్ నిర్ధారించింది. హిరోషిమాపై బాంబు పడిన 75 సంవత్సరాల తర్వాత కూడా అక్కడ పుట్టే శిశువుల్లో జన్యు వ్యాధులు నమోదవుతూనే ఉన్నాయి. నేడు ప్రపంచంలో 10,000 కు పైగా అణ్వాయుధాలు సిద్ధంగా ఉన్నాయని SIPRI నిర్ధారించింది. ఒక్క అణుయుద్ధం జరిగితే వాతావరణం 'అణు శీతాకాలం'లో కూరుకుపోతుందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. ఇరవై ఒకటో శతాబ్దంలోనూ రష్యా–ఉక్రెయిన్, గాజా, సూడాన్, మధ్యప్రాచ్యం వంటి యుద్ధభూముల నుండి వస్తున్న దృశ్యాలు మనిషి హృదయాన్ని మూగబోయేలా చేస్తున్నాయి. చనిపోయిన వారిలో50% పైగా మహిళలు, పిల్లలే. వలసలు, కుటుంబం విచ్ఛిన్నం, పేదరికం యుద్ధం వదిలిపెట్టిన ఈ 'వారసత్వాలు' తరతరాలు వేధిస్తాయి. ఆల్బర్ట్ కామస్ అన్నట్లు, 'పీస్ ఈజ్ ది ఓన్లీ బ్యాటిల్ వర్త్ వేజింగ్'. ఒక దేశం నిర్మించడానికి వేల సంవత్సరాలు కావాలి. కానీ ఒక యుద్ధం అన్నింటినీ క్షణాల్లో ధ్వంసం చేయగలదు. క్షిపణులు, రసాయన ఆయుధాలు, అణుబాంబులు ఇవి శత్రువులను కాదు, మానవాళి మొత్తాన్ని ముప్పులో నెట్టివేస్తాయి. యుద్ధం సమస్యకు పరిష్కారం కానే కాదు, అది సమస్యనే. అందుకే శాంతి చర్చలే శాశ్వత పరిష్కారం. శాంతిని మన పిల్లలకు వారసత్వంగా అందిద్దాం.

గిలకత్తుల వెంకటరమణ గౌడ్
9866878769

# పెట్రోల్, డీజిల్ కొరత : వదంతులు వర్సెస్ వాస్తవాలు!

గత రెండు రోజులుగా సామాన్య ప్రజానీకాన్ని తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్న అంశం.. పెట్రోల్, డీజిల్, గ్యాస్ కొరత. ఉదయం లేచింది మొదలు రాత్రి పడుకునే వరకు సోషల్ మీడియాలో 'బంకులు మూతపడతాయి', 'స్టాక్ అయిపోయింది' అనే సందేశాలు విపరీతంగా చక్కర్లు కొడుతున్నాయి. ఈ క్రమంలో పెట్రోల్ బంకుల వద్ద కిలోమీటర్ల మేర కనిపిస్తున్న క్యూలు యుద్ధ వాతావరణాన్ని తలపిస్తున్నాయి. అయితే, ఈ ఆందోళనలో ఎంత నిజముంది? అసలు సమస్య ఎక్కడ మొదలైంది? అన్నది ఒకసారి పరిశీలిస్తే ఆసక్తికరమైన నిజాలు బయటపడతాయి.

**సోషల్ మీడియా సెగలు..భయపడుతున్న జనం**
సాధారణంగా ఏదైనా ఒక చిన్న నిరసన లేదా రవాణాలో అంతరాయం కలిగినప్పుడు, దానిని సోషల్ మీడియాలో భూతద్దంలో చూపిస్తున్నారు. 'రాబోయే వారమంతా పెట్రోల్ దొరకదు' అనే ఒక్క మెసేజ్ లక్షలాది మంది ఫోన్లకు చేరుతుండడంతో, ఒక్కసారిగా వాహనదారులు బంకుల వైపు పరుగులు తీస్తున్నారు. నిజానికి స్టాక్ ఉన్నప్పటికీ, అందరూ ఒకేసారి ట్యాంక్ ఫుల్ చేయించుకోవాలని చూడటంతో బంకుల్లో నిల్వలు వేగంగా తగ్గుతున్నాయి. దీనివల్ల నిత్యా వసర రవాణాకు కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

**కృత్రిమ కొరత.. మనమే సృష్టించుకుంటున్నామా?**
చమురు కంపెనీలు (IOCL, BPCL, HPCL) మరియు పౌరసరఫరాల శాఖ అధికారులు ఇస్తున్న సమాచారం ప్రకారం.. రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ నిల్వలు సరిపడా ఉన్నాయి. సరఫరా వ్యవస్థలో ఎక్కడా పెద్దగా ఆటంకాలు లేవు. 'ఒక బంకులో సాధారణంగా మూడు రోజులకు సరిపడా స్టాక్ ఉంటుంది. కానీ వదంతుల వల్ల అందరూ ఒకేసారి రావడం తో, మూడు రోజుల స్టాక్ కేవలం మూడు గంటల్లోనే అయిపోతోంది. దీనినే 'పానిక్ బయింగ్' (Panic Buying) అంటారు. దీనివల్ల ఏర్పడేది కృత్రిమ కొరత మాత్రమే తప్ప, ఇంధన కొరత కాదు.' అని పౌరసరఫరాల అధికారులతోపాటు పోలీసులు సైతం చెప్తున్నారు.

**వదంతులు నమ్మొద్దు – అధికారుల భరోసా**
రవాణారంగంలో కార్మికుల నిరసనలు ఉన్నప్పటికీ, వాటి ప్రభావం ఇంధన సరఫరాపై పడకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టింది. గ్యాస్ సిలిండర్ల విషయంలో కూడా ఎక్కడా కొరత లేదని, బుకింగ్ చేసుకున్న వారి కి యధావిధిగా డెలివరీ జరుగుతుందని గ్యాస్ ఏజెన్సీలు స్పష్టం చేస్తున్నాయి. పుకార్లు పుట్టించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరిస్తున్నారు. ప్రజలు గమనించాల్సిన విషయం ఏమిటంటే వాహనాల్లో ఇంధనం తక్కువగా ఉంటే తప్ప బంకులకు వెళ్లొద్దు. ముఖ్యంగా వాట్సాప్, ఫేస్‌బుక్ తదితర సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలలో వచ్చే ధృవీకరించని వార్తలను ఇతరులకు పంపకండి. ప్రభుత్వం లేదా చమురు కంపెనీల అధికారిక ప్రకటనలను మాత్రమే నమ్మండి. సమస్య సరఫరాలో లేదు.. మన భయంలో ఉంది. వదంతులను నమ్మకుండా సంయమనం పాటిస్తే, ఈ క్యూ లైన్లు మాయమవుతాయి. మన భయం వ్యాపారులకు లాభం కావచ్చు, కానీ సామాన్యుడికి మాత్రం సమ యం, డబ్బు వృధానే. కాబట్టి వాస్తవాలను గ్రహిద్దాం, ఆందోళనను వీడుదాం.

నమిండ్ల ప్రమోద్
6305638569

## 'డబుల్' ఇండ్ల పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలి



**ప్రజాపక్షం/యాదాద్రి కలెక్టరేట్** : జిల్లాలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో ఉన్న మౌళిక వసతుల పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం మినీ మీటింగ్ హాల్‌లో భువనగిరి మండలం లోని సింగన్నగూడెం, బీబీనగర్, వంగపల్లి, నారాయణపూర్, పోచంపల్లి, జిబిలకపల్లిలోని డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల మౌళిక వసతులపై జిల్లా కలెక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, హౌసింగ్ అధికారులతో కలసి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లడుతూ డబుల్ బెడ్, ఇందిరమ్మ ఇండ్ల పురోగతి పై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల వద్ద ఇంకా ఏఏ పనులు పెండింగ్‌లో ఉన్నాయని, ప్రస్తుతం జరుగుతున్న పనులను కూడా త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అన్ని పనులు పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేసేందుకు చర్యలు తీసుకోవాలని, ప్రతి ఇంటికి సంబంధించిన పనులను త్వరగా పూర్తిచేసి ఉపయోగంలోకి తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పి.డి శ్రీ రాములు, ఆర్ అండ్ బి అధికారి సరిత మరియు పిఆర్ ఈఈ దాసయ్య సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ కొరత లేదు

### జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకారెడ్డి



**ప్రజాపక్షం/యాదాద్రి కలెక్టరేట్** : జిల్లాలో పెట్రోల్, డీజిల్ , వంట గ్యాస్ (ఎన్‌పిజి) కొరత లేదు భయాందోళనలతో కొనుగోలు చేయవద్దని రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి జిల్లాలోని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గురువారం అదనపు కలెక్టర్ తన ఛాంబర్‌లో జిల్లాలోని సేల్స్ ఆఫీసర్స్ మరియు పెట్రోల్ బంకుల యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడ కూడా నో స్టాక్ బోర్డులు పెట్టకూడదని, ముందస్తు స్టాక్ బుకింగ్ చేసుకోవాలని, స్టాక్ 24 గంటలలో డెలివరీ చేయాలని సేల్స్ ఆఫీసర్లకు సూచించారు.పెట్రోల్ బంకులలో మౌలిక సదుపాయాలు ఉండాలని ఆదేశించారు. జిల్లాలో ఎక్క డా కూడా పెట్రోల్, డీజిల్ లేదా వంట గ్యాస్ (ఎన్‌పిజి) కొరత లేదని, ఆయిల్ రిఫైనరీల నుండి స్థానిక డిపోల వరకు ఇంధన సరఫరా యంత్రాం గం పూర్తిగా, సక్రమంగా పని చేస్తుందన్నారు. జిల్లా ప్రజల రోజువారీ అవసరాలను తీర్చడానికి సరిపడా ఇంధన నిల్వలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. భయం వల్ల ప్రజలు ఒక్కసారిగా ఎక్కువ ఇంధనం కొనుగోలు చేయడం వల్ల సాధారణం కంటే 2.5 నుండి 3 రెట్లు విక్రయాలు పెరిగాయన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఇంటింటికీ సిపిఐ

### సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు



**ప్రజాపక్షం/కోదాడ:** ప్రజా సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారం కోసం ఉద్యమాలు నిర్వహించటానికి ఇంటింటా సిపిఐ కార్యక్రమాన్ని ఏప్రిల్ 1వ తేదీ నుండి పదవ తేదీ వరకు నిర్వహిస్తున్నామని సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం కోదాడలోని నియోజకవర్గ స్థాయి సిపిఐ కౌన్సిల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశంలో ఎన్‌డిఎ పరిపాలనలో ప్రజలు అస్తవ్యస్తంగా ఉన్నారని, రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయడంలో వైఫల్యాలు జరుగుతున్నాయని వాటిని అమలు చేసే వరకు ప్రజల వెంట ఉండి ప్రజా సమస్యల పరి ష్కారం కోసం సమరశీల పోరాటాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తక్షణమే పేదలకు ఇల్లు, ఇండ్ల స్థలాలు ప్రభుత్వ స్థలాలలో వేసుకున్న గుడిసె వాసులకు పట్టాలు ఇవ్వాలని, వారికి ఐదు లక్షల వరకు ఇంటి నిర్మాణ కోసం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మేకల శ్రీనివాసరావు, ఎస్‌కె లతీఫ్, మండవ వెంకటేశ్వర్లు, బత్తినేని హనుమంతరావు, సాహెబల్లి, రాజు, వెంకటయ్య, రవి, పోతురాజు రాజేశ్వరరావు, కనకయ్య, పైడిమర్రి వెంకటనారాయణ, ఉప్పతల శ్రీనివాస్ పాల్గొన్నారు.

## బిఎల్‌ఓలకు శిక్షణ

**ప్రజాపక్షం/నూతనకల్ :** అర్హత కలిగిన ప్రతి పౌరుడు ఓటర్ జాబితాలో చేరేలా బిఎల్‌ఓలు చర్యలు తీసుకోవాలని తహశీల్దార్ శ్రీనివాసరావు కోరారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంపై బూత్ లెవల్ ఆఫీసర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రైనర్ ఓటరు జాబితా సవరణ ఇంటింటి సర్వే నిర్వహణ నూతన ఓటరు నమోదు వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, బిఎల్‌ఓలు పాల్గొన్నారు.

# చదువుతోనే కుటుంబాల అభివృద్ధి

### మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

### నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే నంబర్ వన్‌గా తీర్చిదిద్దుతా



**ప్రజాపక్షం/నల్లగొండ(కనగల్ ):** చదువు ద్వారానే కుటుంబాల అభివృద్ధి సాధ్యమవుతుందని, ప్రతి ఒక్కరూ తమ పిల్లలను తప్పనిసరిగా చదివించాలని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సూచించారు.గురువారం కనగల్ మండల కేంద్రంలో రూ.6 కోట్లతో నిర్మించనున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణానికి భూమిపూజ చేసి,కళ్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని,ప్రతి నియోజకవర్గంలో రూ. 200 కోట్ల రూపాయలతో అన్ని ఆధునిక సౌకర్యాలతో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాలలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను నిర్మిస్తున్నదని చెప్పారు.కనగల్ లో నిర్మిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల చుట్టుపక్కల గ్రామాల విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమని, రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యార్థుల మాదిరిగానే ఇంటర్ విద్యార్థులకు కూడా వచ్చే విద్యా సంవత్సరం నుండి ఉదయం అల్పాహారంతో పాటు, మధ్యాహ్న భోజనం అందించనుందని, అందువల్ల తప్పనిసరిగా పిల్లలను కళాశాలకు పంపించాలని ఆయన కోరారు. జిల్లా కేంద్రంలో 150 కోట్లతో ప్రభుత్వ వైద్య కళాశాలను నిర్మించామని,అలాగే నర్సింగ్ కళాశాల నిర్మాణం డిసెంబర్ లోపు పూర్తి చేస్తామని,చదువుకున్న నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడంలో భాగంగా 20 కోట్ల రూపాయలతో న్యాక్ బిల్డింగ్ నిర్మించి మొదటి అంతస్తు పూర్తి చేశామని,అక్కడ మహిళలకు కూడా శిక్షణ ఇస్తున్నామని,సెట్విన్ ద్వారా 2500 మంది మహిళలకు వివిధ రకాల శిక్షణ కార్యక్రమాలు ఇస్తున్నామని,అంతేకాక 80 కోట్ల రూపాయల వ్యయంతో ఏటీసీ కేంద్రాన్ని నిర్మించడం జరిగిందని, వీటన్నిటి ద్వారా చదువుకున్న యువత స్వయం ఉపాధి పొందవచ్చని మంత్రి తెలిపారు. కనగల్ మండల అభివృద్ధికి తన వంతు కృషి ఎల్లప్పుడూ ఉంటుందని, 8 కోట్ల రూపాయలతో పునుగోడు లిఫ్ట్ ఇరిగేషన్, కాంచనపల్లి, రేగట్ట లిఫ్ట్ ఇరిగేషన్లు చేపట్టడం జరిగిందని మొత్తం 50 కోట్ల రూపాయలతో మూడు లిఫ్ట్ ఇరిగేషన్లు ఏర్పాటు చేస్తున్నారు. నల్లగొండ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి రాష్ట్రంలోనే నంబర్1గా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి సభ్యులు శంకర్ నాయక్, జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్,ఆర్‌డిఓ అశోక్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ రమేష్,జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి దశ్రు నాయక్,అధికారులు,ప్రజాప్రతినిధులు స్థానికులు పాల్గొన్నారు.

# మున్సిపల్ బడ్జెట్ ఆమోదం

### రూ.76.88 కోట్లతో

### పట్టణాభివృద్ధికి రాజకీయాలకు అతీతంగా సహకరించాలి

### ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి




**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మిర్యాలగూడ మున్సిపాలిటీలో 2026/27 ఆర్థిక సంవత్సరానికి గాను ప్రవేశపెట్టిన బడ్జెట్ ఆమోదం తెలిపింది. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మొదటి బడ్జెట్ ప్రవేశపెట్టగా సభ్యులు ఆమోదం తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.79.70కోట్ల వ్యయం అంచనా చేశారు. పన్నులు రూ.16.92కోట్లు, పన్నేతర ఆదాయం రూ.9.20కోట్లు, గ్రాంట్లు రూ.48.56కోట్లు, డిపాజిట్లు, అప్పుల రూపంలో రూ.2.20కోట్లు చూపించారు. మొత్తంగా రూ.76.88 కోట్లు ఆదాయం అంచనా బడ్జెట్ రూపొందించగా ఈ ఆర్థిక సంవత్సరంలో చార్జెడ్ వ్యయం రూ.20.25కోట్లు ఇతర నిర్వహణ వ్యయం రూ.48.8కోట్లు డిపాజిట్ అడ్వాన్స్‌లు రూ.2.20కోట్లు మున్సిపల్ పన్ను నుంచి అభివృద్ధి పనులు రూ.3.81కోట్లు రూపంలో మొత్తంగా రూ.79.70కోట్లు వ్యయంగా చూపించారు. మున్సిపాలిటికి వచ్చే ఆదాయం నుంచి జీతాలు, పొరుగు సేవలు ఉద్యోగాల జీతాలు, వారు సిద్ధ నిర్వహణ కరెంట్ బిల్లులు, రుణ వాయిదాల చెల్లింపు, పది శాతం నిధులతో హరిత హారం పనులకు కేటాయించారు. అదేవిధంగా మున్సిపల్ సొంత నిధులు నుంచి 1/3 వంతు నిధులను పురపాలక సంఘంలో విలీనమైన ప్రాంతాలు, అభివృద్ధిచెందని ప్రాంతాలు, బలహీనవర్గాల ప్రజలు నివసించే ప్రాంతాలు, మైనార్టీ ప్రజలు నివసించే ప్రాంతాల్లో, మురికివాడల్లో మౌలిక వసతులు కల్పన కోసం బడ్జెట్ కేటాయింపులు చేశారు. మిగిలిన మరుగుదొడ్ల నిర్మాణం సమీకృత సంతల అభివృద్ధి, జంతువధశాలల నిర్మాణం శాస్త్రీయ పద్ధతిలో డంప్‌యార్డ్‌ల నిర్వహణ, వివిధ వార్డుల్లో అభివృద్ధి పనులకే కేటాయింపులు చేశారు. ఈ ఆర్థిక సంవత్సరానికి గాను ఆదాయ వ్యయాలను క్లుప్తంగా వివరించారు. ఆ తరువాత సాధారణ సమావేశం నిర్వహించి 23 అంశాలను ఎజెండాను సభ్యుల ముందు ఉంచగా సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఇందులో ప్రధానంగా స్థానిక ఎన్‌టీఆర్ మున్సిపల్ కాంప్లెక్స్‌లో ఉన్న 180షాపులకు బహిరంగ వేలం నిర్వహించడానికి సభ్యులు ఆమోదం తెలిపారు. ప్రస్తుత వేసవి కాలం దృష్ట్యా పట్టణంలో నీటి ఎద్దడి లేకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వాటర్ సప్లయ్ మెయింటెనెన్స్, వివిధ వార్డుల్లో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా కోసం తీసుకోవాల్సిన చర్యలపై సమావేశం ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ పట్టణాభివృద్ధికి రాజకీయాల కతీతంగా సహకరించాలన్నారు. అన్ని రంగాల్లో పట్టణాన్ని అభివృద్ధి చేసి జిల్లాలోని మున్సిపాలిటీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలన్నారు. పట్టణాభివృద్ధి కోసం కౌన్సిలర్లు తమవంతు కృషి చేయాలన్నారు. మున్సిపల్ చైర్ పర్సన్ చిలుకూరి సుధాబాలకృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గుడిపాటి శిరీషనవీన్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, మున్సిపల్ ఇంజనీర్ వెంకన్న, ట్రాన్స్‌కో డీఈ శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



## ఇంట్లో ఒకే చోట 90పాము పిల్లల కలకలం

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** సూర్యాపేట పట్టణంలోని 9వ వార్డు బిసి కాలనీలో యాతాకుల మధు ఇంట్లోని బాత్‌రూంలో ఒక్కసారిగా 90కి పైగా పాము పిల్లలు బయటపడ్డాయి. దీంతో కుటుంబ సభ్యులు భయాం దోళనకు గురై స్థానికులను అప్రమత్తం చేయగా స్థానికులు పాము పిల్లలను తొలగించారు. ఒకేసారి ఇంత పెద్ద సంఖ్యలో పాము పిల్లలు కనిపించ దంతో పట్టణంలో చర్చనీయాంశమైంది. చుట్టు పక్కన ఉన్న ఖాళీ స్థలాల్లో చెట్లు, చెత్తచెదారం, పొదలు పెరగడం వల్లే పాములు పెరిగి ఈ పరిస్థితి ఏర్పడిందని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఖాళీ స్థల యజమానులపై చర్యలు తీసుకొని వాటిని శుభ్రం చేపించాలని కోరారు.

## భూ వివాదం ముదిరి రాళ్ల దాడులు





**ప్రజాపక్షం/నాంపల్లి:** మండలంలోని మల్లపురాజుపల్లి గ్రామంలో భూ వివాదం కారణంగా ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది.ఈ ఘటనలో పలువురికి గాయాలయ్యాయి.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం,గ్రామానికి చెందిన పంగ చిన ముత్తయ్య ట్రాక్టర్‌తో తన పొలాన్ని దున్నుతుండగా,అదే గ్రామానికి చెందిన సర్పంచ్ మంటిపల్లి మణిమాల భర్త శ్రీశైలం దంపతులు అతనితో వివాదానికి దిగారు.ఈక్రమంలో మాటల తగాదా తీవ్రమై రాళ్లతో దాడికి దారి తీసింది.దీంతో ముత్తయ్య కూడా ట్రాక్టర్‌ను ఆపి ప్రతిగా దాడి చేయగా,ఇరువర్గాల మధ్య ఘర్షణ తీవ్రరూపం దాల్చింది. ఈ ఘటనలో ఇరువురికి గాయాలయ్యాయి.గాయపడిన వారు ఆసుపత్రి లో చికిత్స పొందుతున్నారు.ఈ విషయమై ఇరువర్గాల కుటుంబ సభ్యులు నాంపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్ఐ కే.లింగారెడ్డి సంఘటన స్థలాన్ని పరిశీలించి ఇరువర్గాలపై కేసు లు న మోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు.

## త్వరగా సాదాబైనామా, భూభారతి దరఖాస్తుల పరిష్కారం

### సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్** : జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాదా బైనామా, భూభారతి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టరేట్ లోని విసి హాల్ నందు జిల్లాలోని ఆర్‌డిఓలు, తహశీల్దార్‌లతో పెండింగ్ సాదాబైనామా, భూభారతి, భూ సమస్యలపై వెబెక్స్ ద్వారా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలుదారు, అమ్మకం దారు ఇద్దరి నుంచి అఫిడవిట్ తీసుకోవాలన్న నిబంధనతో క్షేత్రస్థాయిలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం కొనుగోలుదారు నుంచి మాత్రమే అఫిడవిట్ తీసుకునేలా జిఓ 76ను జారీ చేసినట్లు తెలిపారు. సాదా బైనామా ద్వారా భూములు అమ్ముకునే సమయంలో అమ్మే వ్యక్తి రికార్డు నందు నమోదు కలిగి ఉండాలని, అదేవిధంగా పట్టా భూములను మాత్రమే ప్రాసెస్ చేయాలని సూచించారు. వీటితోపాటు భూమి మీద పొజిషన్‌తోపాటు, 5 ఎకరాల లోపు భూములు కలిగి ఉన్న వారికి మాత్రమే పరిష్కరించాలన్నారు. నోటీస్ జారీ చేసి 30 రోజులు పూర్తి అయిన వాటిని పరిష్కరించాలని, క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి పంచనామా చేయాలని తెలిపారు. చాలానా కట్టే ముందు ఒకటికి రెండు సార్లు తనిఖీ చేసి స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు సరిచేసుకోవాలని ఆదేశించారు. సాదాబైనామా దరఖాస్తులకు పరిష్కారం తొందరగా పూర్తి చేసి అర్హులైన వారికి 13(బి) పట్టాలను జారీ చేయాలని తెలిపారు. భూభారతి పెండింగ్ దరఖాస్తులను 15 రోజుల్లో పరిష్కారం చూపాలని, అలాగే కోర్టు కేసులు, హైకోర్టులో నమోదైన కేసులకు విధిగా జవాబు ఇవ్వాలన్నారు. అదేవిధంగా స్లాబ్స్ బుకింగ్ క్యాన్సిల్ చేసుకున్న వారికి రీపేమెంట్ అయ్యే విధంగా చర్యలు చేపట్టాలని సంబంధిత తహశీల్దార్లను ఆదేశించారు. స్పెషల్ ఇంటెన్సివ్ కింద ఎలక్షన్ మ్యాపింగ్ ఎంట్రీ త్వరగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. ఫారం 6, 7, 8 పెండింగ్ లేకుండా చూడాలని, అదే విధంగా మరణించిన ఓటర్లను జాబితా నుండి తొలగించాలని చెప్పారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కె సీతారామారావు, కలెక్టరేట్ పరిపాలన అధికారి సుదర్శన్ రెడ్డి, సూపరింటెండెంట్లు సాయిగౌడ్, శ్రీలత, సంతోష్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## వేగంగా జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణ పనులు




**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు.గురువారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులతో ప్రాజెక్టుల భూసేకరణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉదయ సముద్రం,మాధ ఎడవల్లి,శివన్నగూడెం,అంబ భవాని,డిండి,నక్కలగండి, ఏకేబియర్, పెండ్లిపాకల చింతచెట్టు తండా తదితర సాగునీటి మరియు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులకు సంబంధించిన పెండింగ్‌లో ఉన్న భూసేకరణ పనులను తక్షణమే పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ప్రాజెక్టుల వారీగా పురోగతిని సమీక్షిస్తూ భూసేకరణ, పునరావాసం (ఆర్‌ఆర్),పరిహారం చెల్లింపుల అంశాల్లో ఎలాంటి ఆలస్యం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆర్‌ఆర్ కాలనీల్లో మౌలిక వసతులు పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయాలని ఆదేశించారు. విభాగాల మధ్య సమన్వయం పెంపొందించి పనులను వేగవంతం చేయాలని సూచించారు.ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్,మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై.అశోక్ రెడ్డి,ఆర్‌డిఓలు శ్రీదేవి,రమణారెడ్డి పాల్గొన్నారు.

# పేదల అభ్యున్నతికి ధర్మభిక్షం సేవలు వెలకట్టలేనివి

### 15వ వర్ధంతి వేడుకలలో వక్తలు







**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణ పురం** : యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో మాజీ ఎంపీ బొమ్మగాని ధర్మభిక్షం 15వ వర్ధంతిని ఆయన విగ్రహానికి సీపీఐ, గీత పనివారల సంఘాల ఆధ్వర్యంలో పూలమాలలు వేసి వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బచ్చనగోని గాలయ్య మాట్లాడుతూ సూర్యాపేట జిల్లాకు ధర్మ భిక్షం పేరు పెట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్, సిపిఐ జిల్లా సమితి సభ్యులు చిలివేరు అంజయ్య, కలకొండ సంజీవ, గీత వారల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పందుల యాదగిరి, సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు సురవి నరసింహ, వీరమల్ల యాదయ్య, సిపిఐ పట్టణ కార్యదర్శి మల్లారెడ్డి, సర్పంచ్ అంజయ్య,పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/చౌటుప్పల్** : మండల కేంద్రంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు మాజీ ఎంపీ బొమ్మగాని ధర్మభిక్షం 15 వర్ధంతిని సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పల్లె శేఖర్ రెడ్డి మాట్లాడుతూ ధర్మ భిక్షం జీవితం ప్రజాసేవకు అంకితం చేశారని, ఆయన చేసిన పోరాటాలు చిరస్మరణీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మున్సిపల్ కార్యదర్శి పగిళ్ల మోహన్ రెడ్డి, ఉడత రామలింగం, కొండూరు విప్లవ్, బద్దుల సుధాకర్, టంగుటూరి రాములు, రొండి నరసింహ, నీళ్ల బిక్షపతి, రోశన్న గారి అంజయ్య, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట** : అమరజీవి బొమ్మగాని ధర్మభిక్షం 15వ వర్ధంతి పట్టణంలో గుండ్లపల్లి గౌడ సొసైటీలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన యాదగిరిగుట్ట మున్సిపల్ చైర్మన్ గుండ్లపల్లి వాణి భరత్ గౌడ్ వారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మహిళా సమైక్య జిల్లా ప్రధాన కార్యదర్శి బండి జంగమ్మ, బీసీ హక్కుల సాధన సమితి జిల్లా అధ్యక్షులు కళ్ళెం కృష్ణ, యువజన సమైక్య జిల్లా కార్యదర్శి పేరబోయిన మహేందర్, యాదగిరిగుట్ట మున్సిపల్ కౌన్సిలర్ బబ్బురి శ్రీధర్, కో ఆప్షన్ సభ్యులు మాజీ పేరబోయిన పెంటయ్య, సిపిఐ మండల కార్యదర్శి కల్లపెల్లి మహేందర్ పాల్గొన్నారు.




**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పేదల అభివృద్ధికి తెలంగాణ సాయుధ పోరాట యోధులు, మాజీ పార్లమెంట్ సభ్యులు బొమ్మగాని ధర్మభిక్షం చేసిన సేవలు వెలకట్టలేనివని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు అన్నారు. ధర్మభిక్షం 15వ వర్ధంతి వేడుకలను గురువారం యాద్గార్‌పల్లి గ్రామంలో నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు గువ్వల అంజయ్య, బంటు వెంకటయ్య, సైదులు, హనుమంతు, దుండిగల వినయ్, సైదులు, లక్ష్మ మ్మ, రాములమ్మ, గోవిదమ్మ, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/చిట్యాల:** నల్లగొండ జిల్లా చిట్యాల మున్సిపాలిటి కేంద్రంలో అఖిల భారత గీతపనివారల సంఘ వ్యవస్థాపకులు, మాజీ పార్లమెంట్ సభ్యులు బొమ్మగాని ధర్మభిక్షం వర్ధంతిని పురస్కరించుకుని గురువారం సిపిఐ నాయకులు ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు. నివాళులు అర్పించిన వారిలో గీత పనివారల సంఘం మండల కార్యదర్శి దేశగాని బాలరాజు, సిపిఐ మండల కార్యదర్శి ఎండి అక్బర్, సహాయ కార్యదర్శి జిల్లా సత్యం, షేక్ షరీఫ్, బొలుగూరి లింగయ్య, గుండాల సత్తయ్య పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/మునుగోడు:** మాజీ పార్లమెంట్ సభ్యుడు బొమ్మగాని ధర్మభిక్షం ఆశయాలను సాధించాలని సిపిఐ రైతు సంఘం జిల్లా కార్యదర్శి గురజ రామచంద్రం అన్నారు. గురువారం ధర్మభిక్షం 15వ వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బులుగురి నరసింహ,ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి తీర్పారి వెంకటేశ్వర్లు,జిల్లా సమితి సభ్యులు సురిగి చలపతి,మండల కార్యదర్శి చాపల శ్రీను,ఈదులకంటి కైలాష్,కట్కూరి లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.



## అమ్మవారికి అష్టమిరోజు అలంకరణ

ప్రజాపక్షం/చార్మినార్: నవమి పూజలను పురస్కరించుకుని చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారిని అందంగా అలంకరించారు. ఆలయంతో పాటు పరిసరాలను పువ్వులతో అలంకరించడం జరిగింది. అష్టమి రోజు ప్రత్యేక అలంకరణలో భాగ్యలక్ష్మి అమ్మవారు భక్తులకు దర్శనం ఇచ్చారు. భాగ్య లక్ష్మి అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేశారు.

## 29న టిడిపి ఆవిర్భావ ఉత్సవాలు



ప్రజాపక్షం/ముషీరాబాద్: ఈనెల 29న తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవ ఉత్సవం నిర్వహిస్తున్నట్లు తెలుగుతమ్ముళ్లు ప్రకటించారు. దోమల్‌గూడలోని టిడిపి హైదరాబాద్ జిల్లా పార్టీ కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు పార్టీ పతాక ఆవిష్కరణ, ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు, కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని.. అనంతరం పొలిట్ బ్యూరో అరవింద్‌కుమార్‌గౌడ్ పారిశుధ్య కార్మికులకు వస్త్రాల పంపిణీ చేస్తారని సికింద్రాబాద్ పార్లమెంటు నాయకులు నల్లెల్ల కిషోర్, పి.బాలరాజ్‌గౌడ్ తెలిపారు. పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో టిటిడిపి నేతలు శ్యామ్ సుందర్, తడక వినోద్, కరణం కిరణ్, భానుప్రకాష్, ఎస్.ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

## మెరుగైన పరిహారం అందించాలి

-కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్



ప్రజాపక్షం/కంటోన్మెంట్: ఎలివేటెడ్ కారిడార్ల భూ నిర్వాసితులకు మెరుగైన పరిహారం ఇవ్వాలని అసెంబ్లీలో కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ ప్రభుత్వాన్ని కోరడం జరిగింది. హైదరాబాద్ నగరంతో ఉత్తర తెలంగాణకు మెరుగైన అనుసంధానం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్యారడైజ్ నుంచి బోయిన్‌పల్లి, జెబియస్ నుంచి శామీర్‌పేట్ వరకు ప్రతిష్టాత్మకంగా ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణాలను నిర్మించాలని నిర్ణఇంచిన నేపథ్యంలో.. ఎమ్మెల్యే శ్రీగణేష్ అసెంబ్లీలో మాట్లాడుతూ.. కంటోన్మెంట్, మల్కాజ్‌గిరి, మేడ్చల్ నియోజకవర్గాల ప్రజల తరపున ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. అయితే కారడార్ల నిర్మాణం కోసం తమ భూమిని త్యాగం చేస్తున్న భూ నిర్వాసితులకు ప్రభుత్వం మెరుగైన పరిహారం అందించాలని, రహదార్లను ఎన్ని అడుగుల మేర విస్తరిస్తున్నారో అవగాహన లేక అపోహలకు గురవుతున్నారని, అధికారులు భూ నిర్వాసితులతో సమావేశమై వారి అపోహలను తొలగించాలని ప్రభుత్వానికి స్పీకర్ ద్వారా విజ్ఞప్తి చేశారు.

## ఐస్‌క్రీం తయారీ కేంద్రంపై దాడులు

ప్రజాపక్షం/ముషీరాబాద్: గడువు ముగిసిన..కల్తీ ఐస్ క్రీం తయారీ కేంద్రంపై టాస్క్‌ఫోర్స్ దాడులు జరిపి ఒకరిని అరెస్ట్ చేయడం జరిగింది. విశ్వసనీయ సమాచారం మేరకు, టాస్క్‌ఫోర్స్(ఖైరతాబాద్, సికింద్రాబాద్ జోన్ బృందాలు) హెచ్‌ఫాస్ట్ టీమ్, జిహెచ్‌ఎంసి ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ (సర్కిల్ నెం40) సాహితీతో కలిసి సంయుక్తంగా ముషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బాపూజీనగర్‌లో బ్లూ బెల్స్ ఐస్ క్రీం తయారీ కేంద్రంపై ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఎటువంటి చెల్లుబాటు అయ్యే లైసెన్స్ లేకుండా, అత్యంత అపరిశుభ్ర వాతావరణంలో, గడువు ముగిసిన ముడి పదార్థాలతో ఐస్ క్రీంలు తయారు చేస్తున్న పట్టాల అశోక్ అనే వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ఆపరేషన్లో ఖైరతాబాద్ జోన్ టాస్క్‌ఫోర్స్ సీఐ పి.రాఘవేందర్, సికింద్రాబాద్ జోన్ టాస్క్‌ఫోర్స్ సీఐ జె.రాజశేఖర్, ఎస్ఐ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## రెడ్డి కార్పొరేషన్ పాలకవర్గం ప్రకటించాలి

-రెడ్డి సంఘాల నేతలు డిమాండ్

ప్రజాపక్షం/రాంగోపాల్‌పేట్: తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నర ఏండ్లు పూర్తయినా.. రెడ్డి కార్పొరేషన్ పాలకవర్గం ఏర్పాటు చేయలేదని తెలంగాణ రెడ్డి సంఘాల నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు సికింద్రాబాద్ కరణ్ సెంటర్ కార్యాలయంలో ఏర్పాటైన సమావేశంలో రాష్ట్ర రెడ్డి సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రెడ్డి కార్పొరేషన్‌కి వెంటనే పాలకవర్గాన్ని ఏర్పాటు చేయాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ.ఐదు వేల కోట్ల నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ తమ ఎన్నికల మేనిఫెస్టోలో రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిందన్నారు. రెండున్నర సంవత్సరాలు దాటినా హామీ అమలుకు నోచుకోకపోవడంతో తాము సమావేశం కావాల్సి వచ్చిందన్నారు. 15 రోజుల్లో కార్పొరేషన్ ఏర్పాటు చేసి నిధులు మంజూరు చేయాలనీ, లేదంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని రెడ్డి జేఏసీ, రెడ్డి ఐక్యవేదిక, రెడ్డి సంఘం తెలంగాణ, రెడ్డి జాగృతి తదితర సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు అప్పమ్మ గారి రామిరెడ్డి, ఏనుగు సంతోష్‌రెడ్డి, గోపు జైపాల్‌రెడ్డి, బుట్టెంగారి మాధవరెడ్డి, పైళ్ల హరినాథ్‌రెడ్డి, చందుపట్ల నరసింహారెడ్డి, ఎలిమినేటి సుమన్‌రెడ్డి, చినుకుల నరసింహారెడ్డి, ఏ.కిషన్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, సామల శ్రీధర్‌రెడ్డి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. గాయత్రినగర్ కోదండ రామాలయంలో



## నేడు సీతారామ కల్యాణం

ప్రజాపక్షం/హైదరాబాద్ : హైదరాబాద్ జిల్లెలగూడ న్యూ గాయత్రి నగర్‌లో కొలువై ఉన్న శ్రీ కోదండ రామాలయంలో శ్రీరామనవమి సందర్భంగా శుక్రవారం సీతారామ కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు బెలిదె హనుమంతరావు, ఈమని మల్లికార్జునరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. శ్రీ రామనవమి సందర్భంగా శుక్రవారం ఉదయం ఆలయంలో అఖండ నామము, సుప్రభాతసేవ, మూల విరాట్లకు, ఉత్సవ మూర్తులకు పంచామృతాలతో అభిషేకం, మంగళస్నానం, సహస్రనామార్చన నిర్వహించనున్నట్లు చెప్పారు. అనంతరం ఉదయం 10 గంటలకు శ్రీ సీతారామ కళ్యాణ మహోత్సవం, మధ్యాహ్నం ఒంటిగంటకు అన్నప్రసాద వితరణ, సాయంత్రం 6.30 గంటలకు పల్లకీ సేవ ఉంటుందని వివరించారు. భక్తులు ఈ కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని వారు కోరారు. గత తొమ్మిది రోజులుగా ఆలయంలో జరిగిన రామనవమి వసంత నవరాత్రి ఉత్సవాలలో ఈమని రత్నమాల చేసిన భాగవత, రామాయణ ప్రవచనాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

# సినీ దర్శకుడికి రూ.కోట్లలో టోకరా

నకిలీ పత్రాలతో భూ కుంభకోణం
దర్యాప్తు చేస్తున్న సిసిఎస్ పోలీసులు



ప్రజాపక్షం/హైదరాబాద్:నకిలీ భూ పత్రాలను చూపించి రూ.కోట్లు దోచుకున్న భారీ భూకుంభకోణం వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనపై సినీ దర్శకుడు వైట్ల శ్రీనివాసరావు హైదరాబాద్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సిసిఎస్) పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు వివరాల ప్రకారం, 2019 జనవరి చివర్లో భూముల్లో పెట్టుబడులు పెట్టాలనే ఉద్దేశంతో ఉన్న సమయంలో కొందరు వ్యక్తులు కలిసి వికారాబాద్ జిల్లా పూడూర్ మండలం కడ్మూర్ గ్రామంలోని 12 ఎకరాల పొడి వ్యవసాయ భూములను అమ్మేందుకు ముందుకు వచ్చారు. తాము ఆ భూముల నిజమైన యజమానులమని నమ్మబలికే విధంగా నకిలీ పత్రాలు చూపించి, మోసపూరితంగా కొనుగోలు చేయించారు.ఈ క్రమంలో, వివిధ సర్వే నంబర్లలో ఉన్న సుమారు పలు ఎకరాల భూమిని కొనుగోలు చేసినట్లు బాధితుడు తన ఫిర్యాదులో పేర్కొన్నారు. మొత్తం రూ.80 లక్షలకు పైగా చెక్కుల ద్వారా చెల్లించినట్లు ఫిర్యాదులో వెల్లడించారు. సంబంధిత భూముల కోసం విక్రేతలు రిజిస్టర్డ్ సేల్ డీడ్లు కూడా చేసుకున్నారని తెలిపారు. ఇందుకోసం శ్రీనువైట్ల సుమారు రూ.3 కోట్ల వరకు చెల్లించాడు. అయితే, 2025 జూన్ 23న వికారాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి నోటీసు అందడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. విచారణలో భాగంగా ఆ భూముల్లో కొంత భాగం అసలు విక్రేతల సొంతం కాదని, భూ రికార్డులు మార్పిడి చేసి మోసం చేసినట్లు బయటపడింది. ఇంకా, ఈ భూముల విషయంలో పి.అంజయ్య, పి.యాదయ్యలు హైకోర్టును ఆశ్రయించినట్లు కూడా ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో ఈ వ్యవహారం పెద్ద మోసంగా మారినట్లు స్పష్టమైంది. ఈ ఘటనపై సిసిఎస్ పోలీసులు నకిలీ పత్రాలను సృష్టించి భూమిని అక్రమంగా విక్రయించిన జి.ప్రభాకర్ రెడ్డి,మంచన్‌పల్లి ఆనందం, బండారు ఆగిరెడ్డి,దేవర వెంకటరెడ్డి,బండారు శ్రీనివాస్ రెడ్డి,సాదారిగారి జంగారెడ్డి,మంచన పల్లి మైసమ్మ, కసిరెడ్డి మహేశ్వర్‌రెడ్డి,కడ్మూర్ సుశీల, మంచనపల్లి రామచంద్రయ్య, జెట్టిగారి సుధాకర్‌రెడ్డి,కావలి కృష్ణలపై పలు సెక్షన్‌ల కింద కేసు నమోదు చేశారు.సిసిఎస్ ఆర్థిక నేరాల విభాగం ఇన్‌స్పెక్టర్ మాగంటి వెంకటరామయ్య కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## ఆన్‌లైన్ గేమింగ్ గ్యాంగ్ అరెస్ట్

ప్రజాపక్షం/సిటీబ్యూరో: ఆన్‌లైన్ గేమింగ్.. బెట్టింగ్ మోసాలకు పాల్పడుతున్న భారీ ఆర్థిక నెట్‌వర్క్ గుట్టురట్టయ్యింది. హైదరాబాద్ సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు నలుగురు ప్రధాన నిందితులను అరెస్ట్ చేసి వారి ద్వారా రూ.26.07 కోట్ల మేరకు లావాదేవీలు జరిపినట్లు గుర్తించారు. వివరాలలోకి వెళితే.. హైదరాబాద్‌కు చెందిన 24 ఏళ్ల యువతి, ఇన్‌స్టాగ్రామ్‌కు వచ్చిన ఒక ప్రకటనను చూసి సుమారు రూ.30 లక్షలు నష్టపోయినట్లు ఫిర్యాదు చేశారు. వాట్సాప్ ద్వారా ఆమెను ఓ గేమింగ్/కాసినో ప్లాట్ఫామ్‌కి ఆహ్వానించి, ప్రారంభంలో బోనస్‌లు, నగదు ఉపసంహరణలు సులభంగా అయ్యేలా చేసి నమ్మకం కలిగించారు. అది నిజమైన సైట్ అని నమ్మిన బాధితురాలు, తన బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎస్‌బిఐ, ఇండియన్ బ్యాంక్ ఖాతాల నుంచి పలు యూపీఐ లావాదేవీల ద్వారా భారీ మొత్తంలో నగదు డిపాజిట్ చేశారు. వరుసగా నష్టపోతున్నప్పటికీ, కుటుంబ అప్పులు తీర్చాలనే ఆర్థిక అవసరం రీత్యా ఆమె మరింతగా ఆ ఉచ్చులో చిక్కుకుని, వారు సూచించిన వివిధ యూపీఐ ఐడీలకు నిరంతరం నగదు పంపారు. చివరకు, ఈ అనుమానాస్పద లావాదేవీల కారణంగా తన బ్యాంక్ ఖాతాలు ఫ్రీజ్ అయ్యాయని, లీన్ మార్క్ చేయడం జరిగిందని ఆమె గుర్తించారు. ఫిర్యాదు మేరకు నిందితులు రాజేష్ వెంకట రామన్,భమిడిపాటి అభిషేక్,అగస్టిన్ విలియమ్స్, మన్మీత్ శర్మ @ సోనియా తదితరులను అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసును ఇన్‌స్పెక్టర్ పి.శివ చంద్ర నేతృత్వంలోని బృందం ఛేదించింది. ఇందులో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ సిహెచ్ ప్రవీణ్, ఎస్ఐ ఎ.ఉమ, హెచ్‌సి సునీల్, పిసిలు భాస్కర్, గణేష్, సందీప్, విజయ్ కుమార్, మనీష్ కుమార్, డబ్ల్యూపిసి ధరణి, ఆర్‌పిసి శివ కుమార్ సభ్యులుగా ఉన్నారు.

# దర్యాప్తు పేరిట వేధింపులొద్దు


పౌరహక్కుల సంఘం
నేతల డిమాడ్



ప్రజాపక్షం/సోమాజిగూడ:రాష్ట్రంలోని మేధావులను, కవులను, రచయితలను, ప్రజా సంఘాల నేతలను ద ర్యాప్తు పేరిట జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) వేధింపులకు గురిచేయడం ఆపాలని పౌరహక్కుల సంఘం తెలంగాణ నేతలు డిమాండ్ చేశారు. గురువారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో సంఘం సీనియర్ నేత ప్రొ.హరగోపాల్, రాష్ట్ర అధ్యక్షులు ప్రొ.గడ్డం లక్ష్మ ణ్, ప్రధాన కార్యదర్శి ఎన్.నారాయణరావు మాట్లాడారు. 2025 సెప్టెంబర్‌లో మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు కడారి సత్యనారాయణరెడ్డి, ఖాతా రామచంద్రారెడ్డిలను చత్తీస్‌గఢ్ రాయ్‌పూర్‌లో నిరాయుధంగా పట్టుకొని చత్తీస్‌గఢ్ అడవుల్లో కాల్చి చంపారని ఆరోపించారు. 2025 అక్టోబర్ 25న రామచంద్రారెడ్డి సొంత ఊరైన పెద్దపల్లి జిల్లా తీగలకుంటపల్లిలో జరిగిన అంత్యక్రియలు జరిగాయన్నారు. రామచంద్రారెడ్డి శవం పురుగులు పడటం చూసి ఇన్నయ్య చేసిన భావోద్వేగ ప్రసంగం ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్నదని ఆరోపిస్తూ ఎన్ఐఎ ఆయన మీద ఉపా కేసు పెట్టి, జైలులో నిర్బంధించిందన్నారు. కేసు దర్యాప్తు లో భాగంగా చాలా మంది మేధావులకు నోటీసులిచ్చిందని తెలిపారు. ప్రజా సంఘాల నేతలను జైలులో నిర్బంధించి వారి వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగించడం తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. గాదె ఇన్నయ్యను వెంటనే విడుదల చేయాలని కోరారు. ఢిల్లీ విద్యార్థులపైన బనాయించిన అక్రమ కేసులను ఎత్తేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రామచంద్రారెడ్డి సతీమణి భారతి, కొడుకు రాజా తదితరులు పాల్గొన్నారు.

# నిధుల విడుదలకు కృషి చేయండి

సిపిఐ శాసనసభ పక్ష నేత
కూనంనేని సాంబశివరావుకు వినతి



ప్రజాపక్షం/సికింద్రాబాద్: నిధుల కొరతతో పునాదిలోనే ఆగిపోయినసీతాఫల్‌మండి విద్యాసంస్థల భవన నిర్మాణం కోసం కేటాయించిన రూ.30 కోట్ల నిధులను తక్షణమే విడుదల చేసేలా అసెంబ్లీలో చర్చించి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరుతూ సిపిఐ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు చైతన్య యాదవ్, అనిల్ తదితరులు సిపిఐ శాసనసభా పక్ష నేత కూనంనేని సాంబశివరావును కలిసి విన్నవించారు. పాఠశాల, కళాశాలల విద్యార్థులకు ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో ఇక్కడ మూడు విద్యా సంస్థలకు కలిపి అధునాతన భారీ భవనాన్ని నిర్మించేందుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారని... ప్రభుత్వం మారడంతో నిధుల కొరతతో నిధుల విడుదల ఆగిపోవడంతో రెండేళ్లుగా పునాది రాళ్లకే విద్యాసంస్థల భవన నిర్మాణంనెలకొందని కూనంనేనిని కలిసి వారు ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులు, అధ్యాపకులకు అన్నీ అవే గదులు ఉండటంతో గందరగోళ పరిస్థితులు నెలకొంటున్నాయని.. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని విద్యాసంస్థల భవన నిర్మాణానికి కేటాయించిన నిధులను తక్షణమే విడుదల చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి చేయాలని కోరారు. విషయాలను సావధానంగా విన్న నేత కూనంనేని సాంబశివరావు సానుకూలంగా స్పందించి తప్పకుండా అసెంబ్లీలో మాట్లాడుతానని.. నిధుల విడుదలకై కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కూనంనేనిని కలిసిన వారిలో సిపిఐ నాయకులు సయ్యద్ గౌస్, హరినాథ్‌రావు, ఏఐఎస్ఎఫ్ నాయకులు జోసెఫ్, భాను తదితరులు పాల్గొన్నారు.

## నేడు మద్యం దుకాణాలు మూసివేత

ప్రజాపక్షం/ఫలక్‌నుమా: శ్రీరామనవమి సందర్భంగా వైన్ షాపులు మూసివేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నగరంలో శోభయాత్ర నిర్వహిస్తుండటంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఈ నిర్ణయం తీసుకున్నారు. శ్రీరామనవమి సందర్భంగా పెద్ద ఎత్తున శోభయాత్రలు, ప్రత్యేక పూజలు జరుగుతుంటాయి. శ్రీరామనవమి సందర్భంగా కోర్ పరిధిలో కోలాహల వాతావరణం ఉంటుంది. ఈ నేపథ్యంలోనే మద్యం దుకాణాలు, బార్లు, కల్లు దుకాణాలు నాలుగు పోలీస్ కమిషనరేట్ల బాస్‌లు ఆదేశాలు జారీ చేశారు. తెలంగాణ ఎక్సయిజ్ చట్టం, 1968లోని సెక్షన్ 20 ప్రకారం ప్రజా శాంతి, భద్రత దృష్ట్యా తీసుకున్న నిర్ణయం మేరకు మార్చి 27వ తేదీ ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు అన్ని ఈ ఆదేశాలు అమలులో ఉంటాయి. స్టార్ హోటళ్లలో ఉన్న బార్లు, క్లబ్బులకు మాత్రం మూసివేత నిర్ణయం వర్తించదని అధికారులు స్పష్టం చేశారు. యథావిధిగా స్టార్ హోటళ్లలో బార్లు, క్లబ్బుల్లో మద్యం విక్రయాలు జరుగుతాయి.

## పారిశ్రామిక కార్మికుల వయోపరిమితిని 61 సంవత్సరాలకు పెంచాలి: వి.ఎస్.బోస్

ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగుల వయోపరిమితిని 61 సంవత్సరాలకు పెంచి, గత 10 సంవత్సరాలుగా అమలు చేస్తున్నారనీ, కానీ పరిశ్రమలలో పనిచేస్తున్న కార్మికులకు వయోపరిమితిని 61 సంవత్సరాలకు పెంచకుండా 58 సంవత్సరాలకే రిటైర్మెంట్ చేస్తున్నారని ఏఐటియుసి తెలంగాణ రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి వి.ఎస్.బోస్ అన్నారు. ఒకే రాష్ట్రంలో వయోపరిమితి కొందరికి 58సంవత్సరాలు మరికొందరికి 61 సంవత్సరాలు అమలు చేయటం చట్టవిరుద్ధమైనదని ఆయన అన్నారు. ఈ మధ్యకాలంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికుల వయోపరిమితిని 61 సంవత్సరాలకు పెంచి అమలు చేస్తున్నందని, తెలంగాణ రాష్ట్రంలో కూడా కార్మికుల వయోపరిమితిని ఎలాంటి వివక్ష లేకుండా 61 సంవత్సరాలకు పెంచవల్సిన అవసరం ఉన్నదని ఆయన అభిప్రాయపడ్డారు. గత ప్రభుత్వం చేసిన మోసాన్ని ప్రస్తుత ప్రభుత్వం సరిచేసి, కావాల్సిన చట్టాలు మార్చి కార్మికులందరికి ఒకే పద్ధతిలో 61 సంవత్సరాల వయోపరిమితిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. వయోపరిమితిలో జరుగుతున్న ద్వంద విధానాన్ని వెంటనే రద్దు చేయాలని కోరారు. 61 సంవత్సరాల వయోపరిమితిని అమలు చేయటానికి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి, సంబంధిత మంత్రులకు తగిన ఆదేశాలు ఇచ్చి, గత ప్రభుత్వం చేసిన అన్యాయానికి అంతం పలకాలని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని బోస్ కోరారు.

## పార్క్ ప్రారంభం



ప్రజాపక్షం/కంటోన్మెంట్: బోర్డ్ పరిధిలోని 5వ వార్డ్ శ్రీపురి కాలనీలో పార్కును కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో పునర్నిర్మించడం జరిగింది. పార్కు ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కంటోన్మెంట్ బోర్డ్ నామినేటెడ్ మెంబర్ బానుక నర్మద హాజరయ్యారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు పిప్పల అశోక్, ఉపేందర్, విజయరామరాజు, ప్రకాష్ కాలనీ ప్రెసిడెంట్ రాజేశ్వర్, మధు, ప్రవీణ్ పాల్గొన్నారు.

## ట్రాఫిక్ పట్ల అవగాహన



ప్రజాపక్షం/చాంద్రాయణగుట్ట: ట్రాఫిక్ పోలీస్‌ల ఆధ్వర్యంలో బండ్లగూడ ప్రధాన రహదారిపైన వాహనాలు నడుపుతున్న యువకులకు ట్రాఫిక్ పట్ల అవగాహన కల్పించారు. ద్విచకవాహనం నడిపితే హెల్మెట్, కార్ నడుపుతే సీట్‌బెల్ట్ పెట్టుకొని నడపాలని సూచించారు. చోటుచేసుకుంటున్న వాహనాల ప్రమాదాల గురించి, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వారికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో చాంద్రాయణగుట్ట ట్రాఫిక పోలీసులు పాల్గొన్నారు.

## 'తెలంగాణ ప్రజా జాగృతి' రాజకీయ పార్టీ ఏర్పాటు..?

నేడు నిజామాబాద్‌లో 'రాజకీయ పార్టీ' తేదిని
వెల్లడించనున్న కల్వకుంట్ల కవిత

ప్రజాపక్షం/హైదరాబాద్:'తెలంగాణ ప్రజా జాగృతి' రాజకీయ పార్టీని ఎప్పుడు ఏర్పాటు చేయ నున్నారనే అంశాన్ని కల్వకుంట్ల కవిత శుక్రవారం ప్రకటించనున్నారు. హైదరాబాద్ కేంద్రంగా రాజకీయ పార్టీని ఏర్పాటు చేయనున్నట్టు తెలిసింది. 'తెలంగాణ జాగృతి'నే 'తెలంగాణ ప్రజా జాగృతి' పార్టీ'గా ఏర్పాటు చేయనున్నట్టు జాగృతి వర్గాల్లో చర్చ జరుగుతుంది. తాను ఏర్పాటు చేయబో తున్న రాజకీయ పార్టీని ఎప్పుడు,ఎక్కడ ప్రకటిస్తారనే అంశాన్ని 'శ్రీరామనవమి' పండగ సందర్భంగా నిజామాబాద్‌లో శుక్రవారంనాడు మీడియా సమావేశంలో వెల్లడించనున్నారు. శ్రీరామనవమి సందర్భంగా నిజామాబాద్‌లోని శ్రీ రఘునాథ ఆలయం (ఖిల్లా రాంమందిర్) లో జరిగే శ్రీరామ నవమి వేడుకల్లో కల్వకుంట్ల కవిత పాల్గొంటారు. ఈ సందర్భంగా కవిత దంపతులు 'శ్రీ సీతారాముల'కు పట్టు వస్త్రాలను సమర్పించనున్నారు. అనంతరం నిజామాబాద్‌లోని జాగృతి కార్యాలయంలో మధ్యాహ్నం 3 గంటలకు మీడియా సమావేశంలో కవిత తాను ఏర్పాటు చేయబోతున్న రాజకీయ పార్టీని ప్రకటించే తేదీని వెల్లడించనున్నారు.

## అంతర్జాతీయ రంగస్థల దినోత్సవ వేడుకలు



ప్రజాపక్షం/త్యాగరాయగానసభ: ఏఏటిఎమ్ సంస్థ ఆధ్వర్యంలో త్యాగరాయగానసభలో పౌరాణిక నాటక ప్రదర్శన జరిగింది. శ్రీకృష్ణ తులాభారం.. శ్రీకృష్ణ రాయబారం.. సత్యహరిశ్చంద్ర.. మూడు ప్రదర్శనలు ఆహూతులను ఆకట్టకున్నాయి. నామా చంద్రబాబునాయుడు, సాయి లక్ష్మి చాగంటి ఈ వేడుకను నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ఈ పద్య నాటక ప్రదర్శన జరిగింది. డా.ఎంకే రాము, రామదాసు తేజావత్, శ్రీనివాసరావు, గుడిపాటి సురేందర్, లోకం కృష్ణయ్య, డి.త్రినాధరావు, వి.మురళీధర్ అతిథులుగా హాజరయ్యారు. సీనియర్ నటులు టి. నాగిరెడ్డి దంపతులను సత్కరించారు. లింగాపురం భాస్కర్‌రావు, చాగంటి సాయి లక్ష్మి, కిషోర్ కుమార్, జీడీ నాయుడు, చందనవనం సురేందర్ నాద్, జీసీబీ శివప్రసాద్ తదితరులు పద్య నాటకాల్లో తమ నటనతో సమ్మోహన పరిచారు.

## వివాహ వేడుకల్లో నలంద శ్రీనివాస్‌రాజా

ప్రజాపక్షం/వెంగళరావునగర్: ప్రముఖ టిడిపి నేత ధూళిపాళ్ల కుమార్తె వివాహానికి ప్రముఖులు హాజరయ్యారు. గుంటూరులోని శ్రీకన్వెన్షన్ సెంటర్లో జరిగిన ఈ పెళ్లి వేడుకలో ధూళిపాళ్ల సన్నిహితుడు హైదరాబాద్ నలంద విద్యా సంస్థల ఛైర్మన్ మంతెన శ్రీనివాస రాజా కుటుంబ సమేతంగా పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు

# మత వివాదాలపై అప్రమత్తంగా ఉండాలి

శిక్షణ డిఎస్‌పిలకు రిటైర్డ్ డిజిపి
అంజనీకుమార్ సూచన

ప్రజాపక్షం/హైదరాబాద్: అర్బన్ సమాజంలో పోలీస్ అధికారులు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని, సెక్యులర్ దృక్పథంతో వ్యవహరించడం అత్యంత అవసరమని రిటైర్డ్ డిజిపి అంజనీ కుమార్ శిక్షణ పొందుతున్న డిఎస్‌పిలకు సూచించారు.తెలంగాణ పోలీస్ అకాడమీలో ప్రొబేషనరీ డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (డిఎస్‌పి) శిక్షణార్థులకు ప్రత్యేక గెస్ట్ లెక్చర్ నిర్వహించారు. రిటైర్డ్ డిజిపి అంజనీ కుమార్ ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.అకాడమీ డైరెక్టర్ అభిలాష్ బిస్త్ ఆదేశాల మేరకు సీనియర్ అధికారులతో ఇంటరాక్షన్ కార్యక్రమాల్లో భాగంగా ఈ లెక్చర్‌ను ఏర్పాటు చేశారు. కార్యక్రమాన్ని డిప్యూటీ డైరెక్టర్ (ఇండక్షన్) మధుకర్ స్వామి ప్రారంభిస్తూ అతిథిని స్వాగతించారు.ఈ సందర్భంగా అంజనీ కుమార్ ''అర్బన్ సొసైటీలో కమ్యూనలిజం లా అండ్ ఆర్డర్'' పై దాని ప్రభావం అనే అంశంపై ప్రసంగించారు. చిన్న స్థాయి మత వివాదాలను నిర్లక్ష్యం చేస్తే అవే పెద్ద కలహాలకు దారి తీసే ప్రమాదం ఉందని హెచ్చరించిన ఆయన, శాంతి భద్రతల పరిరక్షణలో కమ్యూనిటీ పోలిసింగ్ కీలకమని పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా పోలీస్ అధికారులు తమ నైపుణ్యాలను నిరంతరం అభివృద్ధి చేసుకోవాలని ఆయన సూచించారు.అన్ని మతాలను సమానంగా గౌరవించడం, సమగ్ర సమాచార వ్యవస్థను అభివృద్ధి చేసుకోవడం ద్వారా ప్రజలకు న్యాయం చేయవచ్చని వివరించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ మధుకర్ స్వామి, డిఎస్‌పి ఎన్. రామారావు, అకాడమీ అధికారులు, శిక్షణార్థులు పాల్గొన్నారు.

# క్రీడా స్ఫూర్తి చాటేందుకు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు క్రీడా పోటీలు

ఏర్పాట్లపై సమీక్షించిన మంత్రులు
జూపల్లి, వాకిటిశ్రీహరి



ప్రజాపక్షం/హైదరాబాద్: ప్రజాప్రతినిధుల మధ్య స్నేహపూర్వక వాతావరణాన్ని పెంపొందించడం, క్రీడలను ప్రోత్సహించడం లక్ష్యంగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు క్రీడోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. అసెంబ్లీ ప్రాంగణంలోని కమిటీ హాల్ లో తెలంగాణ లెజిస్లేచర్ క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్ మంత్రి జూపల్లి కృష్ణారావు, కో చైర్మన్ మంత్రి వాకిటి శ్రీహరి అధ్యక్షతన గురువారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ... నిత్యం బిజీగా ఉండే ప్రజా ప్రతినిధులకు ఈ క్రీడలు ఉల్లాసం, ఉత్సాహం నింపడమే కాకుండా, రాష్ట్ర ప్రజల్లో క్రీడా స్ఫూర్తి పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ఈ నెల 28, 29 తేదీల్లో శాసనసభ, శాసనమండలి సభ్యుల క్రీడా పోటీలు మొదటి ఎడిషన్ లెజిస్లేటర్ స్పోర్ట్స్ మీట్–2026' నిర్వహిస్తున్నామని చెప్పారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఇలాంటి పోటీలు తొలిసారిగా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఎల్‌బి స్టేడియంలో 28వ మధ్యాహ్నం 3:30 గంటలకు క్రీడా పోటీలు ప్రారంభమవుతాయని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డితో పాటు సభ్యులందరూ పాల్గొంటారని వెల్లడించారు. రాష్ట్రంలో అన్ని వయసుల వారికి క్రీడలపై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందుకోసం శాసనసభ సచివాలయం, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ, భాషా సాంస్కృతిక శాఖల సమన్వయంతో వివిధ క్రీడాంశాల్లో పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. సమీక్షా సమావేశంలో శాసనమండలి విప్ అద్దంకి దయాకర్, ఎమ్మెల్యేలు ఎం.ఎస్. రాజ్ ఠాకూర్, యశస్విని రెడ్డి, పాల్వాయి హరీష్ రావు, ఎమ్మెల్సీలు తాత మధుసూదన్ రావు, భాను ప్రసాద్ రావు, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, ఎండి డా. సోనీ బాలాదేవి, శాసనమండలి కార్యదర్శి నరసింహచార్యులు, శాసనసభ కార్యదర్శి ఆర్. తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాదీలకు గుడ్ న్యూస్..

## ఉప్పల్‌లో టీమిండియా టి-20, వన్డే మ్యాచ్ ఖరారు!

రికార్డు స్థాయిలో మూడోసారి పొట్టి ప్రపంచ కప్‌తో చరిత్ర సృష్టించిన భారత జట్టు ఐపిఎల్ తర్వాత బిజీగా ఉండనుంది. టీమిండియా 2026-27 సీజన్లో తీరిక లేకుండా మ్యాచ్‌లు ఆడనుంది. సొంతగడ్డపై వెస్టిండీస్, శ్రీలంక, జింబాబ్వే, ఆస్ట్రేలియాతో ద్వైపాక్షిక సిరీస్‌లో భారత్ తలపడనుందని గురువారం బిసిసిఐ తెలిపింది. ఇవి మొత్తం 22 మ్యాచ్లు ఉండగా.. వీటిలో రెండింటికి హైదరాబాద్లోని ఉప్పల్ స్టేడియం వేదికవ్వనుంది. బెంగళూరు, గువాహటి, అహ్మదాబాద్, రాంచీలోనూ భారతజట్టు రెండేసి మ్యాచ్‌లు ఆడనుంది. స్వదేశంలో అదిరే ఆటతో పొట్టి వరల్డ్ కప్ ముద్దాడిన టీమిండియా వచ్చే వన్డే ప్రపంచ కప్‌లో భాగంగా ఈ ఏడాది కీలక మ్యాచ్‌లు ఆడనుంది. ప్రపంచ టెస్టు ఛాంపియన్ షిప్‌లో ముఖ్యమైన ద్వైపాక్షిక సిరీస్లతో శుబమన్ గిల్ సేన ముందంజ వేయాలనే కసితో ఉంది. 2026-27 సీజన్ విషయానికొస్తే.. సొంతగడ్డపై 2-2 మ్యాచ్‌లతో ప్రేక్షకులను అలరించనుంది. మూడు ఫార్మాట్ల పరంగా చూస్తే 5 టెస్టులు, 9 వన్డేలు, 8 టి-20లు ఉన్నాయంతే. గత కొంత కాలంగా అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్‌లకు దూరమైన హైదరాబాద్లోని ఉప్పల్ స్టేడియంలో రెండు గేమ్స్ జరుగనున్నాయి. ద్వైపాక్షికి సిరీస్ కోసం సెప్టెంబర్‌లో భారత్‌కు వెస్టిండీస్ జట్టు రాబోతుంది. మూడు వన్డేలు, ఐదు టి-20ల కోసం కరీబియన్ జట్టు సెప్టెంబర్ అక్టోబర్‌లో ఇండియాలో ఉండనుంది.



తిరువనంతపురం, గువాహటి, న్యూఛండీగఢ్ మూడువన్డేలకు వేదికలుగా ఎంపికయ్యాయి. లక్నో, రాంచీ, ఇండోర్, హైదరాబాద్, భారత్, విండీస్ జట్లు టి-20 మ్యాచ్‌లు ఆడనున్నాయి. ఈ సిరీస్ అనంతరం డిసెంబర్ 13 నుంచి 27 వరకూ శ్రీలంకతో మూడేసి వన్డేలు, టి-20లు ఆడనుంది టీమిండియా. ఢిల్లీ, బెంగళూరు, అహ్మదాబాద్‌లో వన్డేలు.. రాజ్కోట్, కటక్, పుణేలో పొట్టి క్రికెట్‌లో ఆతిథ్య భారత్‌ను లంక ఢీకొట్టనుంది.

### జింబాబ్వేతో వన్డే

కొత్త ఏడాది(2027) ఆరంభంలో జింబాబ్వే జట్టు మూడు వన్డేల సిరీస్ కోసం ఇండియాకు రానుంది. వీటిలో ఒక మ్యాచ్‌కు హైదరాబాద్ ఉప్పల్ స్టేడియం ఎంపికవ్వగా.. కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్, ముంబైలోని వాంఖడేలో మిగతా రెండు వన్డేలు జరుగుతాయి. అనంతరం.. ఆస్ట్రేలియాతో టెస్టు సిరీస్‌తో శుభ్మన్ గిల్ బృందం బిజీగా ఉండనుంది. జనవరి 21 నుంచి మార్చి 7వ తేదీ వరకూ ఇరుజట్లు ఐదు మ్యాచ్‌ల బోర్డర్- గవాస్కర్ ట్రోఫీలో తలపడతాయి. నాగపూర్, చెన్నై, గువాహటి, రాంచీ, అహ్మదాబాద్‌లో టెస్టు మ్యాచ్‌లు ప్రేక్షకులకు అసలైన క్రికెట్ మాజాను పంచడం ఖాయం.

# ఏప్రిల్ 13 నుంచి ఐపిఎల్ రెండో దశ మ్యాచ్‌లు

## సన్‌రైజర్స్‌ను ఢీకొట్టేది ఎవరంటే!

ఇండియన్ ప్రీమియర్ లీగ్ మరో రెండు రోజుల్లో ఆరంభం కానుంది. తొలి దశ మ్యాచ్‌లకు పది జట్లు సిద్ధమైన వేళ రెండో దశ షెడ్యూల్‌లో నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది. ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ రావడం, కెప్టెన్లతో సమావేశం పూర్తవ్వడంతో బిసిసిఐ రెండో దశ షెడ్యూల్‌ను ప్రకటించింది. ఏప్రిల్ 13 నుంచి రెండో విడత లీగ్ జరగనుండగా మే 24న జరిగే ఫైనల్‌తో విజేత ఎవరో తేలిపోనుంది. అయితే.. ప్లే ఆఫ్స్ తేదీలను మాత్రం వెల్లడించలేదు. ఐపిఎల్ సందడికి మరో రెండోరోజులే ఉండడంతో బిసిసిఐ గురువారం కీలక ప్రకటన చేసింది. తొలి విడత ఐపీఎల్‌కు కొనసాగింపుగా రెండో దశ షెడ్యూల్‌ను వెల్లడించింది. అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ రావడం



తో పాటు పది ఫ్రాంచైజీల కెప్టెన్లతో సమావేశం పూర్తి కావడంతో షెడ్యూల్‌కు కసరత్తు చేసిన బిసిసిఐ గురువారం మ్యాచ్‌ల జాబితా విడుదల చేసింది. ఏప్రిల్ 13 నుంచి రెండో దశ మ్యాచ్‌లు నిర్వహిస్తామని, మే 24న ఫైనల్ ఉంటుందని భారత బోర్డు తెలిపింది.

**ఎనిమిది డబుల్ హెడర్స్...** రెండో దశలో 12 వేదికల్లో 50 మ్యాచ్‌లు జరుపుతామని బిసిసిఐ పేర్కొంది. వీటిలో ఎనిమిది డబుల్ హెడర్స్ ఉంటాయని, మధ్యాహ్నం 3:30 గంటలకు ఒకటి, రాత్రి 7:30 గంటలకు రెండో గేమ్ ఆడిస్తామని ఫ్రాంచైజీలకు భారత బోర్డు సెక్రటరీ దేవజిత్ సైకియా స్పష్టం చేశాడు. అయితే.. ప్లేఆఫ్స్ తేదీలను మాత్రం చెప్పలేదు.

రెండో దశలో తొలి మ్యాచ్ ఏప్రిల్ 13న సన్‌రైజర్స్ హైదరాబాద్, రాజస్థాన్ రాయల్స్ మధ్య జరుగనుంది. పంజాబ్ కింగ్స్ జట్టు తమ హోమ్ మ్యాచ్‌లను న్యూ చండీగఢ్లో ఆడనుంది. లీగ్ దశలో మూడు మ్యాచ్లు ధర్మశాలలో ఉంటాయి. రాజస్థాన్ సొంత గడ్డ అయిన జైపూర్‌లో నాలుగు మ్యాచ్‌లు ఆడుతుంది. డిఫెండింగ్ ఛాంపియన్ ఆర్‌సిబి చిన్నస్వామిలో మూడు, రాయ్పూర్లో రెండు మ్యాచ్‌లు ఆడనుంది.

**రెండోదశ వేదికలు :** హైదరాబాద్, బెంగళూరు, ముంబై, చెన్నై, కోల్‌కతా, ఢిల్లీ, అహ్మదాబాద్, లక్నో, జైపూర్, ధర్మశాల, రాయ్పూర్, న్యూచండీగఢ్.

# పోటీ కోసం జీకె

(గ్రూప్స్‌కు సిద్ధమవుతున్న వారికోసం)

## కవ్వాల్ అభయారణ్యం ఎక్కడ ఉంది?



- భారత పార్లమెంట్ రూపొందించిన చట్టం రాజ్యాంగ బద్ధంగా ఉందా లేదా అని చెప్పే అధికారం ఎవరికి ఉంది?
  సుప్రీంకోర్టు
- గ్రామీణ ప్రాంతాల సమగ్ర, సమీకృత అభివృద్ధి కోసం ప్రజలను సంపూర్ణంగా భాగస్వాములను చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకం ఏది?
  గ్రామజ్యోతి
- బహమనీ రాజ్యాన్ని ఏ సంవత్సరంలో నెలకొల్పారు?
  1347
- భూస్థిరమైన ఉపగ్రహం పరిభ్రమణ కాలం
  1రోజు
- భారత రాష్ట్రపతి ఏ ఆర్టికల్ ప్రకారం సుప్రీంకోర్టును సలహా కోరవచ్చు?
  143
- 'సిక్' అనే పదానికి అర్థం ఏమిటి
  శిష్యుడు.
- భూ అయస్కాంత ఉత్తర దక్షిణ ధృవాలను కలిపే సరళరేఖ
  భూ అయస్కాంత అక్షం
- రూబియోలా అనే వ్యాధికి మరోపేరు
- సిపాయిల తిరుగుబాటు ప్రారంభమైనది
  1857
- గ్లూకోజ్ ఒక
  మోనోశాకరైడ్
- స్టెప్ అప్ ట్రాన్స్ఫార్మర్ దీనిని పెంచుతుంది
  వోల్టేజ్
- గ్యాస్ (నవ్వు పుట్టించే వాయువు)?
  నైట్రస్ ఆక్సైడ్
- . రాష్ట్రపతి ఎన్నికల సంబంధ వివాదాలు పరిష్కరించేది ఎవరు?
  సుప్రీంకోర్టు
- 'యశస్తిలక చంపు'ను రచించింది ఎవరు?
  సోమదేవసూరి
- షేర్షా విధించిన భూమి శిస్తు రేటు ఎంత?
  పంటలో 1/3 వంతు
- రాష్ట్ర ఆగంతుక నిధి ఎవరి ఆధీనంలో ఉంటుంది?
  గవర్నర్
- భారతదేశం జన్యుపరంగా తయారుచేసిన మొదటి టీకా మందు?
  హెచ్.బి.వి.
- 'విక్రమార్జున విజయం' అనే గ్రంథాన్ని రచించిందెవరు?
  పంపకవి
- ప్లాసీ యుద్ధం
  క్రీ.శ.1757
- విద్యుచ్ఛక్తిని యాంత్రిక శక్తిగా మార్చునది.
  విద్యుత్ మోటారు
- క్రింది వానిలో గ్రహంగా పరిగణించబడనిది
  ప్లూటో
- రిట్లను జారీచేసే అధికారం సుప్రీంకోర్టుకు సంబంధించి ఏ అధికార పరిధిలోకి వస్తుంది?
  స్వతస్సిద్ధ
- సైనికకోర్టు విధించిన శిక్షల్లో రాష్ట్రగవర్నర్.... జోక్యం చేసుకోకూడదు
- స్వదేశీ ఉద్యమాన్ని ఎవరు ప్రారంభించారు?
  అనిబిసెంట్
- భాగ్యనగరాన్ని స్థాపించినవారు ఎవరు?
  మహ్మద్ కులీకుతుబ్షా
- రేచెర్ల పద్మనాయక రాజ్యస్థాపకుడు ఎవరు?
  సింగము నాయకుడు
- 'వేదాంత సూత్రాలు' గ్రంథాన్ని ఆంగ్లంలోకి అనువదించిన వ్యక్తి ఎవరు?
  వివేకానందుడు
- కామన్వెల్త్ పత్రికను స్థాపించింది ఎవరు?
  అనిబిసెంట్
- భారత్‌లో ఆర్థిక సంస్కరణలను సూచించిన కమిటీ ఏది?
  నరసింహం కమిటీ
- కవ్వాల్ అభయారణ్యం ఎక్కడ ఉంది?
  ఆదిలాబాద్
- మక్కామసీదు నిర్మాణాన్ని ఎప్పుడు ప్రారంభించారు?
  క్రీ.శ. 1617
- కోహినూరు వజ్రం ఎక్కడ దొరికింది?
  కొల్లూరు
- ప్రపంచ అటవీ దినోత్సవం ఎప్పుడు?
  మార్చి 21
- నాగ సముద్రం అనే చెరువును ఎవరు నిర్మించారు?
  నాగాంబిక
- తెలంగాణ రాష్ట్రంలో రిజర్వ్ అడవులు ఎక్కువగా ఉన్న జిల్లా ఏది?
  ఆదిలాబాద్
- కింది ఏ పట్టణంలో కర్కటకరేఖ అతి దగ్గరగా వెళుతోంది?
  కోల్‌కతా
- గ్రేట్ విక్టోరియా ఎడారి ఎక్కడ ఉంది?
  ఆస్ట్రేలియా
- వేములవాడ చాళుక్యుల్లో గొప్ప పాలకుడు ఎవరు?
  రెండో అరికేసరి
- భూమి అభివృద్ధి బ్యాంకులు కిందివాటిలో దేని భాగస్వామ్యంలో ఉంటాయి?
  సహకార పరపతి సంస్థ



- భారత పునరుద్ధరణ పితామహుడని ఎవరిని అంటారు?
  రాజారామమోహన్ రాయ్
- ఏ బిల్లులను గవర్నర్ అనుమతితో విధానసభలో ప్రవేశపెట్టాలి?
  ద్రవ్య లేదా ఆర్థిక
- రెండు రాష్ట్రాల మధ్య వచ్చే వివాదాలను విచారించే అధికారం ఎవరికి ఉంటుంది?
  సుప్రీంకోర్టు

# నేటితరానికి స్ఫూర్తిదాయకం 'ధర్మభిక్షం' పోరాటం

## వర్ధంతి సందర్భంగా సిపిఐ నేతల ఘననివాళులు

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** తెలంగాణ సాయుధ పోరాట యోధులు, మాజీ ఎమ్మెల్యే, మాజీ ఎంపి, కమ్యూనిస్టు యోధుడు బొమ్మగాని ధర్మభిక్షం జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.బాలనరసింహ్మా అన్నారు. గురువారం స్వాతంత్ర సమరయోధుడు, గీత పనివారల సంఘం వ్యవస్థాపకుడు బొమ్మగాని ధర్మభిక్షం 15వ వర్ధంతిని పురస్కరించుకొని జిల్లాకేంద్రంలోని లక్ష్మణాచారి భవన్‌లో ధర్మభిక్షం చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గీత పనివారల సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కౌకుంట్ల కేశవులుగౌడ్, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు సూర్య శంకర్ గౌడ్, మారేడు శివశంకర్, రామన్‌గౌడ్, సురేందర్ , కృష్ణయ్యగౌడ్, ఎఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు కేసుమల్ల శివకృష్ణ, అనంత శ్రీనివాసులు, కపిలవాయి గోపి చారి, దాంగట్ల వెంకటస్వామి, ఈర్ల హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

**జనగామ :** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు, నల్లగొండను ఎర్రగొండగా మార్చిన విప్లవ ధీశాలి బొమ్మగాని ధర్మభిక్షం అని జనగామ మాజీ ఎమ్మెల్యే, సిపిఐ జనగామ జిల్లా కార్యదర్శి సిహెచ్.రాజారెడ్డి అన్నారు. ధర్మభిక్షం వర్ధంతిని జనగామలోని సిపిఐ కార్యాలయంలో నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమి తి సభ్యురాలు పాతూరి సుగుణమ్మ, జిల్లా సహాయ కార్యదర్శి సొప్పరి సోమయ్య, జువారి రమేష్, రావుల సదానందం, చామకూర యాకూబ్, దయా నగేష్, నిర్మల సముద్రాల రాజు, విజయ, పిట్టల కుమార్, విజయ, మల్లేశం, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

**కరీంనగర్ :** పేద ప్రజల కోసం తన జీవితాన్ని అంకితం చేసి, ప్రజల హక్కుల కోసం పోరాడిన యోధుడు బొమ్మగాని ధర్మభిక్షం అని గీత పనివారల సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి న్యాలపట్ల రాజుగౌడ్ అన్నారు. బొమ్మగాని ధర్మభిక్షం వర్ధంతి సందర్భంగా గురువారం సిపిఐ జిల్లా కార్యాలయంలో గీత సంఘం ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి సమ్మయ్య, గీత పనివారల సంఘం జిల్లా కార్యవర్గ



సూర్యాపేటలో...

సభ్యులు పైడిపల్లి రాజుగౌడ్, బుర్ర చంద్రశేఖర్ గౌడ్, బూడిద సదాశివ, బాకం ఆంజన్న, ఆర్.అశోక్, రామ్మూర్తి, బుల్లి సాయి పాల్గొన్నారు.

### అరుదైన ప్రజానాయకుడు

**హుజూర్‌నగర్:** అరుదైన ప్రజా నాయకుడు ధర్మభిక్షమని సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యల్లావుల రాములు, పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ సిపిఐ కార్యాలయంలో సిపిఐ జాతీయనాయకుడు ధర్మభిక్షం ధర్మభిక్షం వర్ధంతి నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గసభ్యులు కంబాల శ్రీనివాస్, కొప్పోజు సూర్యనారాయణ, దేవరం మల్లేశ్వరి, దొంతగాని సత్యనారాయణ, జడ శ్రీనివాస్, యల్లావుల రమేష్, కందుల వెంకటేశ్వర్లు, చెనగాని సైదులు, జడ వెంకన్న, కోటమ్మ తదితరులు పాల్గొన్నారు.

**భువనగిరి :** బడుగు, బలహీనవర్గాల పోరాట యోధుడు, గీతకార్మికుల జన బాంధవుడు బొమ్మగాని ధర్మభిక్షం విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలని గీత పనివారాల సంఘం రాష్ట్ర కార్యదర్శి బోలగాని సత్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం భువనగిరి పట్టణంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో బొమ్మగాని ధర్మభిక్షం వర్ధంతి సందర్భంగా అయన చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎండి.ఇమ్రాన్, జిల్లా కమిటీ సభ్యులు గాదెగాని మాణిక్యం, సామల శోభన్‌బాబు, సిపిఐ పట్టణ కార్యదర్శి పుట్ట రమేష్, సామల భాస్కర్, బద్దం వెంకట్‌రెడ్డి, పిన్నం జగన్, ఎండి.బాబా, మామిండ్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

### అందరికీ ఆదర్శప్రాయుడు

**నల్లగొండ :** ప్రజల హక్కుల కోసం జీవితాంతం నిరంతరం పోరాటాలు చేసిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు బొమ్మగాని ధర్మభిక్షం అందరికీ ఆదర్శప్రాయుడని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి లోడంగి శ్రవణ్ కుమార్ తెలిపారు. బొమ్మగాని ధర్మభిక్షం వర్ధంతి సందర్భంగా సిపిఐ నల్లగొండ జిల్లా కార్యాలయం మగ్దూమ్ భవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్య క్రమంలో గీత పనివారల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పబ్బు వీరస్వామి, మత్స్యకార్మిక సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి దీటి నరసయ్య, శాంతి సంఘం జిల్లా కార్యదర్శి జిల్లా యాదయ్య, సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి వి.లెనిన్, ముండ్ల ముత్యాలు, యూసుఫ్, కౌసల్య, టి.దశరథ, వల్కి వెంకటేశ్వర్లు, నాగమణి, సైదమ్మ పాల్గొన్నారు.

**ఖమ్మంటౌన్ :** తన జీవితమంతా ప్రజాసేవకే అంకితం చేసిన ప్రజల మనిషి బొమ్మగాని ధర్మభిక్షమని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి అన్నారు. సిపిఐ కార్యాలయంలో కల్లుగీత పనివారల సంఘం ఆధ్వర్యం లో బొమ్మగాని ధర్మభిక్షం వర్ధంతి నిర్వహించారు. కార్యక్రమంలో గీత పనివారల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తొండల సత్యనారాయణ, దూసరి శ్రీరాములు, గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు కత్తి నెహ్రూ, సింగం సత్తయ్యగౌడ్, మేకల శ్రీనివాస రావు, యనాలి సాంబశివరెడ్డి, బంధం నాగేశ్వర రావు, చేబ్రోలు ఇంద్రసేన పాల్గొన్నారు.

**ఇబ్రహీంపట్నం:** స్వాతంత్ర సమరయోధుడు తెలంగాణ సాయుధ పోరాట యోధుడు బొమ్మగాని ధర్మభిక్షం వర్ధంతి సందర్భంగా రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో సిపిఐ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య హాజరై బొమ్మగాని ధర్మభిక్షం చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్ళుల ర్పించారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్రనాయకులు పుస్తకాల నర్సింగరావు, కావలి నర్సింహ్మా, ఓరుగంటి యాదయ్యగౌడ్, ఎండి అలిమొద్దీన్, అనంత రెడ్డి, పి.నీలమ్మ, పి.శివకుమార్, కావలి సురేష్, కాటంరాజు, బి.బాలయ్య పాల్గొన్నారు.

### సూర్యాపేట జిల్లాకు ధర్మభిక్షం పేరు పెట్టాలి

**సూర్యాపేట టౌన్ :** సూర్యాపేట జిల్లాకు ధర్మభిక్షం పేరును పెట్టాలని, అలాగే సూర్యాపేట జిల్లా కేంద్రంలోని మిని ట్యాంక్‌బండ్‌పై ధర్మభిక్షం విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ధర్మభిక్షం వర్ధంతి సందర్భంగా గురువారం స్థానిక ధర్మభిక్షం చౌక్‌లో ఆయన విగ్రహానికి పట్టణానికి చెందిన ప్రముఖులు, వివిధ పార్టీల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సూర్యాపేట సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది, వైస్ చైర్మన్ షఫీఉల్లా, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, మార్కెట్ వైస్‌చైర్మన్ గట్టు శ్రీనివాస్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఎం.డేవిడ్‌కుమార్, సిపిఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, దేగల జనార్థన్, దంతాల రాంబాబు, చామల అశోక్ కుమార్, రేగటి లింగయ్య, దోరేపల్లి శంకర్, చివ్వెంల మండల కార్యదర్శి ఖమ్మంపాటి రాము, బూర సైదులు, ఎడెల్లి శ్రీకాంత్, పెంద్ర కృష్ణ, దంతాల పద్మరేఖ, దేశగాని హేమలత, ఎల్.భద్రయ్య, బైరు వెంకన్న, బైరు శైలేందర్, టైసన్ శ్రీను, అయితగాని కామేష్ తదితరులు పాల్గొన్నారు.

**నిజామాబాద్ అర్బన్ :** దున్నేవాడికే భూమి కావాలని గీసేవాడికే చెట్టు ఉండాలని పోరాడిన నాయకుడు ధర్మభిక్షం అని సిపిఐ నిజామాబాద్ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ అన్నారు. గురువారం సిపిఐ జిల్లా కార్యాలయంలో ధర్మభిక్షం వర్ధంతిని నిర్వహించారు. ధర్మబిక్షం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సిపిఐ నగర కార్యదర్శి వై.ఓమయ్య, పి.హనుమాండ్లు, కుసాల్, రజాక్ పాల్గొన్నారు.



నాగర్‌కర్నూల్‌లో...



నల్లగొండలో...



భువనగిరిలో...



జనగాంలో...



ఖమ్మంలో...



కరీంనగర్‌లో...



హుజూర్‌నగర్‌లో...



నిజామాబాద్‌లో...



ఇబ్రహీంపట్నంలో...

## హైకోర్టు బార్ అసోసియేషన్ విజేతలు వీరే...

**హైదరాబాద్ :** హైకోర్టు అడ్వొకేట్స్ అసోసియేషన్ కార్యవర్గానికి గురువారం జరిగిన ఎన్నికల ఫలితాలు రాత్రి వెలువడ్డాయి. అధ్యక్షుడిగా ఎస్.సురేందర్‌రెడ్డి విజయం సాధించారు. ఆయనకు 1,396, చిక్కుడు ప్రభాకర్‌కు 1,121, ఎల్.రవిచందర్‌కు 929 ఓట్లు పోలయ్యాయి. ఉపాధ్యక్షుడిగా డిఎల్ పాండు, కార్యదర్శులుగా పి.శ్రవణ్ కుమార్‌గౌడ్, కె.నిరంజన్‌రెడ్డి, అదనపు కార్యదర్శిగా క్రిష్ణ కీర్తన, ట్రెజరర్‌గా బాలాజీ బానోత్, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీగా విష్ణువర్ధన్ జయసూర్య విజయం సాధించారు. ఎగ్జిక్యూటివ్ సభ్యుడి (సీనియారిటీ 25ఏళ్లు)గా నాగులూరి కృష్ణ కుమార్‌గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 15 ఏళ్ల కేటగిరీ (జనరల్) జక్కా కొండారెడ్డి, రుక్మిణి పల్లెల (మహిళ), ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా కె.భార్గవి, జి.శిల్ప, జి.అరవింద్ కుమార్, ఆర్‌పి నాయక్, పి.రవి ఎన్నికయ్యారు. రికార్డు స్థాయిలో ఇద్దరు మహిళలకు ఓట్లు వచ్చాయి. రుక్మిణి (2515), క్రిష్ణ కీర్తన (2306) చొప్పున సాధించారు.

## నిమ్స్‌లో గద్దర్ భార్య విమలకు డిప్యూటీ సిఎం భట్టి, మంత్రి పరామర్శ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** దివంగత ప్రజా గాయకుడు గద్దర్ సతీమణి విమల నిమ్స్‌లో గాల్ బ్లాడర్ సమస్యతో బాధపడుతూ చికిత్స పొందుతున్నారు. మూడు రోజుల క్రితం నిమ్స్‌లో చేరిన విమలను డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్‌లు గురువారం పరామర్శించారు. అనంతరం నిమ్స్ డైరెక్టర్ బీరప్పను కలిసి ఆమెకు అందుతున్న వైద్య సేవల గురించి ఆరా తీశారు. విమల వెంట కుమారుడు సూర్యం, ఇతర కుటుంబ సభ్యులు ఉన్నారు.

## పార్టీకి కార్యకర్తలే బలం, బలగం

ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి



**ప్రజాపక్షం/హయత్ నగర్:** పార్టీకి కార్యకర్తలే బలం బలగం ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అని అన్నారు గురువారం కొత్తపేట డివిజన్ రాజీవ్ గాంధీ నగర్ డివిజన్ బిఆర్‌ఎస్ పార్టీ జనరల్ సెక్రటరీ మహ్మద్ యాసిన్ ఆధ్వర్యంలో ఓటర్ డేటా కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మాజీ కార్పొరేటర్ సాగర్ రెడ్డి, డివిజన్ భారస పార్టీ అధ్యక్షులు లింగాల రాహుల్ గౌడ్ పాల్గొన్నారు. ఉదయ్ గౌడ్,మహేష్ రెడ్డి,విశ్వేశ్వరరావు,మామిడి రామచందర్, దీప్ లాల్,జోగునాగేష్,బట్టు అంజయ్య,ఇటికల యాదగిరి,మల్లెపాక యాదగిరి,పాషాబాయ్,రఫిక్ బాయ్,రఫిక్ పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఎల్‌ఓసి అందజేత



**ప్రజాపక్షం/కొందుర్గు:** వైద్యసేవలు పొందేందుకు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధిత కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే వై.అంజయ్య యాదవ్ సహకారంతో రూ.2లక్షల ఎల్‌ఓసిని అందించారు. గురువారం కొందుర్గు మండలం పాత ఆగిర్యాల గ్రామానికి చెందిన నాగం కృష్ణ, భార్యత నాగమణి శస్త్ర చికిత్స కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని తెలుకున్న మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ తక్షణమే స్పందించి ఎమ్మెల్సీ వాణిదేవి సహకారంతో రూ.2లక్షల ఎల్‌ఓసి బాధిత కుటుంబానికి అందించారు. కార్యక్రమంలో బిఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి, మాజీ వైస్ ఎంపిపి రాజేష్ పటేల్, మండల ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్ గౌడ్, మాజీ ఎంపిటిసి మాణెయ్య, మాజీ సర్పంచ్ భీమయ్య, నాయకులు అబ్దుల్ కలాం, కుర్వ జంగయ్య, శేఖర్‌గౌడ్, సత్యం, గొడుగు సత్యం, జంగం గోపాల్, ఆంజనేయులు, శ్రీశైలం, మహేందర్ పాల్గొన్నారు.

## గిరిజన రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం



**ప్రజాపక్షం/యాచారం:** గిరిజన రైతుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం అయిందని మర్లకుంట తండా గిరిజనులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం గ్రీన్ ఫీల్డ్ రోడ్డు నిర్మాణ బాధితుల రిలే నిరహార దీక్షలు 10వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ప్రభుత్వం పట్టా భూములు ఇవ్వని భూములపై ఉన్న టిజిఐఐసి తీసేసి అన్‌లైన్‌లో రైతుల పేర్లు నమోదు చేయాలన్నారు. రైతులు చేస్తున్న రిలే నిరహార దీక్షలకు ఫార్మాసిటి గ్రామాలైన మేడిపల్లి, నానక్‌నగర్, తాడిపర్తి, కుర్మిద్ద గ్రామాలకు చేందిన ప్రజలు, ప్రజాప్రతినిధులు, వివిధ పార్టిలకు చెందిన నాయకులు మద్దతు తెలుపుతున్నారు.

## శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే ఉపేక్షించేది లేదు : ఎసిపి



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదని, శ్రీరాముడి శోభయాత్రలను ప్రశాంతంగా నిర్వహించుకునేందుకు కృషి చేయాలని ఏసిపి లక్ష్మీ నారాయణ సూచించారు. గురువారం పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో శాంతి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసిపి లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ శ్రీరామ నవమి పండుగను పరస్పర అవగాహనతో, ఐక్యతతో ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకునేందుకు కృషి చేయాలని సూచించారు. ఎవరైనా కావాలని శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ప్రయత్నం చేస్తే వారిపై చట్ట పరమైన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని వివరించారు. సమావేశంలో సిఐ సీతారాం, ఎస్ఐ సుశీల, మున్సిపల్ చైర్మెన్ అగ్గనూరు బసవేశ్వర్ అప్ప, విహెచ్‌పి నేత బంగారు రమేష్ పాల్గొన్నారు.

# 12 గంటల పాటు ట్రాఫిక్ ఆంక్షలు

## ఉదయం 9 గంటల నుంచి శ్రీరామనవమి శోభాయాత్ర ప్రారంభం

**ప్రజాపక్షం/సిటీబ్యూరో:** శ్రీరామనవమి పురస్కరించుకుని శుక్రవారం ఉదయం 9 గంటలకు భారీ శోభాయాత్ర ప్రారంభమై రాత్రి 9 గంటలకు ముగుస్తుంది. సీతారాంబాగ్ ఆలయం నుంచి హనుమాన్ టెకిడీలోని హనుమాన్ వ్యాయామశాల వరకు నిర్వహించే 'శ్రీరామ నవమి శోభాయాత్ర'లో వేలాది మంది భక్తులు పాల్గొంటారు. ఈసందర్భంగా ట్రాఫిక్ ఆంక్షలు అమలులో ఉంటాయని పోలీసులు ప్రకటించారు.




### ట్రాఫిక్ ఆంక్షలు వర్తించే ప్రాంతాలు...

సీతారాంబాగ్ ఆలయం పరిసరాల నుంచి.. ఆసిఫ్‌నగర్, బోయిగూడ కమాన్ వైపు వచ్చే ట్రాఫిక్ మల్లేపల్లి ఎక్స్ రోడ్స్ వద్ద విజయ్‌నగర్ కాలనీ, నాంపల్లి, మెహిదీపట్నం వైపు మళ్లించడం జరుగుతుంది. ఇక అఘాపురా, బోయిగూడ కమాన్ బైలేన్ల నుంచి సీతారాంబాగ్ వైపు వచ్చే ట్రాఫిక్ బోయిగూడ కమాన్ వద్ద అఘాపురా, హబీబ్‌నగర్ వైపు.. దారుసలాం నుంచి సీతారాంబాగ్ వైపు వచ్చే ట్రాఫిక్ అఘాపురా ఎక్స్ రోడ్స్ వద్ద ఘోడేకీఖబర్ లేదంటే కొత్త అఘాపురా, చార్కందిల్ ఎక్స్ రోడ్, నాంపల్లి వైపు.. శోభాయాత్ర బోయిగూడ కమాన్ వద్ద మంగళ్‌హాట్ మార్కెట్ వైపు కుడి మలుపు తీసుకున్నపుడు, గాంధీ విగ్రహం నుంచి మంగళ్‌హాట్ వైపు వచ్చే ట్రాఫిక్ ఘోడేకీఖబర్ వద్ద టక్కర్వాడీ జంక్షన్ లేదంటే కొత్త అఘాపురా వైపు.. పురానాపూల్, జుమేరాత్‌బజార్ నుంచి మంగళ్‌హాట్ వైపు వచ్చే ట్రాఫిక్ గాంధీ విగ్రహం వద్ద టక్కర్వాడీ జంక్షన్ లేదంటే ఘోడేకీఖబర్/పురానాపూల్ వైపు.. పురానాపూల్ నుంచి గాంధీ విగ్రహం వైపు వచ్చే ట్రాఫిక్ పురానాపూల్ ఎక్స్ రోడ్స్ వద్ద పురానాపూల్ దర్వాజా, కర్వాన్, కుల్సుంపురా, 100 ఫీట్ రోడ్డు వైపు.. ఎంజే బ్రిడ్జ్ నుంచి టక్కర్వాడీ జంక్షన్ వైపు వచ్చే ట్రాఫిక్ అఘాపురా, ఘోడేకీఖబర్ వైపు మళ్లిస్తారు. ఎంజే బ్రిడ్జ నుంచి అఫ్జల్‌గంజ్, సిటీకాలేజ్ వైపు వెళ్లే వాహనాలు జుమేరాత్ బజార్ రోడ్డు మీదుగా మళ్లించడం జరుగుతుంది. బేగంబజార్ ఛత్రీ నుంచి వచ్చే ట్రాఫిక్ రాణి అవంతి బాయి విగ్రహం వద్ద ఎంజే బ్రిడ్జ్ వైపు.. బేగంబజార్ బైలేన్ల నుంచి గాంధీ విగ్రహం/పురానాపూల్ వైపు వచ్చే ట్రాఫిక్ లేబర్ అడ్డా వద్ద అలాస్కా టీ జంక్షన్ వైపు... మాలకుంట నుంచి ఎంజే బ్రిడ్జ్ వైపు వెళ్లే ట్రాఫిక్ అలాస్కా టీజంక్షన్ వద్ద దారుసలాం/మాలకుంట వైపు... రంగచారి లేన్, అఫ్జల్‌గంజ్ నుంచి బేగంబజార్ వైపు వచ్చే ట్రాఫిక్ ఎస్ఏ బజార్ (శ్రీకృష్ణ జ్యూవెలరీ వద్ద) నుంచి ఎంజే మార్కెట్ వైపు...అఫ్జల్‌గంజ్ బైలేన్ల నుంచి ఎస్ఏబజార్ వైపు వచ్చే ట్రాఫిక్ ఎస్ఏ బజార్ యూటర్న్ వద్ద అఫ్జల్‌గంజ్/సాలార్‌జంగ్ బ్రిడ్జ్ వైపు.. అజంతా గేట్, జాంబాగ్ నుంచి ఎస్ఏ బజార్ వైపు వచ్చే ట్రాఫిక్ ఎంజే మార్కెట్ వద్ద పుత్లీబౌలి, రంగమహల్ వైపు మళ్లించడం జరుగుతుంది.

### పుత్లిబౌలి నుంచి...

పుత్లిబౌలి నుంచి శంకర్‌షేర్ హోటల్ వైపు వచ్చే ట్రాఫిక్ గౌలిగూడ చమన్ వద్ద త్రివేణి లాడ్జ్, సీబీఎస్ వైపు మళ్లించడం జరుగుతుంది. రంగమహల్ నుంచి గౌలిగూడ చమన్ వైపు వచ్చే ట్రాఫిక్ పుత్లిబౌలి ఎక్స్‌రోడ్స్ వద్ద జాంబాగ్, ఎంజే మార్కెట్‌వైపు మళ్లిస్తారు. ఆంధ్ర బ్యాంక్ నుంచి వచ్చే ట్రాఫిక్ కూడా ఇదే విధంగా మళ్లించడం జరుగుతుంది. చాదర్‌ఘాట్ ఎక్స్ రోడ్ నుంచి పుత్లిబౌలి/జాంబాగ్ వైపు వచ్చే ట్రాఫిక్ రంగమహల్ వైజంక్షన్ వద్ద సీబీఎస్, అఫ్జల్‌గంజ్ వైపు.. జీపీఓఅబిడ్స్ నుంచి పుత్లిబౌలి ఎక్స్ రోడ్ వైపు వచ్చే ట్రాఫిక్ ఆంధ్రాబ్యాంక్ ఎక్స్ రోడ్ వద్ద ఎంహెచ్‌ఎస్ ఎక్స్ రోడ్ వైపు.. అబిడ్స్ రోడ్డు నుంచి బ్యాంక్ స్ట్రీట్ వైపు వచ్చే వాహనాలను జీపీఓ వద్ద ఎంజే మార్కెట్ వైపు మళ్లిస్తారు. చాదర్‌ఘాట్ ఎక్స్ రోడ్ నుంచి ఎంహెచ్‌ఎస్ ఎక్స్ రోడ్ వైపు వచ్చే ట్రాఫిక్ చాదర్‌ఘాట్ ఎక్స్ రోడ్స్ వద్ద నింబోలిఅడ్డ, కాచిగూడ ఎక్స్ రోడ్ వైపు.. నారాయణగూడ నుంచి బడీచౌడి వైపు వచ్చే ట్రాఫిక్ కాచిగూడ ఎక్స్‌రోడ్ వద్ద కాచిగూడ స్టేషన్ రోడ్డు వైపు.. అబిడ్స్ నుంచి ఆంధ్రాబ్యాంక్ వైపు వచ్చే ట్రాఫిక్ జీపీఓ వద్ద ఎంజే మార్కెట్ వైపు.. బాటా రోడ్ కింగ్‌కోఠి, రాంకోఠి ఎక్స్‌రోడ్ నుంచి ప్రగతి టిఫిన్ సెంటర్ వైపు వచ్చే ట్రాఫిక్ బొగ్గులకుంట ఎక్స్‌రోడ్ వద్ద మళ్లించడం జరుగుతుంది. సమాచారం కోసం పోలీస్ సోషల్ మీడియా పేజీలను చూడాలని, అత్యవసర సహాయం కోసం ట్రాఫిక్ హెల్ప్‌లైన్ సెల్:901020 3626కు కాల్ చేయాలని ట్రాఫిక్ పోలీస్ అధికారులు సూచించారు.

## షాద్‌నగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా బి.జగన్మోహన్‌రెడ్డి



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** షాద్‌నగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా బీరంగూడ జగన్మోహన్‌రెడ్డి ఎన్నియ్యారు. గురువారం షాద్‌నగర్ బార్ అసోసియేషన్‌కు నిర్వహించిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా బి.జగన్మోహన్‌రెడ్డి ఒక్క ఓటుతో విజయం సాధించారు. షాద్‌నగర్ బార్ అసోసియేషన్‌లో మొత్తం 170ఓట్లు ఉండగా 161ఓట్లు పోలయ్యాయి. బి.జగన్మోహన్‌రెడ్డికి 67ఓట్లు రాగా సమీప ప్రత్యర్థి నర్వ వేణుగోపాల్‌కు 66ఓట్లు వచ్చాయి. దాంతో ఒక్క ఓటుతో బీరంగూడ జగన్మోహన్‌రెడ్డి అధ్యక్షులుగా గెలుపొందారు. దానక్క సంగమేశ్వర్‌కు 23ఓట్లు, రజాక్ హుసేన్‌కు 5ఓట్లు వచ్చాయి. ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాసమూర్తి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కోశాధికారిగా రహిముద్దీన్‌కు 108ఓట్లు వచ్చాయి. గేమ్స్ అండ్ కల్చరల్ కార్యదర్శిగా డి.శంకర్‌కు 102ఓట్లు వచ్చాయని ఎన్నికల అధికారి మర్రి శంకరయ్య తెలిపారు. దాంతో షాద్‌నగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా బి.జగన్మోహన్‌రెడ్డిని ప్రకటించారు.

## 31న కొండిగారి రాములు సంతాప సభ

సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య



**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** మాజీ ఎమ్మెల్యే కొండిగారి రాములు సంతాప సభను విజయవంతం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య పిలుపునిచ్చారు. గురువారం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో మాజీ ఎమ్మెల్యే కొండిగారి రాములు సంతాప సభ సందర్భంగా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పాలమాకుల జంగయ్య మాట్లాడుతూ ఈ నెల 31న మంగళవారం ఉదయం 11గంటలకు ఇబ్రహీంపట్నం మండల కేంద్రం మంచాల రోడ్డు సమీపంలో భారత్ గార్డెన్‌లో సంతాప సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సంతాప సభకు ముఖ్య అతిథులుగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్త గూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, గౌరవ అతిథులుగా ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డిలు హాజరవుతారని తెలిపారు. నియోజకవర్గంలోని వామపక్ష పార్టీల సానుభూతి పరులు, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని సంతాప సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర నాయకులు పుస్తకాల నర్సింగరావు, నాయకులు కావలి నర్సింహ్మా, ఓరుగంటి యాదయ్య గౌడ్, ఎండి అలీమోద్దిన్, అనంతరెడ్డి, పి.నీలమ్మ, పి శివకుమార్, సిపిఐ ఇబ్రహీంపట్నం, తుర్కయంజాల, మంచాల మండలాల కార్యదర్శులు కావలి సురేష్, కాటంరాజు, బి బాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు ఆర్థిక భరోసా ముఖ్యమంత్రి సహాయనిధి

ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరంగా మారుతుందని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం షాద్‌నగర్ పట్టణంలోని ఎమ్మెల్సీ కార్యాలయంలో లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి వచ్చిన చెక్కులను పంపిణీ చేశారు. షాద్‌నగర్ మున్సిపాలిటికి చెందిన లబ్ధిదారులకు వార్డుల వారిగా కౌన్సిలర్లతో కలిసి ఎమ్మెల్సీ చెక్కులను అంధించారు. ఫరూఖ్‌నగర్ మండలంలోని వివిధ గ్రామాలకు వచ్చిన చెక్కులను సైతం లబ్ధిదారులకు నేరుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధికి ధరఖాస్తులు చేసుకున్న లబ్ధిదారులకు విధిగా ఆర్థిక సహాయం అందుతుందని అన్నారు. గ్రామీణ పేదలకు వైద్యపరంగా అదుకునేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఏర్పాటు చేశారని, అత్యవసర సమయాల్లో పేదలను అదుకునేందుకు ఉపయోగపడుతుందని అన్నారు. వైద్యపరంగా, ఆర్థికంగా ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొకుండా ఉండేందుకు ఈ నిధి ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి వచ్చిన రూ.8.98లక్షల విలువ చేసే చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఫరూఖ్‌నగర్ మాజీ వైస్ ఎంపిపి హరికృష్ణ గౌడ్, కౌన్సిలర్ అనిత రఘునాథ్ యాదవ్, పోమాల్‌పల్లి సర్పంచ్ స్వప్న భూపాల్‌రెడ్డి, వీర్లపల్లి సర్పంచ్ పాండు, కందివనం సర్పంచ్ అమృనాయక్, మెళ్ళగూడ సర్పంచ్ మంగ రవినాయక్, శేరిగూడ మాజీ సర్పంచ్ ప్రశాంత్‌రెడ్డి, మధురాపూర్ మాజీ సర్పంచ్ రంగయ్య గౌడ్, మొగిలిగిద్ద మాజీ ఎంపిటిసి రాధాకృష్ణ, విఠ్యాల మాజీ సర్పంచ్ చంద్రశేఖర్, మాజీ సర్పంచ్ శ్రీశైలం, రాజేందర్‌సింగ్, వేద పండితులు భానుశర్మ, పులిచర్ల కుంట తండా ఉపసర్పంచ్ గణేష్, కొండన్నగూడ ఉపసర్పంచ్ అంజయ్య గౌడ్ పాల్గొన్నారు.

## వైద్యశిబిరాలు సద్వినియోగం

**ప్రజాపక్షం/యాచారం :** గ్రామీణా ప్రాంతాల్లో ఉన్న నిరుపేదలకు మెరుగైన వైద్యం అందిచడానికి ప్రభుత్వం యాచారం మండల కేంద్రంలోని ప్రభుత్వ అసుపత్రిలో ప్రజాపాలన ప్రణాళిక లో భాగంగా 99 రోజుల అరోగ్య కార్యక్రమంలో భాగంగా మెగా హెల్త్ క్యాంపు ఏర్పాటు చేశామని యాచారం మండల వైద్యాధికారులు డాక్టర్ మోహన్ డాక్టర్ ప్రియాంక అన్నారు. గురువారం యాచారం మండల కేంద్రంలోని ప్రభుత్వ అసుపత్రిలో నిరుపేదలకు వైద్య చికిత్సలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అనిత శరణం, కమ్యూనిటి హెల్త్ అధికారి బి.రామయ్య, వైద్యులు రవికుమార్, డాక్టర్ లలితా దేవి, డాక్టర్ శాంతకుమారి, హెచ్‌ఈఓ అనందరాజ్, సౌకత్ అలి,ఫార్మసిస్ట్ రమేశ్ పాల్గొన్నారు.



# నిరుపేదల పక్షాన పోరాటాలు చేసిన యోధుడు ధర్మభిక్షం

అబ్దుల్లాపూర్‌మెట్‌లో నిర్వహించిన వర్ధంతి కార్యక్రమంలో సిపిఐ నేతలు ఆందోజు రవీంద్ర చారి, ముత్యాల యాదిరెడ్డి



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** నిరుపేదల పక్షాన నిలబడి, నిరంతరం ప్రజాపోరాటాలు నిర్వహించిన గొప్ప యోధుడు బొమ్మగాని ధర్మభిక్షం అని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్ర చారి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి అన్నారు. తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, గీత పని వారల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు బొమ్మగాని ధర్మభిక్షం 15వ వర్ధంతిని సిపిఐ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అబ్దుల్లాపూర్‌మెట్ కేంద్రంలోని ధర్మభిక్షం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆందోజు రవీంద్రచారి, ముత్యాల యాదిరెడ్డి మాట్లాడుతూ బొమ్మగాని ధర్మభిక్షం నిరుపేదల పక్షాన నిలబడి నిరంతరం ప్రజా పోరాటాలు నిర్వహించారన్నారు. అనేక భూ పోరాటాల నిర్వహించి పేదలకు భూములు పంపిణీ చేయించారని గుర్తు చేశారు. ఫ్లోరిన్ ప్రాంతాల ప్రజలకు తాగునీరు అందించాలని పార్లమెంట్‌లో గళం మేత్తారన్నారు. గీత కార్మికుల పక్షాన అనేక పోరాటాలు నిర్వహించి వారి హక్కుల పరిరక్షణకు చట్టబద్ధ కల్పించారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ధర్మభిక్షం విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయడంతోపాటు సూర్యాపేట జిల్లాకు ధర్మభిక్షం పేరు పెట్టాలని వారు డిమాండ్ చేశారు. సిపిఐ మండల కార్యదర్శి అజ్మీర్ హరిసింగ్ నాయక్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ సిహెచ్ భాస్కరాచారి, మాజీ ఎంపిపి బబ్బురి మంజుల దేవేందర్ గౌడ్, మాజీ జెడ్ పి సి బింగి దేవదాసు గౌడ్, బాటసింగారం రైతు సేవ సహకార సంఘం మాజీ చైర్మన్ పురం యాదిరెడ్డి, అబ్దుల్లాపూర్ మాజీ ఉపసర్పంచ్ తోర్పునూరి ప్రవీణ్ కుమార్ గౌడ్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బతి లక్ష్మణ్, సిపిఐ మండల సహాయ కార్యదర్శి, వార్డు సభ్యులు కేతరాజు మంజుల నరసింహ, మధు, రమేష్ నాయక్, రవి, సైదులు ముదిరాజ్, అన్నపూర్ణ, రాములు, లక్ష్మి, యాదగిరి, పుల్లయ్య, సాయిలు, బిక్షపతి, సిహెచ్.లక్ష్మి, నిరంజన్, బిచ్చినాయక్, పాండు, సైదులు, నాగేశ్వరరావు, మహిళను తదితరులు పాల్గొన్నారు.

### చేవెళ్లలో...

ధర్మభిక్షం వర్ధంతిని చేవెళ్ల మండల కేంద్రంలోని శంకర్‌పల్లి చౌరస్తాలో గురువారం నిర్వహించారు. గౌడ సంఘం నాయకులు ఎం.సుధాకర్‌గౌడ్, ప్రకాష్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, కృష్ణగౌడ్ ఆధర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కె.రామస్వామి, సిపిఐ జిల్లా నాయకుడు ఎం.ప్రభులింగం, పాల్గొన్నారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు బి సుభాన్‌రెడ్డి, ఎండి మక్బుల్, ఎం.సత్యరెడ్డి, మహిళా సంఘం నాయకురాలు వడ్ల మంజుల పాల్గొన్నారు.

### మొయినాబాద్‌లో

మొయినాబాద్ మండల కేంద్రంలోని సిపిఐ మండల కార్యదర్శి శ్రీనివాస్ అధ్యక్షతన ధర్మభిక్షం వర్ధంతిని జరిపారు. కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయకుడు గౌడ్ సంఘం చేవెళ్ల నియోజకవర్గం బాధ్యుడు ఎం సుధాకర్ గౌడ్, బాలరాజ్ గౌడ్ పాల్గొన్నారు.

### ధర్మభిక్షం ఆశయాల సాధనకు కృషి

మాజీ ఎంపి, దివంగత నేత బొమ్మగాని ధర్మభిక్షం ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సిపిఐ రంగారెడ్డి జిల్లా కౌన్సిల్ సభ్యులు జె.ఆనంద్‌గౌడ్ అన్నారు. గురువారం ధర్మభిక్షం వర్ధంతి సందర్భంగా రాజేంద్ర నగర్ మండల కేంద్రంలోని మైలార్‌దేవపల్లి లో సిపిఐ మండల సహాయ కార్యదర్శి జె.విజయ్ ఆనంద్ గౌడ్ అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఐ రాజేంద్ర నగర్ మండలం సహాయ కార్యదర్శి విజయానందం గౌడ్, బిసి హక్కుల సాధన సమితి రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు జె సదానందం గౌడ్, కె మధు, జె తేజు గౌడ్, జె రిథ్విక్ గౌడ్, సత్యనారాయణ, బబ్లు, హర్ష తదితరులు పాల్గొన్నారు.









## ఇందిరమ్మ ఇల్లు ప్రారంభం

ప్రజాపక్షం/చర్లపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్లను జిహెచ్ఎంసి పరిధిలోని 5వ డివిజన్ నాగారం ఈస్ట్ గాంధీ నగర్‌లో నూతన ఇందిరమ్మ ఇల్లును కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లేష్‌యాదవ్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లు పథకం పేద ప్రజలకు వరంలాంటిదని,పేద ప్రజలకు గృహవసతి కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. ప్రతి అర్హుడికి ఇళ్ల పథకం ద్వారా సొంత ఇంటి కలను నెరవేర్చేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో నాగారం కాంగ్రెస్ పార్టీ నాయకులు గూడురు అశోక్‌గౌడ్, మాదిరెడ్డి వెంకటరెడ్డి, సతీష్‌గౌడ్, చిన్న, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.




## రోడ్డు పక్కన నిలిపిన వాహనాలు జప్తు, జరిమానా

ప్రజాపక్షం/చర్లపల్లి: పాదచారులు,వాహనదారులకు ఆటంకం కలిగే విధంగా రోడ్డు పక్కన వాహనాలను నిలుపరాదని కాప్రా డిప్యూటీ కమిషనర్ శ్రీహరి అన్నారు.ప్రజాపాలన,99 రోజుల ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గురువారం కుషాయిగూడ ప్రధాన రహదారిలో నిబంధనలకు విరుద్ధంగా రోడ్డు పక్కన నిరుపయోగంగా పడి ఉన్న వాహనాలను జప్తు చేసుకుని వెయ్యి రూపాయల పెనాల్టీని విధించారు.రోడ్డు పక్కన వాహనాలు నిలువడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో సానిటేషన్ వేస్ట్ డిఇ రవి,సూపర్‌వైజర్ సుదర్శన్,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరం

### బొంగునూరి కిషోర్ రెడ్డి

ప్రజాపక్షం/దుండిగల్ : కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని 294 పోచంపల్లికు చెందిన కొల్తూరి ఐలమ్మ గండి మైసమ్మ 60 గజాలు ఇందిరమ్మ కాలనీ సాజిదా బేగం, అశోక్ యాదవ్, 296 ఎస్.దీప అనారోగ్యంతో నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు బి కేర్ ఫౌండేషన్ అధ్యక్షులు బొంగునూరి కిషోర్ రెడ్డి వెంటనే స్పందించిన సీఎం సహాయనిధి ద్వారా రూ.60,000 చెక్కులను ఆర్థిక సాయం మంజూరు చేయించారు. ఈ మంజూరు పత్రాలను కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సిఎం సహాయనిధి పేదలకు గొప్ప వరమని ఎల్లప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండి ఎలాంటి సమస్య అయినా తన దృష్టికి వస్తే ప్రజలకు అందుబాటులో ఉండి సమస్య పరిష్కారమయ్యే వరకు కృషి చేస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఏఆర్ సాదు యాదవ్, నాచారం కృష్ణ, మహేష్ ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

## డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తం.. ఇబ్బంది పడుతున్న కాలనీవాసులు

ప్రజాపక్షం/దుండిగల్‌:దుండిగల్ సర్కిల్ పరిధిలోని బహదూర్‌పల్లిలోని ఇందిరమ్మ కాలనీలో డ్రైనేజ్ నీరు పొంగుతుండడంతో కాలనీవాసులు ఇబ్బందులకు గురవుతున్నారు. దుండిగల్ సర్కిల్ శానిటేషన్ విభాగం పట్టించుకోవడంలేదని, ఇంజినీరింగ్ అధికారుల వైఫల్యంతోనే సమస్యలు వస్తున్నాయని ఒక వైపు ప్రజలకోసం ప్రభుత్వం 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' అంటూ సమస్యల పరిష్కార వేదికలు ఏర్పాటు చేస్తున్నా సమస్యలు పరిష్కారం కావడం లేదని సమస్య పూర్తిస్థాయిలో పరిష్కరించాలని ఇందిరమ్మ కాలనీ వాసులు వేడుకుంటున్నారు.






## రైతులకు నాణ్యమైన విత్తనాల పంపిణీ

ప్రజాపక్షం/షామీర్‌పేట్ : ఉద్యన శాఖ ఆధ్వర్యంలో రైతులకు నాణ్యమైన విత్తనాలను పంపిణీ చేస్తున్నామని ఎఇఒ సాగరిక అన్నారు. గురువారం దుండిగల్‌లోని రైతు కార్యాలయంలో రైతులకు ఉచితంగా విత్తనాల కిట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉద్యాన పంటలపై రైతులకు సమగ్రంగా వివరించామని అన్నారు. రైతులకు 50 శాతం పై సబ్సిడీపై మల్చింగ్ షీట్ అందజేస్తున్నామని చెప్పారు. రైతులకు 50 సబ్సిడీ పై ఫామ్ మేకనైజేషన్ 40రాయితీ కల్పిస్తున్నామని అన్నారు. రైతులకు డ్రిప్ పరికరాలు బిందు సేద్యం ద్వారా అందిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో రైతులు నరసింహ, యాదయ్య, అంజయ్య, జనార్ధన్, మహిళ రైతులు తదితరులు పాల్గొన్నారు.




## నిర్ణీత సమయంలోగా పనులు పూర్తి

### 28న 'క్లీన్ స్వీప్ భారీ శుభ్రత డ్రైవ్' విజయవంతం చేయాలి

### సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన అధికారులకు ఆదేశం

ప్రజాపక్షం/హైదరాబాద్ : అభివృద్ధి పనులు నిర్ణీత సమయంలోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్(సిఎంసి) కమిషనర్ సృజన ఆదేశించారు. సిఎంసి శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయంలో ఇంజనీరింగ్, అర్బన్ బయోడైవర్సిటీ (యుబిడి) పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జోనల్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లు, టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్, యుబిడి విభాగాల అధికారులు పాల్గొన్నారు. హెచ్ సిటీ పనుల పురోగతి, భవన నిర్మాణాల నిర్వహణ, బిటి, సిసి రహదారుల నిర్మాణం, చిన్నపాటి మరమ్మతులు, వర్షపు నీటి కాలువల నిర్మాణం, ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, ఖాళీ స్థలాల్లో ప్రహరీగోడలు, జంక్షన్ అభివృద్ధి పనులను కమిషనర్ పరిశీలించారు. పనులను వేగవంతం చేసి, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులకు కమిషనర్ సూచించారు. ఇదిలా ఉండగా ఈనెల 28వ తేదీన శేరిలింగంపల్లి జోన్ పరిధిలో పటాన్ చెరు నుంచి మణికొండ వరకు ఉన్న 22 కిలోమీటర్ల ప్రధాన రహదారిపై 'సైబరాబాద్ క్లీన్ స్వీప్' పేరిట భారీ శుభ్రత కార్యక్రమం చేపట్టనున్నారు. ఈ కార్యక్రమం ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు కొనసాగనుంది.

ఈ డ్రైవ్‌లో భాగంగా రహదారిని 0.5 కిలోమీటర్ల చొప్పున 44 విభాగాలుగా విభజించి, ప్రతి విభాగానికి ప్రత్యేక శుభ్రత సిబ్బంది, పర్యవేక్షక అధికారి, చెత్త సేకరణ వాహనాలు కేటాయించనున్నారు. రహదారులు, ఫుట్‌పాత్‌లు, బహిరం గ ప్రదేశాల శుభ్రపరచడం, రోడ్ అంచులు, మూలలు, డివైడర్ల వద్ద పేరుకుపోయిన ధూళి తొలగింపు, చెత్త, ఘన వ్యర్థాలు, నిర్మాణ శిథిలాల తొలగింపు, అనధికార హోర్డింగ్స్, బ్యానర్లు, పోస్టర్ల తొలగింపు పనులు చేపట్టనున్నారు. ప్రతి విభాగానికి చెత్త సేకరణ వాహనాలు, నిర్మాణ వ్యర్థాల తరలింపు ఏర్పాట్లు, ప్రతి 100 మీటర్లకు నీటి డ్రమ్ములు, ప్రతి 2 కిలోమీటర్లకు వాటర్ ట్యాంకర్లు ఏర్పాటు చేయనున్నారు.

ఈ కార్యక్రమంలో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొనాలని అధికారులు కోరారు. పాల్గొనే వాలంటీర్లకు మార్గదర్శకాలు, గుర్తింపు ఇవ్వనున్నారు. ఈ డ్రైవ్ ద్వారా ఎంపిక చేసిన రహదారిని ఒక మోడల్ స్ట్రెచ్‌గా మార్చి, సైబరాబాద్ అంతటా శుభ్రత ప్రమాణాలను పెంచడమే లక్ష్యంగా నిర్ణయించారు. ఈ సమావేశంలో జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్, చీఫ్ సిటీప్లానర్ బి. వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్యంపై రాజీపడే ప్రసక్తే లేదు

### ఎంఎంసి కమిషనర్ టి.వినయ్ కృష్ణా రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్ : పట్టణ పారిశుద్ధ్యంపై రాజీ పడే ప్రసక్తే లేదని మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసి) కమిషనర్ టి. వినయ్ క్రిష్ణారెడ్డి స్పష్టం చేశారు. '99 రోజుల కార్యాచరణ ప్రణాళిక'లో భాగంగా ఆయన బోడుప్పల్, ఫీర్జాదిగూడ, పర్వతాపురం ప్రాంతాల్లో ఆకస్మిక పర్యటించి, క్షేత్రస్థాయి పరిస్థితులను సమీక్షించారు. శ్రీనివాస హిల్స్, మహారాజ్ ఫోర్ట్ కాలనీ, ఇంటింటి చెత్త సేకరణలో డేటా నిర్వహణ సరిగా లేకపోవడంపై కమిషనర్ అసహనం వ్యక్తం చేశారు. ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరిస్తున్నారా లేదా అనేందుకు ప్రత్యేక రికార్డులు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. స్వచ్ఛ ఆటో టిప్పర్ (సాట్) డ్రైవర్లతో మాట్లాడిన కమిషనర్, ఏ ఒక్క ప్రాంతాన్ని వదలకుండా ప్రతిరోజూ చెత్త సేకరించాలని సూచించారు. చెత్త ఇవ్వని గృహాల వివరాలను ఎస్ఎఫ్ఏలకు నివేదించాలన్నారు. చెత్త సేకరణపై స్థానికుల నుంచి వచ్చిన ఫిర్యాదులపై స్పందించిన కమిషనర్, నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పర్వతాపురం, గాంధీనగర్ వాణిజ్య సముదాయాల్లో ప్రతి షాపులో డస్ట్‌బిన్‌లు ఉండటం తప్పనిసరి అన్నారు. నిబంధనలు పాటించని దుకాణదారులకు నోటీసులు జారీ చేయాలని, ట్రేడ్ లైసెన్సులను తనిఖీ చేయాలని అధికారులను ఆదేశించారు. పరిశుభ్రత, బాధ్యతాయుత సేవలు, క్రమశిక్షణే ప్రభుత్వ లక్ష్యాలని, ప్రజలు, వ్యాపార వర్గాలు సహకరించాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.



**నిరుపయోగ వాహనాల తొలగించిన ఎంఎంసి యంత్రాంగం**

నగరంలో ట్రాఫిక్ ఇబ్బందులను తొలగించి, పరిశుభ్రతను మెరుగుపరచడమే లక్ష్యంగా మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసి) అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన '99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా, రోడ్ల పక్కన నిరుపయోగంగా పడి ఉన్న వాహనాలను తొలగించే కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. మల్కాజిగిరి పరిధిలోని వివిధ సర్కిళ్లలో రోడ్లపై ఆటంకంగా ఉన్న సుమారు 46 పాత వాహనాలను అధికారులు గుర్తించి, ట్రాఫిక్ పోలీసుల సమన్వయంతో వాటిని తొలగించారు. ఈ వాహనాల వల్ల ట్రాఫిక్ జామ్లు ఏర్పడటమే కాకుండా, ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, తాజా చర్యలతో వాహనదారులకు ఊరట లభిస్తుందని పారిశుద్ధ్య అదనపు కమిషనర్ సి.ఎన్. రఘు ప్రసాద్ తెలిపారు. ఎంఎంసి కమిషనర్ వినయ్ క్రిష్ణారెడ్డి మాట్లాడుతూ భవిష్యత్తులోనూ ఇలాంటి డ్రైవ్‌లు కొనసాగుతాయని స్పష్టం చేశారు. వాహనదారులు తమ వాహనాలను రోడ్ల పక్కన వదిలేయకుండా, కేటాయించిన పార్కింగ్ ప్రదేశాల్లోనే ఉంచాలని, నగరాన్ని సురక్షితంగా ఉండేందుకు సహకరించాలని కోరారు.

## స్లమ్ ప్రాంతాల పిల్లలు దీనావస్థలో ఉండటం శోచనీయం

### రాష్ట్ర బాలల హక్కుల సంరక్షణ కమిషన్ సభ్యులు చందన ఆవేదన




ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి: మేడ్చల్ మల్కాజి గిరి జిల్లా జవహర్ నగర్ కార్పొరేషన్‌లో మురికి వాడలతో ఉన్న 100 కాలనీల్లో నివసిస్తున్న ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించటంతో పాటు అక్కడి పిల్లలకు కనీసం విద్యను అందించ లేని దీనస్థితిలో కొట్టుమిట్టాడుతుండటం శోచనీయమని రాష్ట్ర బాలల హక్కుల సంరక్షణ కమిషన్ సభ్యులు చందన ఆవేదన వ్యక్తం చేసారు. ఇటీవల కమిషన్ జిల్లాలో పర్యటించి అక్కడి పరిస్థితులు అధ్యయనం చేసిన సందర్భంలో స్లమ్ ఏరియాల్లో జిల్లా అధికార యంత్రాంగం అనుసరిస్తున్న నిర్లక్ష్యం స్పష్టంగా కనపడుతోందన్నారు. బుధవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, రాష్ట్ర బాలల హక్కుల సంరక్షణ కమిషన్ సభ్యులు సరిత, చందనలు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషన్ సభ్యులు చందన మాట్లాడుతూ మురికి వాడల్లోని ప్రజలు, పిల్లలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు మొదటి ప్రాధాన్యతగా తీసుకొని ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్లాలన్నారు. సంబంధిత ప్రభుత్వ శాఖలన్ని సమన్వయంతో కృషి చేస్తేనే అక్కడి పిల్లలకు మంచి భవిష్యత్తును ఇవ్వగలుగుతామన్నారు. దీనిలోని భాగంగా స్పెషల్ డ్రైవ్ ఏర్పాటు చేసి మురికి వాడల్లో నివసించే పిల్లల వివరాలు, ఏవరెవరు పాఠశాలలకు వెళ్లటం లేదన్న పూర్తి సమాచారాన్ని తీసుకొని తయారు చేసే జాబితా ద్వారా వారి అభివృద్ధి కి పని చేయాలన్నారు. స్లమ్‌లలో వైద్య శిబిరాలను తరచు ఏర్పాటు చేస్తూ ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించాలని, అవసరం ఉన్న కుల, ఆదాయ, జననం లాంటి ప్రభుత్వ ధృవీకరణ పత్రాలు అందేలా చూడాలన్నారు. దీంతో పాటు చైల్డ్ లేబర్‌ను గుర్తించాలన్నారు. జిహెచ్ఎంసి, రెవెన్యూ, పోలీసు, విద్యా, వైద్య, కార్మిక మహిళా శిశు సంక్షేమ శాఖలన్ని సమన్వయంతో పని చేసి జవహర్‌నగర్ పిల్లలకు మంచి భవిష్యత్తును అందించాలని సూచించారు. దీనికి తమ వంతు పూర్తి సహకారం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ చంద్రావతి,కీసర ఆర్డీఓ రాజేష్, డిఈఓ విజయకుమారి, తదితర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా ధర్మబిక్షం వర్ధంతి



ప్రజాపక్షం/శామీర్‌పేటః స్వాతంత్ర్య సమరయోధుడు కమ్యూనిస్ట్ నేత, గీత పనివారల సంఘం వ్యవస్థాపక అద్యక్షుడు బొమ్మగాని ధర్మబిక్షం 15 వ వర్ధంతిని గురువారం ఉమ్మడి శామీర్‌పేట మండలంలో ఘనంగా జరుపుకున్నారు. మూడుచింతలపల్లి మండల సిపిఐ కార్యదర్శి తప్పెట్ల రాములుగౌడ్, శామీర్‌పేట మండల కార్యదర్శి డిజి నరేంద్రప్రసాద్‌ల ఆధ్వర్యంలో ధర్మబిక్షం చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళ్లర్పించారు. ఈ కార్యక్రమంలో బొమ్మలపల్లి వెంకటేష్‌యాదవ్, కొంపల్లి యాదగిరిగౌడ్, మల్లేష్‌యాదవ్, కొంపల్లి కృష్ణగౌడ్, నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.



## ఉచిత వైద్య శిబిరాన్ని కార్మికులు సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాపక్షం/ ఘట్‌కేసర్‌ః మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్యాన్ని కాపాడాలనే లక్ష్యంతో సర్వజన ఫౌండేషన్ సహకారంతో మల్టీ స్పెషాలిటీ ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించామని డిప్యూటీ కమిషనర్ వాణి తెలిపారు. శిబిరంలో మున్సిపల్ కార్మికులు 556 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు చేయించుకున్నారని 220 మంది సిబ్బందికి కంటి పరీక్షలను నిర్వహించామని తెలిపారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కార్మికులు ప్రతి ఒక్కరు తప్పనిసరిగా మూడు నెలలకోసారి వైద్య పరీక్షలు చేయించుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం వల్ల కార్మికులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తమ ఆరోగ్యం పట్ల అవగాహన కలిగి సరైన సమయంలో వైద్య పరీక్షలు చేయించుకొని డాక్టర్ సలహా మేరకు సరైన మందులను వాడితే ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యూఎం ఏఈ చంద్రశేఖర్, ఏఎంసీ వేణుగోపాల్,సిఓఓ ప్రవీణ్ కుమార్,ప్రోగ్రామ్ మేనేజర్ అనిల్, అబ్దుల్, అర్చన, తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్ ఎలక్ట్రానిక్ మీడియా నూతన కమిటీ అధ్యక్షుడిగా ప్రసాద్

ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి : మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ ఉమ్మడి శామీర్ పేట ఎలక్ట్రానిక్ మీడియా నూతన కమిటీ అధ్యక్షుడిగా ఎల్లం ప్రసాద్ ఎన్నికయ్యారు. వైస్ ప్రసిడెంట్‌గా గోపాల్, జనరల్ సెక్రటరీగా శరత్‌చంద్ర, జాయింట్ సెక్రటరిగా నవీన్, కోశాధికారిగా సూర్య, గౌరవ అధ్యక్షుడిగా సుక్క రవి, సత్యపాల్ రెడ్డి, సభ్యులుగా కిరణ్, చందు ముదరాజ్, నాగేష్, రాజశేఖర్, కిరణ్, ప్రవీణ్, శ్రీనివాసరెడ్డి, రాకేష్, శ్రీనివస్, పురేందర్‌లు ఎన్నికయ్యారు.





## ప్రభుత్వ కార్యాలయాలను సందర్శించిన హైమారెడ్డి

ప్రజాపక్షం/శామీర్‌పేట : మహిళా శక్తి మై వాయిస్ వ్యవస్థాపక అధ్యక్షురాలు హైమారెడ్డి అలియాబాద్ మున్సిపల్‌లో గురువారం పర్యటించారు. అలియాబాద్‌లోని ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో విద్యార్థులకు కల్పిస్తున్న మౌలిక వసతులను తెలుసుకున్నారు. అలాగే పల్లె దవాఖానా సందర్శించి రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో అంబటి రమేష్, బిజెపి నాయకులు మహేష్, బ్రహ్మానందరెడ్డి, శరత్‌కుమార్, ప్రశాంతగౌడ్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.




## డివిజన్ సమస్యలపై జలమండలి ఇడితో భేటీ

ప్రజాపక్షం/ఉప్పల్ : మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నాచారం డివిజన్‌కు సంబంధించిన భూగర్భ డ్రైనేజీ,మంచినీటి సమస్యలపై మాజీ కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ జలమండలి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పంకజతో సైనిక్ పూరి కార్యాలయంలో భేటీ అయ్యారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్పొరేటర్‌గా ఉన్న సమయంలో ఎమ్మెల్యే సహకారంతో మంజూరు చేయించిన అనేక పనులు నెలలు గడిచినా ఇప్పటివరకు ప్రారంభం కాలేదని తెలిపారు. అలాగే గత కౌన్సిల్‌లో కార్పొరేటర్లకు కేటాయించిన కోటి రూపాయల బడ్జెట్‌లో నుంచి 20 లక్షల రూపాయల నిధుల కోసం జలమండలికి ప్రతిపాదనలు పంపినప్పటికీ ఇప్పటివరకు మంజూరు కాలేదని వివరించారు. శ్రీ రాఘవేంద్ర నగర్‌లో మంచినీటి పైప్‌లైన్ 8 అడుగుల లోతులో ఉండటం వల్ల రోడ్డు పనులు ప్రారంభించలేకపోతున్నామని, కొత్త పైప్‌లైన్ ఏర్పాటు కోసం ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. ఈ పనులను తక్షణమే ప్రారంభించాలని అధికారులను కోరారు. కావున, ఇప్పటికే మంజూరైన పనులను వెంటనే ప్రారంభించడంతో పాటు కార్పొరేటర్ బడ్జెట్‌లోని 20 లక్షల రూపాయలను కూడా త్వరితగతిన విడుదల చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ అంశాలపై సానుకూలంగా స్పందించిన జలమండలి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పంకజ, త్వరలోనే పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు.

## అక్రమ కలప రవాణా పట్టివేత

### వివరాలు వెల్లడించిన నవాబ్ పేట్ ఎస్సై కె.గిరి

ప్రజాపక్షం/నవాబుపేట్ : అక్రమం గా తరలిస్తున్న ఓ కలప వాహనాన్ని పోలీసులు పట్టుకున్న సంఘటన బుధవారం రాత్రి నవాబ్ పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. నవాబ్ పేట్ ఎస్సై గిరి తెలిపిన వివరా లు ఇలా ఉన్నాయి. నవాబ్ పేట్ మండలం మాదిరెడ్డిపల్లి గ్రామ సమీపంలో బ్లు కోట్ సిబ్బంది బుధవారం రాత్రి విధులు నిర్వహిస్తుండగా నవాబ్ పేట్ వైపు నుండి వస్తున్న అశోక్ లే ల్యాండ్ వాహనం ఆపి తనిఖీ చేయగా అందులో కలప ఉంది. కలప సంబంధించిన అనుమతి పత్రాలు చూపాలని డ్రైవర్ వారు విచారించగ లేవని డ్రైవర్ సమాధానం ఇవ్వడంతో ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా కలప తరలిస్తున్నారని గుర్తించారు. దీంతో వాహనం పోలీస్ స్టేషన్ తరలించి కేసు నమోదు చేసి ఫారెస్ట్ అధికారులకు అప్పగించినట్లు ఎస్సై గిరి తెలిపారు.



## లక్ష్యాలకు అనుగుణంగా సిసి రోడ్డు అంగన్వాడీ బిల్డింగ్స్

### కలెక్టర్ దీపక్ తివారి

ప్రజాపక్షం/వికారాబాద్ : లక్ష్యాలకు అనుగుణంగా సిసి రోడ్లు అంగన్వాడీ బిల్డింగ్స్, ఎస్ఎస్ జీవన నిర్మాణ పనులు,స్కూల్ కాంపౌండ్ వాల్ పనులపై దృష్టి సారించి 100శాతం పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అధికారులను అదేశించారు. వికారాబాద్ కలెక్టర్ కార్యాలయం నుండి వీడియోకాన్ఫిరేన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సిసి రోడ్లు తదితర పనుల అయినటువంటి పనులకు 100వాతం పూర్తిచేసి ఎంబి రికార్డ్ పూర్తి చేయాలని అన్నారు. ఇంతకు ముందే మంజురైన పనులను వెంటనే పూర్తి చేసి రిపోర్టు పంపించాలన్నారు. ఇప్పటికైనా మంజురైన పనులనువెంటనే పూర్తి చేసి రిపోర్టు ఇవ్వలన్నారు. మంజురైన పనులను వెంట నే పూర్తి చేయాలని సంబంధిత అధికారులను అదేశించారు. ఈకార్యాక్రమంలో జిల్లా అదనపు కలెక్టరల్ ఉమా శంకర్ ప్రసాద్ , ట్రైనింగ్ కలెక్టర్ హర్స్ చౌదరి, సుధీర్, శ్రీనివాస్ , తదితరులు పాల్గోన్నారు.



## రైతుల నిరసన

ప్రజాపక్షం/పరిగిః అభివృద్ధి పేరుతో బలవంతపు భూసేకరణ నోటిఫికేషన్ వెంటనే రద్దు చేయాలని కాడ్లపూర్,పాపోల్ రెండు గ్రామాలలో కలిసి 1197 ఎకరాల భూసేకరణ నోటిఫికేషన్ విరమించుకోవాలని రైతులు పరిగి బస్టాండ్ సమీపంలో బీజపూర్ నేషనల్ హౌవేపై బెటియించి నిరసన తెలిపారు. రైతుల నిరసనతో బీజాపూర్ హైవేపై భారీగా నిలిచిపోయిన వాహనాలు , వీరికి వివిధ పార్టీల నాయకులు మద్దతు తెలిపారు. రోడ్డుపై రైతులు బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన చేస్తుంటే అడ్డుకున్న పోలీసులు,రైతులకు పోలీసులకు మధ్య ఉద్రిక్తత ఏర్పడింది. అనంతరం పరిగి తహసీల్దార్ వెంకటేశ్వరికి వినతి పత్రం అందజేశారు .

## సిసి రోడ్డు ప్రారంభం

ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్ : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని నిజాంపేట్ విలేజ్, ఇంద్రన్న కాలనీలో సిసి రోడ్డు పూర్తిగా పాడవటంతో తీవ్ర ఇబ్బంది అవుతుండడంతో కాలనీ వాసులు నియోజకవర్గ ఇంచార్జి కొలన్ హన్మంత్‌రెడ్డిని సంప్రదించగా, సదురు అధికారులతో మాట్లాడి జిహెచ్ఎంసి మున్సిపల్ ఫండ్స్ ద్వారా సిసి రోడ్ నిర్మాణానికి మంజూరు చేయించారు. పూర్తయిన సిసి రోడ్డును గురువారం హన్మంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా అవసారలకు అనుగుణంగా మౌలిక వసతులు కల్పించడమే తన లక్ష్యమని అన్నారు. అనంతరం కాలనీ వాసులు ఆయనను శాలువాతో సత్కరించి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి, కలన్ రాజశేఖర్‌రెడ్డి, కాలనీ నిర్మాత కుంచెల సైదప్ప, కుంచల రాము, సరళ, లక్ష్మ న్న, పి.ప్రభాకర్‌రెడ్డి, పాలబిందెల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపక్షం
Telugu National Daily
హైదరాబాద్
శుక్రవారం
27-03-2026
www.prajapaksham.in



"ఐదు దశాబ్దాల అసాధారణ వారసత్వాన్ని పురస్కరించుకుని, ప్రతిష్ఠాత్మకమైన భరత్ మండపంలో జరిగిన అంతర్జాతీయ ఢిల్లీ చలనచిత్రోత్సవం 2026లో నందమూరి బాలకృష్ణకు జీవిత సాఫల్య పురస్కారాన్ని ప్రదానం చేశారు. 50 ఏళ్ల ప్రస్థానంలో సినిమాసేవకు గుర్తింపు."

## ఐఎఫ్ఎఫ్‌డిలో బాలకృష్ణకు జీవిత సాఫల్య పురస్కారం

ఐదు దశాబ్దాల అసాధారణ వారసత్వాన్ని పురస్కరించుకుని, ప్రతిష్ఠాత్మకమైన భరత్ మండపంలో జరిగిన అంతర్జాతీయ ఢిల్లీ చలనచిత్రోత్సవం (ఐఎఫ్ఎఫ్‌డి) 2026లో నందమూరి బాలకృష్ణకు జీవిత సాఫల్య పురస్కారాన్ని ప్రదానం చేశారు. 50 ఏళ్ల ప్రస్థానంలో భారతీయ సినిమాకు ఆయన చేసిన అపారమైన సేవకు గుర్తింపుగా, నటన కళ పట్ల ఆయనకున్న చెరగని ప్రభావం, బహుముఖ ప్రజ్ఞ, అసమానమైన అంకితభావానికి నివాళిగా ఈ పురస్కారాన్ని ఉత్సవ నిర్వాహకులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా చేతుల మీదుగా ఆయన ఈ పురస్కారాన్ని అందుకున్నారు.ఆయన ఇటీవల విజయాలకు అదనంగా, అనిల్ రావిపూడి దర్శకత్వం వహించిన ఆయన చిత్రం 'భగవంత్ కేసరి' 71వ జాతీయ చలనచిత్ర పురస్కారాలలో తెలుగులో ఉత్తమ చలనచిత్రంగా గౌరవించబడింది. బాలకృష్ణ తన శక్తివంతమైన నటన, అద్భుతమైన తెరపై ఉనికి, మరియు ప్రేక్షకులతో చెరగని అనుబంధంతో భారతీయ సినిమాలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని ఏర్పరుచుకున్నారు. పౌరాణిక ఇతిహాసాల నుండి మాస్ ఎంటర్‌టైనర్ల వరకు, ఆయన చేసిన చిత్రాలు వైవిధ్యాన్ని, స్థిరత్వాన్ని ప్రతిబింబిస్తాయి, తద్వారా ఆయన తెలుగు సినిమా రంగంలో అత్యంత ప్రసిద్ధ వ్యక్తులలో ఒకరిగా నిలిచారు.



## 'వనజీవిరామయ్య'లో నటించడం ఓ తీపి జ్ఞాపకం

గద్దర్ అవార్డు బాధ్యతను పెంచింది : హీరోయిన్ నాగరాణి రెడ్డి



తెలుగు సినీ కళా తల్లి ఎప్పుడు ఎవరి కీ ఎలాంటి అవకాశం ఇస్తుందో ఎవరూ ఊహించలేరు. కొంతమంది ఎన్నో ఏళ్ల తరబడి ఎదురు చూసినా మంచి పాత్రలు లభించవు. కానీ కొంతమందికి అదృష్టం తలుపుతట్టినట్లు పాత్రలు వస్తుంటాయి. అలాంటి ఒక్క పాత్ర కోసమే హీరోయిన్లు, నటీమణులు ఎదురుచూస్తుంటారు. అలాంటి గొప్ప పాత్రలో నటించే ఛాన్స్ తనకు రావడం జీవితంలో మరపురానిదని అనుభూతిగా మిగిలిందని అంటోంది హీరోయిన్ నాగరాణి రెడ్డి. వనసంపదని ప్రేమించి, వనసంపద కోసమే జీవించిన వ్యక్తి వనజీవి రామయ్య. ఆయన జీవిత కథను 'వనజీవిరామయ్య' పేరుతోనే దర్శకుడు వేము సినిమాగా రోపొందించారు. ఈ సినిమాకు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల గద్దర్ అవార్డు ఇచ్చి ఘనంగా సత్కరించింది. ఇందులో వనజీవి రామయ్యగా నటుడు బ్రహ్మాజీ న టించగా, ఆయనకు భార్య జానకమ్మగా నాగరాణి రెడ్డి చక్కటి పాత్రను పోషించింది. ఈ సినిమాకు గద్దర్ అవార్డు వచ్చిన సందర్భంగా నాగరాణి రెడ్డి మీడియాతో ముచ్చటించారు. ప్రభుత్వం గుర్తించి గద్దర్ అవార్డు ఇవ్వడం అనేది జీవితంలో కొత్త అనుభూతినిచ్చింది. తెలుగు సినీ, వెబ్ సిరీస్, ప్రకటనల రంగాలలో తన ప్రత్యేక గుర్తింపును సంపాదించుకున్న యువ నటీమణి నాగరాణి రెడ్డి సినీ ప్రయాణంలో తన ప్రతిభతో ప్రేక్షకులను ఆకట్టుకుంటూ ముందుకు సాగుతున్నారు. సినీ జీవితంలో ప్రత్యేకంగా నిలిచిపోయే చిత్రం వనజీవి రామయ్య. ఈ చిత్రంలో నేను పోషించిన జానకమ్మ పాత్ర ప్రేక్షకుల హృదయాలను హత్తుకునేలా అద్భుతంగా మలిచారు. పాత్రలోని భావోద్వేగాలను సహజంగా వ్యక్తపరచడం ద్వారా నటనలో ఉన్న లోతును చాటి చెప్పారు. ఈ చిత్రానికి తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకమైన గద్దర్ అవార్డు ప్రకటించడం ఆ చిత్ర బృందానికి మాత్రమే కాకుండా తన నటనా ప్రతిభకు కూడా లభించిన గొప్ప గౌరవంగా భావిస్తున్నాను. వనజీవి రామయ్యలో జానకమ్మగా ఆమె చూపిన నటన, గద్దర్ అవార్డు గౌరవంతో మరింత ప్రాముఖ్యతను సంతరించుకుంది. భవిష్యత్తులో ఆమె మరిన్ని విశిష్ట పాత్రలతో ప్రేక్షకులను అలరిస్థానాన్ని నాగరాణి అంటోంది.

## 'బర్బరీకుడు' ద సినాప్ష్ ఘటోత్కచ షూటింగ్ షురూ

పి పి మూవీ మేకర్స్, రేణుక ఎల్లమ్మ క్రియేషన్స్ బ్యానర్ లపై టి. మల్లేశ్వరుడు, అంతటి నరేష్ కుమార్, అంతటి రాజేష్ కుమార్ నిర్మాతలుగా శివకుమార్ గుర్రేగాల దర్శకత్వంలో తెరకెక్కుతున్న తాజా చిత్రం బర్బరీకుడు. అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కుతున్న బర్బరీకుడు చిత్రం ఘనంగా పూజా కార్యక్రమంతో ప్రారంభమైంది. మహాభారత కురుక్షేత్ర యుద్ధంలోని ఒక యోధుడి కథతో ఈ చిత్రం తెరకెక్కుతోంది. సంగీత దర్శకుడు ఎం.ఎం కీరవాణి తండ్రి శివ శక్తి దత్త శిష్యుడిగా తెలుగు సినిమా పరిశ్రమలో ఎన్నో సినిమాలకు అసిస్టెంట్ డైరెక్టర్ గా, అలాగే పాటల రచయితగా పనిచేసిన శివకుమార్ గుర్రేగాల ఈ చిత్రంతో దర్శకుడిగా అరంగేట్రం చేస్తున్నారు. తెలుగు ప్రజల హృదయాలను కొల్లగొట్టేందుకు భారతీయ అతిపెద్ద ఇతిహాసం మహాభారతంలోని ఒక యోధుడి కథను తెరకెక్కించబోతున్నారు. ఈ విషయంలో దర్శకుడు తో పాటు నిర్మాతల అభిరుచిని కూడా అభినందించాల్సిందే. సినిమా అంటే అభిమానం, ప్రేమ ఉంటే తప్ప ఇలాంటి కథలను నిర్మించరు. ఈ విషయంలో చిత్ర నిర్మాతలు టి. మల్లేశ్వరుడు, అంతటి నరేష్ కుమార్, అంతటి రాజేష్ కుమార్ లు అభినందనీయులు. తాము రూపొందిస్తున్న బర్బరీకుడు చిత్రం కచ్చితంగా ప్రేక్షకుల హృదయాలను గెలుచుకుంటుందని నమ్మకం వ్యక్తం చేస్తున్నారు. చాలామందికి బర్బరీకుడు చరిత్ర గురించి తక్కువగా తెలుసని చిత్ర నిర్మాతలు చెప్పారు.ఎన్నో సూపర్ హిట్ చిత్రాలకు ఫైట్ కొరియోగ్రఫీ చేసిన రామ్ లక్ష్మణ్ ల శిష్యుడు, స్టంట్ మాస్టర్ బద్రి మాస్టర్ అల్లుడు అయినా కృష్ణ భరత్ ఈ చిత్రం ద్వారా కథానాయకుడిగా పరిచయం అవుతున్నారు.




## ఘనంగా 'సుయోధన' ప్రీ రిలీజ్



ప్రజ్వాలా లైన్ క్రియేషన్స్ బ్యానర్‌పై ప్రియదర్శి, ద్రిషిక చందర్ హీరో హీరోయిన్‌గా డైలాగ్ కింగ్ సాయి కుమార్, సీనియర్ హీరోయిన్ ప్రేమ కీలకపాత్రల్లో నటించిన చిత్రం 'సుయోధన'. వై.ఎస్ మాధవ్ రెడ్డి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని బోసు బాబు నిడుమోలు నిర్మిస్తున్నారు. ఈ సినిమా ఈ నెల 27న ప్రపంచవ్యాప్తంగా విడుదల అవుతోంది. శ్రీ లక్ష్మి పిక్చర్స్ సంస్థ 'సుయోధన' సినిమాను విడుదల చేస్తోంది. ఈ సినిమా ప్రీ రిలీజ్ ప్రెస్ మీట్ హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హీరోయిన్ ద్రిషిక చందర్ మాట్లాడుతూ ఈ చిత్రంలో సుమిత అనే క్యారెక్టర్‌లో నటిస్తున్నాను. ఈ క్యారెక్టర్‌లో నటించే అవకాశం కల్పించిన దర్శక నిర్మాతలకు థ్యాంక్స్. సాయికుమార్, ప్రియదర్శి లాంటి మంచి ఆర్టిస్టులతో స్క్రీన్ షేర్ చేసుకోవడం సంతోషంగా ఉంది. ఈ మూవీ మీ అందరినీ ఆకట్టుకుంటుంది. ఈ నెల 27న థియేటర్స్‌లో మీట్ అవుదాం అన్నారు. హీరో ప్రియదర్శి మాట్లాడుతూ ఈ చిత్రంలో సుయోధన పాత్రకు ఆయన తప్ప మరో ప్రత్యామ్నాయం లేదు. అంత బాగా నటించారు. ప్రేక్షకుల ఊహకు అందనంత ఆసక్తికరంగా సాగే చిత్రమిది. సాయి కుమార్ మాట్లాడుతూ నేను 1972లో ధుర్యోధనుడి పాత్రను నాటికలో అభినయించాను. అప్పటికి నా వయసు 11 ఏళ్లు. ఇప్పుడు ఈ చిత్రంలో సుయోధనుడిగా నటిస్తుంటే ఆ రోజులు గుర్తుకువచ్చాయి. ఈ ప్రెస్ మీట్ లో ఆర్ట్ డైరెక్టర్ బ్రహ్మ కడలి, మ్యూజిక్ డైరెక్టర్ జై క్రిష్, ఎడిటర్ ఛోటా కె ప్రసాద్, నిర్మాత బోసు బాబు నిడుమోలు, డిస్ట్రిబ్యూటర్ బాపిరాజు, డైరెక్టర్ వైఎస్ మాధవ్ రెడ్డి, యాక్టర్ దేవిప్రసాద్ పాల్గొన్నారు.

## 'పెద్ది' రెగ్యులర్ షూటింగ్‌లో రామ్ చరణ్



పెద్ది సినిమా షూటింగ్ సమయంలో చిన్నగా గాయపడ్డ రామ్ చరణ్ క్షేమంగా ఉన్నారు. షూటింగ్ లో పాల్గొంటున్నారు. అని చిత్ర నిర్మాతలు పేర్కొన్నారు. వచ్చేనెలలోనే ఈ సినిమా విడుదల కానున్న నేపథ్యంలో శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్నారు. 'పెద్ది సినిమా సెట్స్‌లో నిన్న జరిగిన చిన్న ఘటన గురించి వచ్చిన వార్తలపై స్పష్టత ఇవ్వాలనుకుంటున్నాం. రామ్ చరణ్ పూర్తిగా క్షేమంగా ఉన్నారు. షూటింగ్ సమయంలో ఎడమ కంటికి చిన్న గాయం కావడంతో చికిత్స చేశారు.ఆయన తిరిగి షూటింగ్‌లో పాల్గొంటారు. షూటింగ్ షెడ్యూల్‌కు ఎలాంటి అంతరాయం లేదు. ఆందోళన పడాల్సిన అవసరం లేదు. అన్నీ కంట్రోల్ వున్నాయి ఉన్నాయి. సినిమా పనులు సజావుగా కొనసాగుతున్నాయి అని నిర్మాతలు తెలిపారు. రామ్ చరణ్ పాన్‌ఇండియా యాక్షన్ డ్రామా పెద్ది సినిమాకు బుచ్చిబాబు సనా దర్శకత్వంలో, వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు నిర్మించిన ఈ చిత్రం ఏప్రిల్ 30న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదలకు సిద్ధమవుతోంది. పెద్ది ప్రమోషనల్ కంటెంట్ ఇప్పటికే సంచలనం క్రియేట్ చేస్తోంది. పెద్ది ఫస్ట్ షాట్ కి ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది.ఎఆర్ రెహమాన్ అందించిన సౌండ్ ట్రాక్స్ మెగా చార్ట్ బస్టర్ హిట్స్ గా నిలిచాయి. చికిరి చికిరి, రైరై రా రా పాటలు వరల్డ్ వైడ్ వైరల్ అయ్యాయి. 'పెద్ది' గేమ్ గ్లింప్స్ మార్చి 27 ఉదయం 11 గంటల 7 నిమిషాలకు రిలీజ్ కానుంది. ఈ గ్లింప్స్ మాస్ ర్యాంపేజ్ గా ఉండబోతుంది. ఈ చిత్రంలో జాన్వీ కపూర్ హీరోయిన్ గా నటిస్తోంది. శివ రాజ్‌కుమార్, జగపతి బాబు, దివ్యేందు, బోమన్ ఇరానీ ఇతర ప్రముఖ పాత్రలను పోషిస్తున్నారు. సినిమాటోగ్రాఫర్ ఆర్ రత్నవేలు, ఎడిటర్ నవీన్ నూలి, ప్రొడక్షన్ డిజైనర్ అవినాష్ కొల్లా పని చేస్తున్నారు. ఈ చిత్రానికి సహ నిర్మాత: ఇషాన్ సక్సేనా, సంగీతం: ఏఆర్ రెహమాన్, డీఓపీ : ఆర్ రత్నవేలు, ఎడిటర్: నవీన్ నూలి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: వి.వై.ప్రవీణ్ కుమార్.

## మధ్యతరగతి కుటుంబ కథ 'కార్మేని సెల్వం'

పాత్వే ప్రొడక్షన్స్ బ్యానర్‌పై అరుణ్ రంగరాజులు నిర్మాతగా రామ్ చక్రి దర్శకత్వంలో తెలుగు, తమిళ భాషల్లో రూపొందిన ద్విభాషా చిత్రం 'కార్మేని సెల్వం'. విలక్షణ నటులు సముద్రఖని ప్రధాన పాత్ర పోషిస్తున్న ఈ చిత్రంలో గౌతమ్ వాసుదేవ్ మీనన్ కీలక పాత్రలో కనిపించనున్నారు. లక్ష్మీ ప్రియా, అభినయ కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రం ఏప్రిల్ 3న తెలుగు, తమిళ భాషల్లో గ్రాండ్‌గా థియేట్రికల్ రిలీజ్ కాబోతుంది. ప్రముఖ డిస్ట్రిబ్యూషన్ సంస్థ పివిఆర్ ఐనాక్స్ పిక్చర్స్ ద్వారా ఈ చిత్రం థియేటర్స్‌లోకి రాబోతుంది. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్, టీజర్ సినిమాపై ఆసక్తిని పెంచగా గురువారం ట్రైలర్ ను రిలీజ్ చేశారు. ప్రస్తుత ట్రెండ్‌కు కనెక్ట్ అయ్యే విధంగా ఫ్యామిలీ ఎమోషన్స్‌తో విడుదలైన ట్రైలర్ సినిమాపై అంచనాలు పెంచుతోంది. ఈ సందర్భంగా హైదరాబాద్ లో ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సముద్రఖనితో వర్క్ చేసిన తెలుగు డైరెక్టర్స్ 'విమానం' ఫేమ్ శివ ప్రసాద్, 'రామం రాఘవం' ఫేమ్ ధనరాజ్, 'సేవ్ ద టైగర్స్' ఫేమ్ తేజ కాకుమాను అతిథులుగా హాజరయ్యారు.






## పార్టీలకతీతంగా గౌరవించే గొప్ప వ్యక్తి బొమ్మగాని ధర్మబిక్షం





### సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రముఖ స్వాతంత్ర సమరయోధులు, మాజీ పార్లమెంట్ సభ్యులు, ప్రజా నాయకుడు, పార్టీలకతీతంగా గౌరవించే గొప్ప వ్యక్తి బొమ్మగాని ధర్మబిక్షమని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, శాసనసభ్యులు కూనంనేని సాంబశివ రావు అన్నారు. బొమ్మగాని ధర్మబిక్షం 15వ వర్ధంతి సందర్భంగా గురువారం సిపిఐ రాష్ట్ర కార్యాలయం ముఖ్దూంభవన్‌లో ఆయన చిత్రపటానికి వారు పూలమాలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పల్లా వెంకట రెడ్డి మాట్లాడుతూ ధర్మబిక్షం అన్ని వర్గాల ప్రజలకు ఆత్మీయుడని, ఆయన పెట్టని సంఘాలంటూ లేవని, కార్మిక సంఘాలు, గీత కార్మిక సంఘం ఇలా అనేక సంఘాలు ఏర్పాటు చేసి, పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయని చాటి చెప్పిన గొప్ప నాయకుడని కొనియాడారు. కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ ధర్మబిక్షం జీవితం ఆదర్శమని, వారి ఆశయాల సాధన కోసం అందరం కలిసికట్టుగా ఆయన మార్గంలో నడవాలన్నారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శులు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, ఈ.టి.నరసింహ, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు మణికంఠ రెడ్డి, గీత పనివారల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.జి.సాయిల్ గౌడ్, గీత పని వారల సంఘం నాయకులు బొమ్మగాని నాగభూషణం, కెవిఎల్, ఎం.ప్రవీణ్‌కుమార్ గౌడ్, ఎఐఎస్ఎఫ్ నాయకులు ఎ.రహమాన్ కూడా ధర్మబిక్షం చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

**ధర్మబిక్షం ప్రజానేత, పేదల పక్షపాతి:**

**టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్**

నిజాయితీకి మారు పేరుగా, క్రమశిక్షణతో, సిద్ధాంతాల కోసం బతికున్నంత కాలం ప్రజల కోసం పనిచేసిన బొమ్మగాని ధర్మబిక్షం రాజకీయ జీవితం నేటి యువతరానికి ఆదర్శమని టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్‌కుమార్ గౌడ్ కొనయా డారు. ప్రముఖ కమ్యూనిస్టు నాయకులు, సీనియర్ ప్రజాప్రతినిధి, తెలంగాణ సాయుధ పోరాట యోధులు బొమ్మగాని ధర్మ భిక్షం వర్ధంతి సందర్భంగా గురువారం మహేష్ కుమార్ గౌడ్ నివాళులు అర్పించారు. ప్రముఖ కమ్యూనిస్టు నాయకులుగా, తెలంగాణ సాయుధ పోరాట యోధులుగా, స్వతంత్ర సమరయోధునిగా బొమ్మగాని ధర్మ బిక్షం అందించిన సేవలను మహేష్‌కుమార్ గౌడ్ ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు.

## విగ్రహావిష్కరణ

(మొదటి పేజీ తరువాయి)

గీతా కార్మికులపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా గీత కార్మికులను ఏకం చేసి ఆనాటి ప్రభుత్వాలు గీతా కార్మికులకు తాటి చెట్టుపన్ను, అడ్డ పన్నును రద్దు చేయాలని గీతా పనివారల సంఘం స్థాపించి రద్దు చేసే అంత వరకు అవిశ్రాంతంగా పోరాటం చేసి సాదించిన గొప్ప నాయకుడు ధర్మ భిక్షం అన్నారు. ఆయన జీవితంలో ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై అనేక పోరాటాలు చేసి నల్లగొండ, నకిరేకల్, సూర్యాపేట శాసనసభ్యులుగా, నల్లగొండ పార్లమెంట్ సభ్యులుగా రెండు పర్యాయాలుగా గెలుపొంది చట్టసభలలో, బయట ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి పరిష్కరించే దిశగా పోరాటం చేసిన మహా గొప్ప నాయకుడు అన్నారు. ఈ కార్యక్రమంలో గీతా పనివారల సంఘం జిల్లా అధ్యక్షులు చాపల అంజయ్య, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నూనె ముందల విమల వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ నర్సింహారెడ్డి, మున్సిపాలిటీ చైర్మన్ గడ్డం స్వప్న సోమనసయ్య, వైస్ చైర్మన్ పల్లెర్ల వెంకన్న, గీత పనివారల సంఘం రాష్ట్ర నాయకులు నాగభూషణం సాయిల్ గౌడ్, టిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు కంచర్ల రామకృష్ణారెడ్డి, సిపిఐ యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి, సహాయ కార్యదర్శులు చెడచంద్రయ్య, బాలగోని సత్యనారాయణ, సిపిఐ గీతా పనివాళ్ల సంఘం నాయకులు ఎండి ఇమ్రాన్, ఉప్పల ముత్యాలు, కుసుమంచారి చంద్ర, బండి జంగమ్మ, వెంకట్, శ్రీను, పుల్కర్ మల్లేష్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేలకు నోటీసులు

(మొదటి పేజీ తరువాయి)

డివిజన్ బెంచ్ గురువారం విచారించింది. ఇప్పటికే ఏడుగురు పార్టీ పిరాయింపు ఎమ్మెల్యేలకు హైకోర్టు నోటీసులు ఇచ్చింది. దానం నాగేందర్‌పై బిజెపి వేసిన పిటిషన్‌లో కూడా ఇదివరకే నోటీసులు ఇచ్చింది. ఈ కేసులన్నింటినీ కలిపి ఏప్రిల్ 16న విచారిస్తామని డివిజన్ బెంచ్ ప్రకటించింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరినట్లుగా కచ్చితమైన ఆధారాలు చూపినా వాటిని స్పీకర్ పట్టించుకోలేదని, ట్రిబ్యునల్ చైర్మన్ హోదాలో స్పీకర్ ఇచ్చిన తీర్పు చట్ట వ్యతిరేకమని, రాజ్యాంగ విరుద్ధమని పిటిషనర్ లాయర్ వాదించారు. పిరాయింపులకు పాల్పడిన ఎమ్మెల్యేలపై అనర్హత చర్యలు తీసుకోవాలని కోరారు. పిరాయింపు ఎమ్మెల్యేలపై దాఖలైన ఇతర కేసులతో కలిపి విచారిస్తామని బెంచ్ స్పష్టం చేసింది.




## ట్రంప్ చైనా పర్యటన

(మొదటి పేజీ తరువాయి)

మీడియాతో మాట్లాడుతూ, ట్రంప్ పర్యటన నిమిత్తం రెండు దేశాల ప్రతినిధులమధ్య సంప్రదింపులు జరుగుతున్నాయని చెప్పారు. యుద్ధ పరిస్థితిని జిన్‌పింగ్ అర్థం చేసుకున్నారని, అందుకే ట్రంప్ పర్యటన వాయిదాకు ఆయన అంగీకరించారని వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ చెప్పారు. ట్రంప్ చైనా పర్యటన నాటికి యుద్ధ పరిస్థితులు సర్దుమణుగుతాయా? అని పాత్రికేయులు ప్రశ్నించగా, యుద్ధం ముగియడానికి సాధారణంగా నాలుగు నుండి ఆరు వారాలు పడుతుందని తాము అంచనావేశామని, దాన్నిబట్టి మీరు అర్థం చేసుకోవాలని లీవిట్ చెప్పారు. 2017 నవంబరులో అధ్యక్ష హోదాలో మొదటిసారి ట్రంప్ చైనా వెళ్ళి జిన్‌పింగ్‌ను కలుసుకున్నారు. ఆ తర్వాత గత ఏడాది అక్టోబరునెలలో దక్షిణ కొరియాలో జరిగిన ఎపెక్ సమావేశంలో మళ్ళీ వారిద్దరూ సమావేశమయ్యారు.వాణిజ్య ఘర్షణలు, సాంకేతిక పోటీ, భౌగోళిక ఉద్రిక్తలు వంటి అనేక అంశాలలో అమెరికా—చైనా మధ్య తీవ్ర సంఘర్షణలు జరుగుతున్నాయి. ట్రంప్ పర్యటనతో ఈ విషయాలలో ఏ కొంతైనా ఉపశమనం లభిస్తుందా? అని అందరూ ఎదురుచూస్తున్నారు.

## వీడియో కాన్ఫరెన్స్

(మొదటి పేజీ తరువాయి)

స్ఫూర్తితో అన్ని విభాగాల సమన్వయంతో పనిచేసేలా చూడటంపై ఈ సమావేశం దృష్టి సారిస్తుంది' అని వర్గాలు తెలిపాయి. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసిసి) కారణంగా ఎన్నికలు జరగనున్న రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఈ సమావేశంలో పాల్గొనరు. ఎన్నికలు జరగనున్న తమిళనాడు, పశ్చిమ బెంగాల్, అసోం, కేరళ, పుదుచ్చేరి కేంద్రపాలిత ప్రాంతాల ముఖ్య కార్యదర్శులతో కేబినెట్ సచివాలయం ప్రత్యేక సమావేశం నిర్వహించనుంది.

## అంత తొందరెందుకు?

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించాలని ఖర్గే మరోసారి ఆ లేఖలో నొక్కి చెప్పారు. 'నారీ శక్తి వందన్ అధినియం, 2023' అమలు కోసం ఆ చట్టాన్ని సవరించే ప్రణాళికలపై కాంగ్రెస్ పార్టీతో సమావేశం కావాలని కోరుతూ కేంద్ర మంత్రి ఖర్గేకు రాసిన లేఖకు సమాధానంగా ఖర్గే ఈ లేఖను పంపారు. కేంద్రం పంపిన లేఖ అందిందని, 'నారీ శక్తి వందన్ అధినియం, 2023' అమలుపై చర్చించడానికి ఏప్రిల్ 29 తర్వాత అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని సూచిస్తూ ప్రతిపక్ష పార్టీలు ఇప్పటికే మీకు లేఖ రాశాయని కాంగ్రెస్ అధ్యక్షుడు పేర్కొన్నారు. 'ఒక రాజ్యాంగ సవరణ చట్టం ఆమోదం పొందిన 30 నెలల తర్వాత, దానిని మరింత సవరించడానికి ప్రభుత్వం ఎందుకు ఇంత తొందర పడుతుందో నాకు అస్సలు అర్థం కావడం లేదు. మేమందరం ప్రస్తుతం ఎన్నికల ప్రచారంలో అత్యంత బిజీగా ఉన్నాము. అందుకే ఎన్నికల ప్రచారం ముగిసిన తర్వాతే సమావేశం నిర్వహించాలని మేము సూచించాము' అని ఖర్గే తెలిపారు. దీనివల్ల, 2029 లోక్‌సభ ఎన్నికల నుండి సవరించిన 'నారీ శక్తి వందన్ అధినియం, 2023' అమలుకు ఎటువంటి ఆటంకం కలగదని ఆయన స్పష్టం చేశారు. వాస్తవానికి, సెప్టెంబర్ 21, 2023న రాజ్యసభలో జరిగిన చర్చ సందర్భంగా, 'నారీ శక్తి వందన్ అధినియం, 2023'ను తక్షణమే అమలు చేయాలని తానే స్వయంగా డిమాండ్ చేశానని, కానీ ప్రభుత్వం తన డిమాండ్‌ను అంగీకరించలేదన్నారు. ఏప్రిల్ 29 తర్వాత ఎప్పుడైనా అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని మిమ్మల్ని మరోసారి కోరుతున్నానన్నారు. మహిళా రిజర్వేషన్ల చట్టం అమలు విధానాలపై చర్చించడానికి అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని కోరుతూ పలు ప్రతిపక్ష పార్టీలు మంగళవారం ప్రభుత్వానికి లేఖ రాశాయి. ఏప్రిల్‌లో ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికలు పూర్తయిన తర్వాత ఈ సమావేశం జరగాలని రిజిజుకు రాసిన లేఖలో ప్రతిపక్ష నాయకులు పేర్కొన్నారు. 'మీరు కోరుకున్న విధంగా, నారీ వందన్ అధినియమ్, 2023 అమలుకు సంబంధించిన విధివిధానాలు, కార్యాచరణ ప్రణాళికపై చర్చించేందుకు, ప్రధానమంత్రి అధ్యక్షతన వీలైనంత త్వరగా అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని కోరుతూ తాను ఈనెల 16న మీకు లేఖ రాసిన విషయం మీకు గుర్తుండే ఉంటుందని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే లెటర్‌హెడ్‌పై రాసిన ఆ లేఖలో పేర్కొన్నారు. ఈ లేఖపై తృణమూల్ కాంగ్రెస్ మినహా పలు ప్రతిపక్ష పార్టీలు సంతకాలు చేశాయి.




Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com